

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com



visit us @ http://epaper.suryaa.com
శనివారం | 19 జనవరి 2019 | హైదరాబాద్
సంపుటి 12 | సంచిక 80
| పేజీలు 12+16 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, శుక్ల పక్ష తిథి : త్రయోదశి మ.3.52 నక్షత్రం. మృగశిర ఉ.8.53, వర్జ్యం ఉ.6.53 వరకు తిరిగి సా.4.54 నుంచి 6.26 వరకు
రాహుకాలం: ఉ.9.00 నుంచి 10.30 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.00 నుంచి 7.36 వరకు సూర్యోదయం : ఉ.6.38 గం; సూర్యాస్తమయం: సా.5.50



ఆసీస్‌పై పరిపూర్ణ విజయం

• వన్డే సీరీస్‌ను 2-1తో కైవసం చేసుకున్న భారత్ • ఆసీస్‌పై ఆఖరి వన్డేలో 6 వికెట్ల తేడాతో విజయం • మ్యాచ్ ఫినిషర్‌నని అనిపించుకున్న మహేంద్ర సింగ్ ధోనీ • వరుసగా మూడు మ్యాచ్‌ల్లో హాఫ్ సెంచరీలు బాదిన ధోనీ • టీ-20ని 1-1తో డ్రాచేసుకుని, టెస్ట్ సీరీస్‌ను 2-1తో గెలుచుకున్న భారత్ • ఆసీస్‌లో పర్యటించి అన్ని ఫార్మాట్ పోటీల్లో ఓటమిని ఎరుగకపోవడం ఇదే తొలిసారి • కోహ్లీ సేనపై అభినందనల వెల్లువ

12 లో

ఎన్టీఆర్‌కు ఘన నివాళి





దివంగత నేత ఎన్టీ రామారావు 23వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న నందమూరి బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్ తదితరులు

వివరాలు లోపలి పేజీల్లో

లక్ష్మీపుత్ర పోచారం



• స్పీకర్ గా బాధ్యతలను చేపట్టిన శ్రీనివాసరెడ్డి • అభినందిస్తూ ప్రసంగించిన సీఎం కేసీఆర్ • ఆయన తనకు పెద్దన్న వంటివాడని వ్యాఖ్య • వివాదరహితుడని కితాబు • పోచారం శ్రీనివాసరెడ్డిపై అధికార, ప్రతిపక్ష సభ్యుల ప్రశంసల జల్లు • ఏకగ్రీవానికి సహకరించిన ప్రతిపక్ష సభ్యులకు సీఎం కేసీఆర్ కృతజ్ఞతలు

తెలంగాణ శాసనసభకు స్పీకర్ గా ఎన్నికైన పోచారం శ్రీనివాసరెడ్డి, తనకు పెద్దన్న వంటివాడని, ఆయనకు తాను లక్ష్మీ పుత్రుడని ముద్దుగా పేరు పెట్టుకున్నానని సీఎం కేసీఆర్ తెలిపారు. శుక్రవారం ఉదయం అసెంబ్లీలో స్పీకర్ గా పోచారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయనను అభినందిస్తూ కేసీఆర్ మాట్లాడారు. పోచారం మాదిరిగానే, తాను కూడా సింగిల్ విండో సభ్యుడిగా పనిచేసి, ఆపై ఎమ్మెల్యేను అయ్యానని గుర్తు చేసుకున్నారు. గతంలో ఎన్నో కీలక మంత్రిత్వ శాఖలను సమర్థవంతంగా నిర్వహించారని, ఆయన గత అసెంబ్లీలో వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే, ఐరాస సహా, ప్రపంచమంతా గుర్తించిన 'రైతుబంధు' రైతుబీమా పథకాలు అమలు చేశామని అన్నారు.

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః పోచారం రాజకీయ ప్రస్తానంలో వ్యవసాయశాఖ నిర్వహించడం ఉజ్వలమైన ఘట్టంగా ఆయన పేర్కొన్నారు. కేబినెట్‌లో ఆయన లేకపోవడం ఒక విధంగా తనకు లోటేనని చెప్పారు. పోచారం స్థానంలో సమర్థుడికి బాధ్యతలు అప్పగిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలోనూ పోచారం పోరాడారని గుర్తు

మిగతా 6లో



కేసిఆర్‌కు మమతా బెనర్జీ ఆహ్వానం
కోల్‌కతాకు చంద్రబాబు







• నేడు కోల్‌కతాలో విపక్షాల భారీ ర్యాలీ • ఇప్పటికే చేరుకున్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు • ఆసక్తి కనబరచని తెలంగాణ సీఎం కేసీఆర్ • కాంగ్రెస్, టీడీపీ మద్దతు ఉండటంతోనే • హాజరుకానున్న పలు రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీల నేతలు • విజయవంతం చేస్తానన్న మమత

వివరాలు లోపలి పేజీల్లో

దీదీకి నా పూర్తి మద్దతు : రాహుల్ 11 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

మార్చి మొదటి వారంలో లోక్‌సభ షెడ్యూల్?



• ఆరు లేదా ఏడు విడతల్లో సార్వత్రిక ఎన్నికలు • తెలంగాణలో ఒకే దఫా • ఏపీలో రెండు దఫాలుగా ఎన్నికలు • వెల్లడించిన ఎన్నికల కమిషన్ వర్గాలు

6 లో

సిఎల్పీ నేతగా భట్టి విక్రమార్క



• సిఎల్పీ నేత ఎంపికపై నెలకొన్న ఉత్కంఠకు తెర • మల్లు భట్టి విక్రమార్కను నియమించిన అధిష్ఠానం • ఈ మేరకు ప్రకటన విడుదల

గులాబీ నీడన ఒంటేరు



• రాష్ట్రాల బలోపేతానికి ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు • జాతీయ రాజకీయాల్లో గుణాత్మక మార్పే లక్ష్యం • అందరి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్న సీఎం కేసీఆర్ • బీజేపీ అంటే బిల్డప్ జాతీయ పార్టీ • ప్రధాని, బీజేపీ సీఎంలు ప్రచారం చేసినా 103 స్థానాల్లో డిపాజిట్ గల్లంతు • బీజేపీ, కాంగ్రెస్ కలిసినా మ్యాజిక్ ఫిగర్ వచ్చే ఛాన్సే లేదు • కేంద్రంలో ప్రాంతీయ పార్టీల నిర్ణయాత్మక పాత్ర పోషించాలి • లోక్‌సభ ఎన్నికల్లో 16 స్థానాల్లో టీఆర్ఎస్ గెలువాలి • కేసీఆర్‌పై అక్కసుతోనే చంద్రబాబు విమర్శలు • ఇతరులను బూచిగా చూపి ప్రజల్ని గందరగోళపరిచే యత్నం • ఒంటేరు ప్రతాప్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం కేటీఆర్

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః రాష్ట్రాలను బలోపేతం చేయాలన్న దృష్టితో టీఆర్ఎస్ అధినేత ముఖ్యమంత్రి కేసీఆర్, బీజేపీ, కాంగ్రెసేతర పార్టీలతో ఫెడరల్ ఫ్రంట్ ని తెరపైకి తీసుకువచ్చారని టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీరామారావు తెలిపారు. దేశంలో గుణాత్మకమైన మార్పుకోసం కేసీఆర్ దేశవ్యాప్తంగా తిరిగి అందరి మద్దతు కూడగడుతున్నారన్నారు. ప్రధాని మోడీ ది బిల్డప్ మాత్రమేనన్న ఆయన, పైన పటారం.. లోన లొటారమన్న చందంగా ఆపార్టీతీరు ఉందని ఎద్దేవా చేశారు. బిజెపి అంటే బిల్డప్ జాతీయ పార్టీగా మారిందని, ప్రధానితో సహా పలువురు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేసినా, ఆపార్టీకి 103 అసెంబ్లీ స్థానాల్లో డిపాజిట్ కూడా రాలేదంటూ అపహాస్యం చేశారు. తమకు బిజెపితో ఏంటీ సంబంధమన్న కేటీఆర్, అసెంబ్లీ ఎన్నికల్లో ఆపార్టీని చిత్తు చిత్తుగా ఓడించింది తాము కాదా? అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్, బిజెపిలు కలిసినా కూడా వచ్చే లోక్ సభ ఎన్నికలు ఎన్నికల్లో మాజిక్ ఫిగర్ ను చేరుకునే అవకాశం లేదని చెప్పారు. తెలంగాణ ఆశించినంత

మిగతా 6లో

అంతే ఇంతే



అప్పుడు ఎమ్మెల్యేగా గెలవడం కోసం ఇప్పుడు మంత్రి పదవి కోసం అనుకుంటా

ధర్మాసనం ముందుకు పంచాయతీ



• బీసీల రిజర్వేషన్లు తగ్గించడంపై సుప్రీంలో అప్పీలు • మంత్రివర్గం ఆమోదం లేకుండా అమలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని వివరణ • స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిన బీసీ నేత ఆర్.కృష్ణయ్య • సోమవారం సుప్రీం చీఫ్ జస్టిస్ బెంచ్ మీద జరగనున్న వాదోపవాదాలు



గ్రామ పంచాయితీ ఎన్నికలల్లో బి.సి రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతం కు తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారి చేసిన ఆర్డినెన్సు రద్దు చేయాలనీ జాతీయ బి.సి సంక్షెమ సంఘం అద్యక్షులు ఆర్.కృష్ణయ్య సుప్రీంకోర్టు లో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశాలు. మంత్రి వర్గ సమావేశం లేకుండా అసెంబ్లీలో పాసైన పంచాయత్ రాజ్ చట్టాన్ని సవరించడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ లో పేర్కొన్నారు. పైగా రాష్ట్రంలో 56 శాతం కు పైగా ఉన్న బి.సిలకు 22 శాతం రిజర్వేషన్లు తగ్గించడం మూలంగా బి.సిలకు అన్యాయం జరుగుతుందన్నారు.

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః ఇలా తగ్గించడం వలన 1400 సర్పంచ్ పదవులు, 18 వేల వార్డు మెంబర్ పదవులు బి.సి లకు దక్కకుండా పోయాయి. అలాగే త్వరలో జరిగే ఎంపిటీసీ, జడ్పీటీసీ పదవులు కూడా దక్కకుండా పోతున్నాయి. జనాభా లెక్కలు శాస్త్రీయంగా ఉంటె రిజర్వేషన్లు 50 శాతం దాటి పెంచుకోవచ్చునని సుప్రీంకోర్టు గతంలో తీర్పు చెప్పింది. తెలంగాణ లో 2014 లో జరిపిన సమగ్ర సర్వేలో బి.సి జనాభా 52 శాతం ఉన్నట్లు తేలింది. అలాంటప్పుడు జనాభా నిష్పత్తిలో బి.సి రిజర్వేషన్లను పెంచాలని కోరారు. విద్యా, ఉద్యోగాల రిజర్వేషన్లలో 50 శాతం గరిష్ఠ పరిమితికి కొంత శాస్త్రీయ పరమైన అర్థముంది. ఎందుకంటే మెరిట్ దెబ్బతినరాదని 50 శాతం సీలింగ్ పెట్టారు. కాని రాజకీయ రిజర్వేషన్లకు మెరిట్ లేదు. కాబట్టి 50 శాతం గరిష్ఠ పరిమితి విదించడంలో ఏ మాత్రం అర్థంలేదని కృష్ణయ్య పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్య దేశం. ప్రతి సామాజిక వర్గానికి వారి,వారి జనాభా ప్రకారం వాటా ఇవ్వాలని కోరారు. ఈకేసు సోమవారం సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ మీద వాదోపవాదాలు జరుగుతాయన్నారు. కాగా.. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై బీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ

మిగతా 6లో

ఏపీలో వైసీపిదే అధికారం



• వైసిపి అధికారంలోకి రావడం తథ్యం • రానున్న ఎన్నికలలో ఒంటరిగానే వైసిపి పోటీ • ప్యాకేజీ ముద్దు అని అంగీకరించిన చంద్రబాబు • బిజెపిపై నిందలేసి పబ్బంగడుపుతున్నారు • ప్రజలంతా జగన్ రావాలని కోరుకుంటున్నారు • మాజీ మంత్రి, వైసిపి నేత ధర్మాన

వివరాలు 6లో

సూర్య
హైదరాబాద్
శనివారం
19 జనవరి 2019

మోడీ నిర్ణయంతో దేశ రక్షణకు ముప్పు వాటిల్లే ప్రమాదం: సురవరం

హైదరాబాదు, మేజర్‌న్యూస్: డిఫెన్స్ ఇండస్ట్రీలో ప్రైవేటీకరణకు అనుమతించడం వల్ల దేశ రక్షణకు ముప్పు వాటిల్లుతుందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నాలుగు సంఘాలకు చెందిన కార్మికులు పిలుపు ఇచ్చిన సమ్మెకు సీపీఐ పూర్తి మద్దతు తెలుపుతుందన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డిఫెన్స్ ఇండస్ట్రీలో ప్రైవేటీకరణకు అనుమతించడం వల్ల దేశ రక్షణకు ముప్పు వాటిల్లుతుందని అన్నారు. అంతేకాక మోదీ కక్షపూరితంగానే ఆలోక్ వర్మను ట్రాన్స్‌ఫర్ చేయించారని ఆరోపించారు. ఆలోక్ విషయంలో పారదర్శకంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అంతేకాక కేరళలో కమ్యూనిస్టులపై మోదీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు. సుప్రీం తీర్పుకు వ్యతిరేకంగా మోదీ మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. జేఎన్‌యూ విద్యార్థులపై అక్రమంగా నమోదు చేసిన చార్జిషీట్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సీఎం కేసీఆర్ ఫిరాయింపులను ప్రోత్సాహిస్తున్నారంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ నుంచి ఫిరాయిస్తే ఒక రకంగా.. టీఆర్ఎస్‌లోకి వెళ్తే మరో రకంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. టీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరారని ఫిర్యాదు అందగానే ఆఘమేఘాల మీద చర్యలు తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్సీలను టీఆర్ఎస్‌లో చేర్చుకొని విలీనం చేయడం పద్ధతి కాదని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ అసెంబ్లీ నూతన స్పీకర్‌గా ఎన్నికైన పోచారం శ్రీనివాస్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. శాసన సభలను ఔన్నత్యంగా నడపాలని కోరారు.



స్పీకర్‌గా పోచారం బాధ్యతలు

- సభలో అధికారికంగా ప్రకటించిన ప్రొటెం స్పీకర్ ముంతాజ్
- స్పీకర్ కుర్చీ వరకు గౌరవంగా తీసుకుకెళ్లిన సీఎం కేసీఆర్, ప్రతిపక్ష సభ్యులు
- ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సీఎం కేసీఆర్‌కు, సభ్యులకు ధన్యవాదాలు తెలిపిన పోచారం
- సభ గౌరవాన్ని పెంపొందించడానికి అందరం కలిసి పనిచేయాలని సూచన



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ శుక్రవారం సభలో అధికారికంగా ప్రకటించారు. అనంతరం సీఎం కేసీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఈటల రాజేందర్, అహ్మద్ బలాలా తదితరులు పోచారంను స్పీకర్ కుర్చీ వరకు తోడ్కొని వెళ్లారు. ఆ తర్వాత ప్రొటెం స్పీకర్ నుంచి పోచారం బాధ్యతలు స్వీకరించారు. కాగా..గురువారం మధ్యాహ్నం శాసనసభలో పోచారం నామినేషన్ దాఖలు చేశారు. శాసనసభా కార్యదర్శి నర్సింహాచార్యులుకు ఆరు సెట్ల నామినేషన్‌ను అందజేశారు. సాయంత్రం 5 గంటల వరకు నిర్ణీత గడువులోగా ఆయన ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైంది. దీంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి పోచారం రెండో శాసన సభాపతిగా బాధ్యతలు చేపట్టారు. గతంలో 2004 నుంచి 2009 వరకు బాల్కొండ ఎమ్మెల్యేగా ఉన్న సురేశ్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సభాపతిగా పనిచేసిన విషయం తెలిసిందే. స్పీకర్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పోచారం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ శాసనసభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. సభ గౌరవాన్ని పెంపొందించడానికి అందరం కలిసి పనిచేయాలని పోచారం శ్రీనివాసరెడ్డి సభ్యులకు సూచించారు.

ఊరిపేరే 'ఇంటి' పేరు

మచ్చలేని నేతగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి
పోచారం రాజకీయ ప్రస్థానం ఇదే

ఊరిపేరే 'ఇంటి' పేరు : టీఆర్ఎస్ పార్టీలో ఉత్కంఠకు తెరపడింది. ఇంత కాలంగా పార్టీలోని సీనియర్లను స్పీకర్ పదవి అప్పగిస్తారన్న ఉత్కంఠ నెలకొంది. కొంత మంది సీనియర్లు స్పీకర్ పదవి వద్దంటే వద్దంటూ ప్రకటనలు సైతం ఇచ్చారు. అలాంటి నేతలు ఇప్పుడు ఊపిరిపీల్చుకున్నారు.



శ్రీనివాస్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం : ఇంటిపేరును ఊరిపేరుగా మార్చి కన్న ఊరికి గుర్తింపు తీసుకొచ్చారు. ఇంటిపేరు పడిగె అయిన ఆయన తన ఊరు పోచారం కావడంతో ఆయన పోచారం శ్రీనివాస్‌రెడ్డిగానే గుర్తింపుపొందారు. 1969 లో తెలంగాణ ఉద్యమంలో మొట్టమొదటి సరిగా పాల్గొన్నారు. అనంతరం 1977 లో కాంగ్రెస్ పార్టీ తరుపున దేశాయిపేట్ సొసైటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అప్పుడి నుంచే రాజకీయాల్లో అడుగు పెట్టారు. 1980 లో కాంగ్రెస్ పార్టీ తరుపున సమితి అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వెంకట్‌రాంరెడ్డిపై పోటీ చేసి ఓడిపోయారు. 1984 లో టీడీపీలో చేరారు. 1985 లో టీడీపీ నియోజక వర్గం సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టారు. 1987లో బుర్గి సొసైటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అనంతరం డీసీసీ బీ బ్యాంక్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 1989లో టీడీపీ పార్టీ నుంచి ఎంపీగా పోటీచేసి ఓడిపోయారు. 1991 నుంచి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా ఏడుసార్లు రాష్ట్ర కార్యదర్శిగా రెండుసార్లు పదవులు చేపట్టారు. అనంతరం 1994లో టీడీపీ ఎమ్మెల్యేగా బాన్సువాడ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. 1998 లో టీడీపీ ప్రభుత్వంలో గృహ నిర్మాణశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1999లో తిరిగి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం రాష్ట్ర భూగర్భ, గనులశాఖ మంత్రిగా పనిచేశారు. 2000 సంవత్సరంలో పంచాయతీ రాజ్‌శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2002 లో స్టేషనరీ కుంభకోణం ఆరోపణలు ఎదుర్కొని మంత్రి పదవికి రాజీనామా చేశారు. 2004 లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌పై పోటీ చేసి ఓడిపోయారు. 2009 లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2011 లో ఎమ్మెల్యే పదవికి, టీడీపీకి రాజీనామా చేసి టీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2011 లో జరిగిన ఉపఎన్నికల్లో తిరిగి పోచారం విజయం సాధించారు. 2014 ఎన్నికల్లోను గెలుపొందగా టీఆ ర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2018 ముందస్తు ఎన్నికల్లోనూ బాన్సువాడ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 15 సంవ త్సరాలు బాన్సువాడ శాసన సభ్యులుగా కొనసాగారు. టీ ఆర్ఎస్ ప్రభుత్వం పోచారానికి సుదీర్ఘ అనుభవంతో శాసనసభ చైర్మన్‌గా నియమించింది.

కేసీఆర్ ఆలోచనలు అమలు చేసిన పోచారం

- రైతుల ఆర్థికాభివృద్ధికి ఎనలేని కృషి
- వ్యవసాయాన్ని పండుగని నిరూపించే ప్రయత్నం
- రాష్ట్ర మాజీ మంత్రి ఈటల రాజేందర్



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : రైతుల అభివృద్ధి విషయంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేసిన కృషి మరవలేనిది అని మాజీ మంత్రి, హుజురాబాద్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి ఈటల రాజేందర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా సభలో ఈటల మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం కోసం రాజీనామా చేసి ప్రజల తీర్పు కోసం పోయి నప్పుడు ఉప ఎన్నికల్లో శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పని చేశానని తెలిపారు. ఉప ఎన్నికల సమయంలో పోచారం పని విధానం, చిత్తశుద్ధి , ప్రజలతో పెనవేసుకున్న బంధమేందో అర్థమైందన్నారు. మీ జీవితాన్ని తాము స్ఫూర్తిగా తీసుకున్నామన్న ఆయన, ఉద్యమ సమయంలోను పోచారం గొప్పపాత్ర పోషించారని పేర్కొన్నారు. దేశంలో ధనికుడైన రైతు ఎక్కడున్నారంటే తెలంగాణలో ఉన్నారని చెప్పేందుకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పునాది వేశారని, వ్యవసాయమంటే దండుగ కాదు... పండుగ అని నిరూపించేందుకు పోచారం చేసిన కృషి మరువలేనిదని ఈటల ప్రశంసించారు. రైతాంగానికి బ్యాంకర్లు సహక రించడం లేదంటూ బ్యాంకర్ల సమావేశంలో ముక్కుసూటిగా పోచారం శ్రీనివాస్ రెడ్డి విమర్శించేవారని తెలిపారు. పోచారం ముక్కుసూ టితనాన్ని చూసి బ్యాంకర్లు రుణాల విషయంలో రైతులకు సహకరిస్తామని ఆయనకు చెప్పేవారని ఈటల రాజేందర్ గుర్తు చేశారు. రైతులు పండించిన పంటను కొనుగోలు చేసి రైతాంగాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకున్నదన్న ఆయన, తెలంగాణ ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకోవడం కేవలం రైతాంగం ద్వారానే సాధ్యమైందన్నారు. రైతుల విషయంలో ముఖ్య మంత్రి ఆలోచనా విధానాన్ని అమలు చేసి రైతుల హృదయాల్లో చోటు సంపాదించేందుకు పోచారం తన వంతు కృషి చేశారన్నారు. 40 ఏళ్ల సుదీర్ఘ అనుభవంతో ఈ సభను స్ఫూర్తిదా యకంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి నడుపుతారని ఆశిస్తున్నానని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

పోచారం హయాంలో రైతాంగానికి స్వర్ణయుగం

- పోచారంకు దక్కిన గౌరవం
- ఉద్యమకారులందరికి దక్కిన గౌరవం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ రైతాంగానికి గడిచిన నాలుగున్నరేళ్లు ఒక స్వర్ణయుగమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనకు హరీష్‌రావు శుభాకాంక్షలు తెలియజేశారు. సభలో హరీష్‌రావు మాట్లాడుతూ తెలంగాణ తొలిదశ ఉద్యమం 1969లో ఒక ఉద్యమకారుడిగా, ఒక విద్యార్థి నాయకుడిగా ఉద్యమం చేసి జైలుకు వెళ్లి, మలిదశ ఉద్యమంలో కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ సాధ్యమని చెప్పి ఆ రోజు తెలుగుదేశం పార్టీకి, పదవికి, శాసనసభ్యత్వానికి పోచారం రాజీనామా చేశారన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తిరిగి ఉపఎన్నికలో గెలిచి ఉద్యమాల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, తెలంగాణ శాసనసభలో సభాపతిగా పోచారం ఎన్నిక కావడం అంటే ఇది ఒక్క ఆయనకే కాదని ప్రతి తెలంగాణ ఉద్యమకారుడికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామని చెప్పారు. పని విషయంలో మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకుని ఎంతో నేర్చుకునేవాళ్లమని హరీష్‌రావు తెలిపారు. 69 ఏళ్ల వయస్సులో కూడా 29 ఏండ్ల యువకుడిలా పనిచేసేవారన్నారు. అపార అనుభవం కలిగిన వ్యక్తి, డీసీసీబీ ఛైర్మన్‌గా, ఆరుసార్లు ఎమ్మెల్యేగా, అధికార- ప్రతిపక్ష శాసనసభ్యుడిగా వివిధ మంత్రిత్వశాఖలు నిర్వహించిన మంత్రిగా అనుభవం కలిగిన , మిమ్మల్ని సభానాయకులు కేసీఆర్ సభాపతిగా ఎంపిక చేయడం, సరైన వ్యక్తికి సమున్నత గౌరవం లభించినట్లుగా భావిస్తున్నామన్నారు. . ఇందుకు సభానాయకుడికి మా అందరి తరుపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. తెలంగాణ రైతాంగానికి గడిచిన నాలుగున్నరేళ్లు ఒక స్వర్ణయుగమని హరీష్‌రావు అన్నారు. వ్యవసాయరంగంలో గొప్ప విప్లవాత్మకమైన మార్పును తీసుకురాగలిగామన్నారు. వ్యవసాయశాఖ మంత్రిగా పోచారం పనితీరు, సీఎం నిర్ణయాలతో వ్యవసాయరంగ నిపుణుడైన స్వామినాథన్ లాంటి వారు అవార్డు ఇచ్చి రైతాంగానికి చేస్తున్న మేలును అభినందించారన్నారు. పోచారంకు కారే కార్యాలయంగా ఉండేదని, రైతు బంధు అడిగినా, ఇన్సూరెన్స్ అడిగినా, రైతు సమన్వయ సమితులు అడిగినా వేళ్లమీద ప్రతి సమాచారం చెప్పేవారన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న దృక్పథంతో సీఎం చెప్పిన నిర్ణయాలను అమలు చేయాలనే ఒక పట్టుదలతో, నిబద్ధతతో పనిచేసిన నాయకులు పోచారం అన్నారు. రైతు సమన్వయ సమితుల ఏర్పాటు విషయంలో ఆయన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. నిజాంసాగర్ రైతుల కోసం మీరు పడిన తపన, సింగూరు నుంచి నీటి విడుదల విషయంలో, నిజాంసాగర్ ఆధునీకరణ విషయంలో పోచారం కృషి ఆమోఘమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజాంసాగర్ అనుసంధానం చేయాలని సీఎంతో ఒప్పించి మెప్పించుకున్న తీరు రైతులపట్ల ఆయనకున్న ప్రేమను తెలియజేస్తుందన్నారు. వ్యవసాయశాఖకు మంత్రిగా కేసీఆర్ నాయకత్వంలో దేశానికే ఆదర్శంగా పనిచేశారని ప్రశంసించారు. అదేవిధంగా వచ్చే ఐదు సంవత్సరాల పాటు తెలంగాణశాసనసభను అత్యంత హుందాగా భారతదేశంలోని మిగతా శాసనసభలకు ఆదర్శవంతమైనటువంటి సభగా తీర్చుదిద్దుతారన్న నమ్మకం తనకుందని హరీశ్‌రావు పేర్కొన్నారు.



కాంగ్రెస్‌లో కష్టపడే నాయకులను గుర్తించాలి

- ప్రజాభిమానం ఉన్న నేతలకు పదవులివ్వాలి
- ఏఐసీసీలో లాబీయింగ్ నివారించాలి
- ఢిల్లీలో ప్రదక్షిణలు చేస్తే పదవులివ్వద్దు
- ఎమ్మెల్యేలు, పార్టీ నేతల అభిప్రాయాలు సేకరించాలి
- ప్రైవేట్ సంస్థతో ప్రజాభిప్రాయసేకరణ చేయాలి
- కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ బలపడాలంటే తిరిగి పూర్వవైభవం సాధించాలంటే కష్టపడే నాయకులకు గుర్తింపు ఇవ్వాలని పార్టీ సీనియర్‌నేత, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కష్టపడేవారికి పదవులు లభించటంలేదని ఆయన జగ్గారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో మీడియా ప్రతినిధులతో చిట్‌ఛాట్‌లో భాగంగా మాట్లాడుతూ ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేసేవారికే పార్టీలో, పదవుల్లో నియమిస్తున్నారని, ఇకపై దీన్ని పూర్తిగా నివారించాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని కలిసే పరిస్థితి లేదన్నారు. పార్టీకోసం కష్టపడుతున్న నేతలు కలువాలంటే కోఠరీ అడ్డుపడుతూ కలువకుండా చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై రాహుల్‌గాంధీ దృష్టిపెట్టి, కష్టపడే నేతలను కలిసేందుకు చొరవతీసుకోవాలని, ఏఐసీసీలో కోఠరీ నేతలకు స్వస్తిపలుకాలన్నారు. రాష్ట్రంలో సీఎల్పీ నేతను కులాలు, మతాలకు అతీతంగా, పార్టీ కోసం కష్టపడుతూ, ప్రజాభిమానం ఉన్న నేతను ఎన్నుకోవాలని జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు. ఇందుకుగాను ఎమ్మెల్యేలు, పార్టీకి చెందిన నేతలతో పాటు ప్రజాభిప్రాయసేకరణ కూడా చేయాలన్నారు. ప్రజలు ఆదరించే నేతకు బాధ్యతలు, పార్టీ పదవులు అప్పగించాలన్నారు. అప్పుడు కాంగ్రెస్‌పార్టీ బలపడ్తది, బాగుపడ్తదని జగ్గారెడ్డి తెలిపారు. సీఎల్పీ నేత ఎన్నిక విషయంలో అచీ..తూచీ అడుగువేయాలన్నారు. లాబీయింగ్‌కు లోనయి ఎంపిక చేస్తే పార్టీ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. లాబీయింగ్ ద్వారా సీఎల్పీ ఎన్నిక జరిగితే కాంగ్రెస్‌కు నష్టమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ అధిష్టానవర్గం అన్ని చూసి నిర్ణయం తీసుకోవాలన్నారు. పార్టీ పరిణామాలు గ్రహించడం, తెలుసుకునేందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వద్ద 'ప్రత్యేక మిషనరీ' ఉండాలన్నారు. సీఎల్పీ ఎన్నికపై రాహుల్‌గాంధీ సీక్రెట్‌గా సర్వే నిర్వహించాలన్నారు. ప్రజాభిప్రాయసేకరణ, పార్టీ నేతల అభిప్రాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు.



గత్యంతరం లేకనే ఒంటేరు : గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన ఒంటేరు ప్రతాప్‌రెడ్డి టీఆర్ఎస్‌లో చేరడం వెనుక 'కర్ణుడిచావుకు సవాలక్ష' కారణాలు అన్నట్లు ఆయన చేరికకు సైతం అలా ఉన్నాయన్నారు. ఆర్థిక ఇబ్బందులతో గత్యంతరం లేకనే ఒంటేరు ప్రతాప్‌రెడ్డి పార్టీ మారారని అన్నారు. ఒంటేరు ప్రతాప్ రెడ్డి టీఆర్ఎస్ లో చేరికపై కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి స్పందించారు. వ్యక్తిగత కారణాలతోనే ఒంటేరు ప్రతాప్ రెడ్డి టీఆర్ ఎస్ లోకి వెళ్తున్నారని జగ్గారెడ్డి అన్నారు. ఒంటేరు ఆర్థికంగా చితికిపోయారని పేర్కొన్నారు. టీఆర్ఎస్ పై పోరాటంలో ఒంటేరుపై అనేక కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. ప్రతాప్ రెడ్డి నాయకుడిగా బలహీనుడు కాదని... పరిస్థితులు ఆయన్ను బలహీనుడిగా మార్చాయని చెప్పారు. ప్రతాప్ రెడ్డి పార్టీ మారడాన్ని వ్యక్తిగతంగా తాను తప్పుపట్టనని అన్నారు. కాంగ్రెస్ పార్టీలోని ప్రతీ బలహీనుడు టీఆర్ఎస్ కు ఆకర్షితుడేనని తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వం నో కామెంట్ అని అన్నారు. కాంగ్రెస్‌లోని బలహీన నేతలు టీఆర్ఎస్‌కు ఆకర్షితులు అవుతారని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

ఆయన చంద్ర సోనియా నాయుడు

బాబుపై కన్నా విమర్శ



కడప, మేజర్‌న్యూస్ : కాంగ్రెస్ పార్టీతో పొత్తుపెట్టుకుని టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఆశయాలకు అంత్యక్రియలు నిర్వహించారని చంద్రబాబుపై ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మినారాయణ విమర్శిం చారు. ప్రజలను చంద్రబాబు భలేగా బురిడీ కొట్టిస్తున్నారంటూ, చంద్ర బాబుని చంద్ర సోనియా నాయుడు గారుగా అభివర్ణించారు. బతికుండగా అన్నగారి పార్టీని, ఆస్తిని లాక్కొని ఆయనపై చెప్పులతో దాడి చేయించారు. బాబు పెట్టిన క్షోభకు అన్నగారు ప్రాణాలు విడిచారు అని తన ట్వీట్ లో కన్నా ఆరోపించారు.

మోడీ లేకుంటే బాబు జీరో : సోము వీర్రాజు



కపడ, మేజర్‌న్యూస్: రానున్న ఎన్నికల్లో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి ప్రజలే బుద్ధిచెబుతారని బీజేపీ నేత, మండలి సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. చంద్రబాబును ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధమైయారని, ప్రధాని నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధిని టీడీపీ ప్రభుత్వం విమర్శించడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏపీ ఎన్నికల ప్రచారాన్ని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ త్వరలోనే కడప నుంచి ప్రారంభిస్తారని వెల్లడించారు. నాలుగేళ్ల పాలనలో చంద్రబాబు నాయుడు రూ.6 లక్షల కోట్లు దోచుకున్నారని వీర్రాజు ఆరోపించారు. పేదలకు ఇళ్లు కట్టాలని కేంద్ర ప్రభుత్వం నిధులిస్తే టీడీపీ ప్రభుత్వం ఒక్క ఇళ్లు కూడా కట్టలేదన్నారు. చంద్రబాబు అవినీతికి హద్దులు లేవని తీవ్రంగా మండిపడ్డారు. ఏపీ అభివృద్ధిలో మోదీ సహాయం లేకపోతే చంద్రబాబు జీరో అని వ్యాఖ్యానించారు.

ఏపీ అసెంబ్లీ సమావేశాలు వాయిదా



విజయవాడ, మేజర్‌న్యూస్: ఈ నెల చివరన జరగాల్సి ఉన్న ఏపీ అసెంబ్లీ సమావేశాలు వాయిదా పడినట్టు తెలుస్తోంది. సాధారణ ఎన్నికలకు ముందు చివరి అసెంబ్లీ సమావేశాలు జనవరి 30వ తేదీ ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయని నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే పెన్షన్ల పంపిణీ, కొత్త పథకాల ప్రకటించిన నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలు వాయిదా వేసినట్లు తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాల నిర్వహణకు మరో నోటిఫికేషన్ విడుదల చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఫిబ్రవరి 4నుంచి 11వరకు అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. వారం రోజుల పాటు ఏపీ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతాయి. జనవరి 30 నుంచి సమావేశాలు జరపాలని ముందుగా నిర్ణయం తీసుకున్నారు కానీ ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో పెన్షన్ల పంపిణీ కోసం నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పర్యటనల నేపథ్యంలో ఫిబ్రవరి 4 నుంచి అజెంబ్లీ సమావేశాలు జరపాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

నవరత్నాలతోనే పేదల అభ్యున్నతి



విశాఖపట్నం, మేజర్‌న్యూస్: వైసీపీ ప్రకటించిన నవరత్నాలతో పేదల అభ్యున్నతి సాధ్యమని వైసీపీ నేత, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి అన్నారు. అరకు మండలం కొర్రయిగూడ గ్రామంలో ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. శుక్రవారం వైసీపీ స్థానిక నాయకులతో కలిసి కొర్రయిగూడ గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామాభివృద్ధిలో భాగంగా మంచి నీటి బోర్లు, సీసీ రోడ్డు నిర్మాణాల కోసం ఎంపీ నిధులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా విజయసాయి రెడ్డికి గ్రామ ప్రజలు టీడీపీ హయాంలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి విన్నవించుకున్నారు. డ్వాక్రా రుణాలు అందడం లేదని మహిళలు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. వృద్ధాప్య ఫించన్లు, ఇళ్లు మంజూరు చేయడం లేదని గిరిజనులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రవేశపెట్టే నవరత్నాల ద్వారా అందరి సమస్యలు పరిష్కారం అవుతాయని, పేదల అభ్యున్నతి సాధ్యమవుతుందని ఆయన భరోసానిచ్చారు

తెలంగాణలో అంతరించిపోయిన టీడీపీ

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : సామాన్యులను మంత్రులను చేసిన ఘనత నందమూరి తారక రామారావుదని తెలంగాణ టీడీపీ బహిష్కృత నేత, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. ఎన్టీఆర్ 23వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్‌కు వచ్చి మోత్కుపల్లి నివాళులర్పించారు. ఎన్టీఆర్ మహనీయుడు, బడుగు బలహీన వర్గాలకు, పేదలకు ఒక వ్యవస్థను సృష్టించిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. మోత్కుపల్లి మాట్లాడుతూ.. 'సంక్షేమ పథకాలకు ఎన్టీఆర్ ఆద్యుడు. రాజకీయంగా చైతన్యం కలిగించిన వ్యక్తి ఎన్టీఆర్. ఆయన పథకాలనే నేటి ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి. టీడీపీని టీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని అంటే నన్ను పార్టీ నుండి సస్పెండ్ చేశారు. తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ పరిస్థితి ఏమైంది. దీనికి చంద్రబాబు నాయుడు ఏం సమాధానం చెప్తారు. ఎన్టీఆర్ ఆశయాల బాటలో నడుస్తున్నా. టీఆర్ఎస్‌తో టీడీపీ కలిసి ఉంటే బాగుండేది.

ఎన్టీఆర్ ఘాట్‌ను కూడా పట్టించుకోవడం లేదు



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఎన్టీఆర్‌ను చంపిన వాళ్లు యథేచ్ఛగా తిరుగుతున్నారంటూ వైసీపీ ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎన్టీఆర్ 23వ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పించారు. అనంతరం లక్ష్మీపార్వతి మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్ ఎప్పటికి తెలుగు వారి గుండెల్లో ఆరాధ్యుడే అని కొనియాడారు. కానీ తన గుండెల్లో మంట చల్లారలేదని, కళ్లలో నీరు ఇంకా ఇంకలేదని ఆవేదనం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ ఆత్మ శాంతించలేదని, ఆయన ఆత్మ ఘోషిస్తుందని వాపోయారు. ఎన్టీఆర్ మహిళలను ఎంతో గౌరవించేవారని, కానీ నేటి టీడీపీ నేతలు మహిళల పట్ల చాలా అమానవీయంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఎన్టీఆర్ ఘాట్‌ను కూడా సరిగా పట్టించుకోవడం లేదని పెచ్చులూడుతున్నాయని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ విషయాన్ని గమనించి ఘాట్‌కు మరమ్మతులు చేయించాలని కోరారు.



పరామర్శకు వెళ్లి పొత్తుల చర్చా : భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుపతి, మేజర్‌న్యూస్: రాష్ట్రహక్కులను సాధించే క్రమంలో కేటీఆర్ వైఎస్ జగన్ మధ్య భేటీ జరిగిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకరరెడ్డి అన్నారు. ఈ భేటీపై వక్రభాష్యాలు చెబుతూ టీఆర్ఎస్, వైసీపీలు పొత్తు పెట్టుకుంటున్నాయని చంద్రబాబు దుష్ప్రచారం ప్రారంభించారని విమర్శలు గుప్పించారు. బాబు నలభయ్యేళ్ల రాజకీయ చరిత్ర అవినీతి మయం, దుర్గంధ భరితం, భరింపశక్యం కానటువంటిదని ఎద్దేవా చేశారు. నందమూరి హరికృష్ణ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన కేటీఆర్‌తో రాజకీయ పొత్తుల గురించి మాట్లాడింది మీరు కాదా అని సూటిగా ప్రశ్నించారు. తిరుపతిలోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. "విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి కేసీఆర్ వస్తే ఆయనకు స్వాగత ఏర్పాట్లు చేసి దగ్గరుండి సపర్యలు చేస్తారు. మీ మంత్రివర్గ సహచరురాలు పరిటాల సునీత ఇంట్లో వివాహానికి ఆహ్వానిస్తారు. కేసీఆర్ తలపెట్టిన చండీయాగంలో పాల్గొంటారు. కానీ, మేం కేటీఆర్‌తో భేటీ అయితే బురద జల్లుతారు అని ధ్వజమెత్తారు. టీడీపీ ఏ పార్టీతో పొత్తు పెట్టుకోకుండా ఎప్పుడైనా ఒంటరిగా పోటీ చేసిందా." అని ప్రశ్నించారు. చంద్రబాబు అనేక రుగ్మతలతో బాధపడుతున్నారని, కొత్తగా ఆయనకు మానసిక రుగ్మత కూడా వచ్చినట్లుందని వ్యాఖ్యానించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరు వింటేనే వణికిపోతూ బాబుకు నిద్ర కూడా పట్టడం లేదని ఎద్దేవా చేశారు. ఐదు కోట్ల ఆంధ్రుల ప్రయోజనాలు కాపాడటం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే విషయంలో మొదటినుంచి పోరాటం చేస్తున్నది వైస్సార్ కాంగ్రెస్ పార్టీయేనని ఉద్ఘాటించారు.

ఎన్టీఆర్ మనుమరాలుగా పుట్టడం పూర్వజన్మ సుకృతం : నారా బ్రాహ్మణి



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: ఎన్టీఆర్‌కు మనువరాలుగా పుట్టడం పూర్వజన్మ సుకుతమని నారా బ్రాహ్మణి అన్నారు. శుక్రవారం ఎన్టీఆర్ 23వ వర్ధంతి సందర్భంగా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో నారా బ్రాహ్మణి ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వసుంధర, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాన్సర్ రోగులకు బ్రహ్మణి, వసుంధర పండ్లు పంపిణీ చేశారు. అనంతరం బ్రహ్మణి మాట్లాడుతూ బసవతారకం పేరుతో క్యాన్సర్ ఆస్పత్రిని నిర్మించి ఇంత మంది రోగులకు సేవలు అందిచడం తమ కుటుంబం చేసుకున్న అదృష్టమన్నారు. ఎన్టీఆర్‌కు మనువరాలుగా పుట్టడం తన పూర్వ జన్మ సుకృతమని పేర్కొన్నారు. ఎంతో మంది చిన్నారులు బ్లడ్ క్యాన్సర్ బారిన పడుతున్నారని, రోగులకు నాణ్యమైనసేవలు అందించేందుకు ఎన్టీఆర్ ట్రస్ట్ కృషి చేస్తుందని బ్రహ్మణి తెలిపారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

- ట్రస్టుభవన్‌లో పార్టీ నేతల నివాళులు
- మకుటం లేని మహారాజు : ఎల్.రమణ

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: దివంగత ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావుకు తెలంగాణ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, ప్రజలు ఘన నివాళ్లు అర్పించారు. ఎన్టీఆర్ 23 వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నాడు ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్‌భవన్‌లోని ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పింఆచరు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన ఎన్టీఆర్ విద్యావంతుడై ఉద్యోగంలో చేరి దానిని త్యజింకి తనకు ఇష్టమైన నాటక రంగాన్ని ఎంచుకొన్నారన్నారు. ముఖ్యంగా సినిమా రంగంలో మకుటం లేని మహారాజుగా ఎదిగారన్నారు. సినిమాలలో ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొని రారాజుగా వెలిగారన్నారు. ప్రజలకు సేవ సేసేందుకు రాజకీయాలలోకి వచ్చి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. మాటకు విలువనిచ్చన మహానేత ఎన్టీఆర్ అన్నారు. ఆయన అడుగుజాడల్లో ఆందరం నడవాల్సిన అవసరం ముందని పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నమ్మిన సిద్ధాంతాల కోసం పనిచేసిన వ్యక్తి అన్నారు. ఎన్టీఆర్ ఆశయాలసాధనలో సత్ఫలితాలు వచ్చిన రోజే ఆయనకు నిమైన నివాళ్లన్నారు. దేశ రాజకీయాలలో కూడా చెరగని ముద్రవేసి నేషనల్ ఫ్రంట్ చైర్మెన్‌గా ఉన్నారన్నారు. తెలుగు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎన్టీఆర్ బాటలో నడుద్దామని రమణ పిలుపునిచ్చారు. ఆత్మగౌరవానికి ఎన్టీఆర్ ప్రతీకైతే,



ఆత్మవిశ్వాసానికి చంద్రబాబునాయుడు ప్రతీకగా నిలిచారన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు వీరోచితంగా పోరాడారన్నారు. అధికార పార్టీ వందలకోట్లు వెదజల్లి తిరిగి అధికారంలోకి వచ్చిందని రమణ ఆరోపించారు. అధికారపార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వాయిదా వేస్తున్నారని ఎద్దేవా చేశారు. సమాజమే దేవాలయం-ప్రజలే దేళ్లు అనే నినాదంతో మనం ప్రజల పక్షాన ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేద్దామని నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలని, ప్రజల హృదయాలలో తిరిగి పార్టీ శాశ్వతంగా ఉండేవిధంగా రాబోయే రోజులలో కార్యక్రమాలుంటాయని రమణ తెలిపారు. రాజకీయాలలో ఎన్టీఆర్ నూతన ఒరవడిని సృష్టించారని పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

వరంగల్ మేయర్ అభ్యర్థి ఎంపికపై కేటీఆర్ కసరత్తు

- సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన యువనేత
- పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీ



హైదరాబాద్, మేజర్‌న్యూస్: వరంగల్ మేయర్ ఎంపిక కోసం సీఎం కేసీఆర్ ఆదేశాలతో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కసరత్తు ప్రారంభించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పరేషన్ పరిధిలోని ఐదుగురు శాసనసభ్యులు, శాసనమండలి విప్ పల్లా రాజేశ్వరరెడ్డిలతో అసెంబ్లీ వాయిదా పడిన అనంతరం ఆయన టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ప్రాథమిక చర్చలు జరిపారు. మేయర్ నన్నపనేని నరేందర్ వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో కొత్త మేయర్ ఎంపిక అనివార్యమైంది. వరంగల్ వెస్ట్ శాసనసభ్యుడు వినయభాస్కర్, వర్ధన్నపేట శాసన సభ్యుడు ఆరూరి రమేష్, వరంగల్ ఈస్ట్ శాసన సభ్యుడు నన్నపనేని నరేందర్ లు, కేటీఆర్‌తో భేటీలో పాల్గొన్నారు. స్టేషన్ ఘణపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిలతో సమావేశం నుంచే కేటీఆర్ ఫోన్లో సంభాషించారు. ఇలాంటి సమావేశాలతో ఇంకా మరింత మంది అభిప్రాయాలు తీసుకుని పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ కు నివేదించి వరంగల్ మేయర్ అభ్యర్థిపై తుది నిర్ణయం తీసుకుంటామని కేటీఆర్ సమావేశంలో తెలిపారు.

శ్రీనివాసరావుకు జ్యుడీషియల్ రిమాండ్

- విజయవాడలో భద్రతలేదన్న శ్రీనివాస్ తరఫు న్యాయవాది
- రాజమండ్రి జైలుకు తరలింపు
- పుస్తకం రాసే అవకాశం కల్పించాలని శ్రీనివాస్‌రావు వినతి
- తిరస్కరించిన న్యాయస్థానం

విజయవాడ, మేజర్‌న్యూస్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై హత్యాయత్నం చేసిన జనుపల్లి శ్రీనివాసరావుకు ఎన్ఐఏ కోర్టు ఈ నెల 25 వరకు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. దర్యాప్తుకు రాష్ట్ర పోలీసులు, సిట్ అధికారులు సహకరించడం లేదని ఎన్ఐఏ దాఖలు చేసిన మెమోపై వాదనలు ఈనెల 23న వింటామని పేర్కొంది. కౌంటర్ దాఖలు చేయాలని ఎన్ఐఏ, సిట్ అధికారులను ఆదేశించింది. వారం రోజుల ఎన్ఐఏ కస్టడీ ముగియడంతో శ్రీనివాసరావుకు అంతకుముందు అధికారులు విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. తర్వాత అతడిని కోర్టులో హాజరుపరిచారు. ఎన్ఐఏ అధికారులు ఏమైనా ఇబ్బంది పెట్టారా అని న్యాయమూర్తి అడగ్గా ఏం లేదని శ్రీనివాసరావు సమాధానమిచ్చాడు. మీడియాతో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలన్న నిందితుడి విజ్ఞప్తిని తిరస్కరించారు. శ్రీనివాసరావుకు విజయవాడలో భద్రత లేదని అతడి తరపు న్యాయవాది సలీమ్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాదిని వివరణ కోరగా రక్షణ కల్పించలేమని ఒప్పుకున్నారు. దీంతో నిందితుడిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించాలని న్యాయస్థానం ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో పటిష్ట భద్రత నడుమ నిందితుడిని రాజమండ్రికి తీసుకెళ్లారు.

పుస్తకం రాసే అవకాశం ఇవ్వండి-శ్రీనివాస్ : వైసీపీ అధినేత వైఎస్ జగన్‌పై దాడి కేసులో నిందితుడు శ్రీనివాస్‌రావును శుక్రవారం పోలీసులు ఎన్ఐఏ కోర్టులో హాజరు పర్చారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి అడిగిన ప్రశ్నలకు శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. కాగా శ్రీనివాస్ ఓ అభ్యర్థనను న్యాయమూర్తి ముందు ఉంచారు. తనకు పుస్తకం రాసే అవకాశం ఇవ్వాలని కోరారు. తన భావాలను ప్రజలకు చెప్పుకునే అవకాశం కల్పించాలని విన్నవించుకున్నాడు.



రాజకీయంగా ఈ కేసును తప్పుదారి పట్టిస్తున్నారని, తనకు ప్రజలతో మాట్లాడే అవకాశం కల్పించాలని న్యాయమూర్తితో నిందితుడు శ్రీనివాస్‌రావు అన్నారు. అసలు ఈ దాడి ఎందుకు చేయాల్సి వచ్చిందో తాను ప్రజలకు చెబుతానని అన్నాడు. కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని శ్రీనివాసరావు తెలిపాడు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు తరఫు లాయర్ వాదిస్తూ తమ క్లయింట్‌ను 30 గంటల పాటు ఎన్ఐఏ అధికారులు రహస్యంగా విచారణ జరిపారని ఆరోపించారు. విచారణ జరిపేటప్పుడు లాయర్లు ఉండాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారని ఆరోపించారు. విజయవాడ జైలులో శ్రీనివాసరావుకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ ఇతర ఖైదీలను కలవకుండా అతనికి రక్షణ కల్పించాలని కోరారు. కేసు విచారణను కొద్దిసేపు వాయిదా వేసి తిరిగి విచారణ చేపట్టారు.

ఆ లేఖ జైలు అధికారులు తీసుకున్నారు : జైల్లో తాను రాసుకున్న 22 పేజీల లేఖను జైలు అధికారులు బలవంతంగా తీసుకున్నారని శ్రీనివాసరావు జడ్జికి ఫిర్యాదు చేశాడు. ఆ లేఖను తనకు ఇప్పించాలని కోరాడు. అయితే శ్రీనివాసరావుకు ప్రాణహాని ఉందని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. కానీ తనకు ప్రాణహాని లేదని నిందితుడు శ్రీనివాసరావు న్యాయమూర్తికి తెలిపాడు.


చుక్కరక్తం పోయేప్రాణానికి ఆయువుపట్టు

ట్రస్టుభవన్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన నారా భువనేశ్వరి



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: ప్రతిరక్తపు బొట్టు.. పోయే ప్రాణానికి ఆయువు పట్టు అని ఎన్టీఆర్ ట్రస్ట్ ట్రస్టీ, ఏపీ సీఎం సతీమణి నారా భువ నేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ 23వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్, ట్రస్ట్ లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌ను, ఏపీ, తెలంగాణా రాష్ట్రాలలో 100కుపై చిలుకు చోట్ల నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్టీఆర్ ట్రస్ట్ ట్రస్టీ నారా భువ నేశ్వరీ హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో లాంఛనంగా ప్రారంభించారు. ప్రపంచంలో ఉన్న తెలుగు వారి హృదయాలలో చెరగని ముద్ర వేసిన వ్యక్తి ఎన్టీఆర్. ఆయన మహోన్నత వ్యక్తిత్వాన్ని, సేవాస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని మరింత సేవ చేయాలనే ఉద్దేశంతో గత మూడేళ్లుగాఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు భువనేశ్వరి తెలిపారు. ఈ సారి కూడా స్వచ్ఛందంగా రక్తదానానికి స్ఫూర్తినిస్తూ ట్రస్ట్ తలపెట్టిన లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌లో వేల మంది ఉత్సాహంగా పాల్గొని తెలుగువారి స్ఫూర్తిని చాటాలని తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ సీఇఓ టి.విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఎన్టీఆర్ స్ఫూర్తిలో నిర్వహించిన లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్‌తో పాటు రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్, లయన్స్‌క్లబ్, గవర్నమెంట్, ఇతర బ్లడ్‌బ్యాంక్స్ పాల్గొననున్నాయని తెలిపారు.

చైర్మన్‌గా మారెడ్డి బాధ్యతలు స్వీకరణ



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి :రెండో సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన గులాబిదళపతి కేసీఆర్ తన మొదటిసారిగా పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్‌గా మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని నియమించిన విషయం తెలిసిందే. శుక్రవారం నాడుమారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సివిల్‌సప్లై భవన్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి పార్టీ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావుతో పాటు పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్యనేతలు హాజరయ్యారు. అనంతరం ప్రగతి భవన్ లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావును శ్రీనివాస్ రెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

సంపాదకీయం

editpage@suryaa.com

తాళి కట్టించుకుంటున్న పెళ్లికూతురుపై కాల్పులు

న్యూఢిల్లీ : వధువు మెడలో తాళి కట్టేందుకు వరుడు సిద్ధమవుతున్న సమయంలో పెళ్లిప్రాంగణం తుపాకీ కాల్పులతో మోతెక్కింది. ఈ ఘటన ఢిల్లీలోని షకర్‌పూర్ ప్రాంతంలో చోటు చేసుకుంది. 19 ఏళ్ల పూజ అనే యువతికి ఓ యువకుడితో పెళ్లి జరుగుతోంది. బాజా భజంత్రీలు, వేద మంత్రాల మధ్య ఆమెకు తాళి కట్టేందుకు వరుడు సిద్ధమవుతున్న సమయంలో ఓ ఆగంతుకుడు తుపాకీతో పూజపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో పూజ గాయపడింది. గాయపడిన ఆమెను హుటాహుటిని ఆసుపత్రికి తరలించారు. అయితే, గాయం చిన్నదేనని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెప్పారు. దీంతో బంధువులు పెళ్లి తంతు ముగించారు. మరో వైపు పూజకు తెలిసిన యువకుడే కాల్పులు జరిపి పారిపోయాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. ప్రేమ వ్యవహారమే కారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కర్నాటకలో బిజెపి దుస్సాహసం !

'అడుసు తొక్కనేల... కాలు కడుగనేల'... ఇది పెద్దల నానుడి. కర్నాటక విషయంలో భారతీయ జనతా పార్టీకి ఇది వర్తిస్తుందనవచ్చునేమో?! కర్నాటకలో జనతా దళ్ (సెక్యులర్)– కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోయడానికి బిజెపి ఇంతకు ముందు ఎన్నో ప్రయత్నాలు చేసి విఫలమైంది. అయినా పార్టీ గుణపాఠం నేర్చుకోలేదు. తాజాగా పార్టీ మరొక ప్రయత్నం చేసింది. మళ్లీ విఫలమైంది. పార్లమెంటరీ ఎన్నికలకు ముందు ఆ ప్రభుత్వంపై ఇటువంటి ప్రయత్నం చేయడానికి బిజెపికి తగినంత సమయం ఉండకపోవచ్చు. అయినా పార్టీ మరొక సారి అందుకు ప్రయత్నించవచ్చు. జాతీయ ఎన్నికల అనంతర పరిణామాలలో ప్రభుత్వం మనుగడ సాగించే పక్షంలో బిజెపి మళ్లీ దానిని కూల్చేందుకు ప్రయత్నించవచ్చు.

కర్నాటకలో సంభవించిన తాజా పరిణామాలతో తనకు ఏమాత్రం సంబంధం లేదని బిజెపి స్పష్టం చేసింది. జెడి (ఎస్)– కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వానికి ఇద్దరు ఇండిపెండెంట్ ఎంఎల్ఎలు మద్దతు ఉపసంహరించుకోవడం, అసమ్మతి కాంగ్రెస్ ఎంఎల్ఎలు కొందరు అదృశ్యం కావడం ఈ సందర్భంగా ప్రస్తావనార్హం. మరొక వైపు బెంగళూరులో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్షం సమావేశానికి నలుగురు సభ్యులు గైర్హాజరయ్యారు. వారికి నోటీసులు పంపిస్తామని, చర్యలు తీసుకుంటామని మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య హెచ్చరించారు. వారి గైర్హాజర్‌కు కారణాలు తెలియరాలేదు. కానీ ఈ విషయంలో కూడా బిజెపి తనకు సంబంధం లేదని చెప్పుకున్నది. అయితే, ఈ ఉదంతంలో పార్టీ గూడుపుఠాణి ఉందన్నది నిత్యం. శాసనసభలో తనకు తగిన సంఖ్యా బలం లేదన్నది సుస్పష్టం అయినప్పటికీ బిజెపి అటువంటి ప్రయత్నం ఎందుకు చేసిందన్నది ప్రశ్న.

అందుకు రెండు కారణాలు ఉండవచ్చు. ఒకటి – రానున్న ఎన్నికలలో బిజెపి విజయానికి కర్నాటక కీలకమైనదే. రాష్ట్రంలో బిజెపి సారథ్యంలో ప్రభుత్వం ఉండాలని పార్టీ కేంద్ర నాయకత్వం కోరుకుని ఉంటుంది. ఇక రెండవది – కాంగ్రెస్ నేతలలో అసంతుష్టి అంతకంతకు పెరుగుతుండడం, భాగస్వామ్య పక్షాల కాంగ్రెస్, జెడి (ఎస్) మధ్య పూర్తి స్థాయిలో సామరస్యం లేకపోవడం. ముఖ్యమంత్రి, జెడి (ఎస్) నేత హెచ్‌డి కుమారస్వామి తన పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా ఉందని ఒక సందర్భంలో వాపోయారు. అయితే, 224 మంది సభ్యులు ఉన్న శాసనసభలో కేవలం 37 మంది సభ్యుల సొంత బలం ఉన్న ఏ ముఖ్యమంత్రికీ నడక నల్లేరు బండిపై కాదు. కుమారస్వామి ఆ వాస్తవాన్ని అంగీకరించి, ధైర్యంగా ముందుకు సాగాలి. ఒక దశలో కాంగ్రెస్, జెడి (ఎస్) పార్టీల రెండింటి మధ్య సంబంధాలు తెగిపోతాయేమోననిపించింది కూడా. అవకాశం వస్తే సద్వినియోగం చేసుకోవాలన్నది బిజెపి దూరాశ. తాను ఐరకాట స్థితిని ఎదుర్కొనవలసి వచ్చినా ఒక రాయి వేసి చూడాలని బిజెపి భావించింది.

బిజెపికి ఐరకాట స్థితి సంగతి అలా ఉంచితే, ఈ శోచనీయ ఉదంతం జాతీయ స్థాయిలో పార్టీ ప్రతిష్ఠకు హాని కలిగించి ఉండవచ్చు. లోక్‌సభ ఎన్నికలలో నువ్వా నేనా అనే రీతిలో పోరు సాగే సూచనలు కనిపిస్తుండగా ఎన్నికలకు ముందు ఇటువంటి పరిస్థితిని పార్టీ నివారించి ఉండవలసింది. ఎన్నికలలో హోరాహోరీ పోరుకు సన్నద్ధతపై దృష్టి కేంద్రీకరించవలసిన సమయంలో బిజెపి అసెంబ్లీలో తగినంత సంఖ్యా బలం లేకుండానే ప్రభుత్వం కూల్చివేతకు ప్రయత్నించడం మంచిది కాదు. అటువంటి సలహా ఇచ్చినవారిదే తప్పు.

మరొక వైపు తమ ఎంఎల్ఎల కొనుగోలుకు ప్రయత్నాలు చేస్తున్నారంటూ బిజెపి, కాంగ్రెస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఎవరి ఎంఎల్ఎలను కాపాడుకోవడానికి రెండు పార్టీలు వారిని ఇతర రాష్ట్రాలలో రిసార్ట్‌లకు తరలించాయి కూడా.

ఇక తన దుస్సాహసానికి ఎన్నికలలో మూల్యం చెల్లించుకోవలసిన పరిస్థితి రాకపోతే తనను తాను అదృష్టశాలిగా బిజెపి పరిగణించుకోవచ్చు. పార్టీకి మరింత అపఖ్యాతి రాకుండా నివారించేందుకు బిజెపి కేంద్ర నాయకత్వం తగిన చర్యలు తీసుకోవాలి. ఇటువంటి దుస్సాహసానికి పార్టీ ఒడిగట్టకూడదు. పార్లమెంటరీ ఎన్నికలలో సత్ఫలితాలు సాధించడానికే ప్రాధాన్యం ఇవ్వాలని, స్వార్థ ప్రయోజనాల కోసం చూడకూడదని కర్నాటకలోని తమ నాయకులకు పార్టీ కేంద్ర నాయకత్వం గట్టి సందేశం పంపాలి. అసలు ప్రస్తుత సంకీర్ణ అవసరార్థం ఏర్పడింది కదా ! తమ పార్టీ ఇబ్బందులను అవకాశంగా తీసుకోవాలని కొంత మంది శాసనసభ్యులు చూస్తుండడం ఆశ్చర్యం కలిగించడం లేదు. వారికి కాంగ్రెస్‌లోనే కొందరు పెద్ద నేతల అండ ఉన్నదని, వారు లోపాయికారీ ప్రయత్నాలు చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ఎటువంటి ప్రయత్నాలైనా చేయడానికి బదులు భారతీయ జనతా పార్టీ ఈ ప్రభుత్వాన్ని అంతర్గత వైరుధ్యాలే దెబ్బ తీసే వరకు వేచి చూడాలి.

కుల మతాలకు అతీతంగా ఇబిసి రిజర్వేషన్లు !

ఇబిసి రిజర్వేషన్లు అన్ని కులాలకు , అన్ని మతాలకు, వర్తిస్తాయి. కులం సర్టిఫికేట్ లేని వారికి, బీసీ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అనే తేడా లేకుండా అందరికీ నూతన అవకాశాలు పెరుగుతాయి. బీసీలందరూ ఈబీసీ రిజర్వేషన్లు ద్వారా క్రీమీలేయర్ పరిమితిలో అవకాశాలు పెరుగుతాయి. జనాభా ప్రాతిపదికపై బీసీ , రిజర్వేషన్లు పెంచాల్సి ఉన్నది. బీసీ ఈ గ్రూపునకు పెంచిన రిజర్వేషన్లను కూడా కేంద్రం ఆమోదించడం ద్వారా సామాజిక సామరస్యం వెల్లి విరుస్తుంది. ఇబిసి రిజర్వేషనులు అందరికి వర్తిస్తాయి. దీంతో అగ్రకుల రిజర్వేషన్ ఉద్యమాలు సృష్టించే సంఘర్షణలకు ఒక ముగింపు లభిస్తుందని ఆశిద్దాం. నేను 25 శాతం కు ఇబిసి క్రీమీలేయర్ పెట్టాలన్నాను. ప్రస్తుతం 10 శాతం పెట్టారు. ఇంకా 15 శాతంకూడా క్రీమీ లేయర్ పరిధి లోకి తెస్తేనే పేదలకు న్యాయం జరుగుతుంది .

–బి ఎస్ రాములు, తెలంగాణ బిసి కమిషన్ అధ్యక్షుడు

ఆధిపత్య కులాలకు రిజర్వేషన్లు తగదు

ఆధిపత్య కులాలు సామాజికంగాను, రాజకీయంగాను శక్తివంతంగా ఉన్నారు. వారికి ఆర్థిక వెనుకబాటు కారణంతో రిజర్వేషన్స్ అమలు చేయడం తగదు. ఇలాంటి చర్యల వలన సామాజికంగా, రాజకీయంగా, బలంగా ఉన్న ఆధిపత్య కులాలు తరతరాలుగా వివక్షకు, అణచివేతలకు గురవుతున్న వర్గాలను మరింత అణచివేతకు గురి చేస్తారు. ఈ రిజర్వేషన్లు ఒక ఉద్యోగాల కోసమే కాదు, అన్ని రకాల విద్య, ఉద్యోగ, రాజకీయ, వనరులు పంచుకోవడం లాంటి అన్నిటిలోనూ ఉంటుంది. ఆధిపత్య కులాలను రిజర్వేషన్ పరిధిలోకి తీసుకురావటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఆర్థిక కారణంతోనే సామాజిక వెనుకబాటుతనం లేకుండా రిజర్వేషన్లు పొందడం తగదు. పేదరికాన్ని రూపుమాపి ఆయా ఆధిపత్య కులాలకు చేయూతనివ్వాలనుకుంటే ప్రైవేటీకరణను తగ్గించాలి. విద్య వైద్యం జాతీయం చేయడం ద్వారా ఉద్యోగాల కల్పన జరగాలి, విద్య, ఉపాధి, ఆహార భద్రత, గృహ నదుపాయం మొదలైన అంశాలలో ప్రభుత్వం ఉచితంగా తగిన సదుపాయాలు అందించాలి, తదనుగుణంగా సంక్షేమ పథకాలు రూపొందించాలి. ఈ విధంగా ఉన్నత కులాల పేదలకు, ఇతర పేదల అభివృద్ధికి పరిష్కారం చూపాలే గాని, అణగారిన వర్గాలు, అణిచివేతకు గురి కాబడిన వర్గాలు, బలహీన వర్గాలు వారి సామాజిక ప్రాతినిధ్యం కొరకు భరోసాగా ఇవ్వబడిన రిజర్వేషన్లను పేదరికం పేరుతో ఉన్నత కులాలకు కేటాయించడం తగదు. కేవలం ఆర్థిక కారణంతో ఉన్నత కులాలు రిజర్వేషన్ పొందే అర్హత లేదు. ఇది కేంద్ర ప్రభుత్వం రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తీసుకున్న తొందరపాటు నిర్ణయం. దీనిని తక్షణమే వెనక్కి తీసుకోవాలి.

–వాసిలి సురేష్, 9494615360

కర్నాటకలో రాజకీయ చెళుకులు!

శంకర వ్యాఖ్య



– శంకర్‌రాజ్, పాలక్కాడ్,
9845034515

- కాంగ్రెస్ ఎమ్మెల్యేల వైఖరితో ఉత్కంఠ
- జేడీఎస్ డబుల్ గేమ్ ఆడుతోందని కాంగ్రెస్ ఆరోపణ
- కాచుక్కూర్చున్న కాషాయ దళం
- అవకాశం చిక్కినా అందిపుచ్చుకోని వైనం
- ఎడ్డియూరప్పలో చతురత తగ్గిందంటున్న సొంత నాయకత్వం

కర్ణాటకలో మొదలైన హాస్య నాటకం ముగిసింది. విషాదం తరుముకొస్తోంది. కర్ణాటకలో రాజకీయ డ్రామా భయాన్ని గొలుపుతోంది. పెద్దపెద్ద శబ్దాలే దీనికి కారణం. ఫలితం మాత్రం శూన్యమవడం ఇక్కడ ప్రత్యేకతను సంతరించుకుంది. అదే సమయంలో హాస్యాన్నీ పండిస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అంతర్థానమై ముంబైలో ప్రత్యక్షం కావడం వెనుక బీజేపీ హస్తం ఉందని కాంగ్రెస్, జెడి(ఎస్) తొలుత భావించాయి. అనంతరం జెడి(ఎస్) పార్టీనే ఈ పనికి పాల్పడుతోందనీ, తమ ఎమ్మెల్యేలను కలుపుకోవడానికి చూస్తోందనీ కాంగ్రెస్ అనుమానించడం ప్రారంభించింది. దీనిని దృష్టిలో ఉంచుకుని జనతాదళ్ ఎస్ కాంగ్రెస్ డబుల్ గేమ్ ఆడుతోందని ఆరోపించింది. ఈ మొత్తం నాటకంలో ఏం జరుగుతోందో తెలియనట్టుగా బీజేపీ ప్రవర్తిస్తోంది. ఈ రంగంలోకి హఠాత్తుగా ప్రవేశించి, అగ్నికి ఆజ్యం పోసింది. సందిగ్ధతను మరింత పెంచింది. తమతో 15మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని వెల్లడించడం ద్వారా సస్పెన్స్‌ను క్రియేట్ చేసింది. ఏ క్షణానైనా వారు తమ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించింది. అంతే కాంగ్రెస్ హడావిడిగా తన శోధన తను చేసుకుని ఎవరూ కాషాయ దళంలో చేరడానికి సిద్ధంగా లేరని రూఢీ చేసుకుంది. ఆ తదుపరి ఏడుగురు బీజేపీ ఎమ్మెల్యేలు తమతో నిరంతరం సంప్రదిస్తున్నారని చెప్పింది. ఇది వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. ఈ దెబ్బకు కంగారు పడిన బీజేపీ తన ఎమ్మెల్యేలందరినీ తొలుత గురుగ్రామ్‌కూ, తదుపరి హర్యానాకు తరలించింది. ఇక్కడ అసలు అంశమేమిటంటే ఈ మొత్తం ప్రహసనంలో అసలు బీజేపీకి ఎటువంటి పాత్రా లేకపోకడం విశేషం. యథాలాపంగా జరిగిన ఈ వ్యవహారంలో బీజేపీ నేతలు ప్రతి నాయకులుగా మిగిలిపోయారు. ఇది కాకతాళీయంగా జరిగిందే తప్ప వేరొకటి కాదని అందరూ అనుకోవచ్చు. మొత్తం మీద కథ సుఖాంతం అవడం కాంగ్రెస్–జెడిఎస్ సంకీర్ణ ప్రభుత్వానికి సంతోషాన్నిచ్చింది. వాస్తవానికి కాంగ్రెస్‌లో అసంతృప్తి సెగలు మొదలయ్యాయి. అధికారం కోసం కాంగ్రెస్ సీనియర్ నేతలలో పాదుకుపోయిన కాంక్ష ఈ సంక్షోభానికి కారణమని చెప్పచ్చు. ఈ సంక్షోభాన్ని సృష్టించింది కాంగ్రెస్ కాదని నమ్మించ చూసినప్పటికీ ముఖ్యమంత్రి కుమారస్వామి మాత్రం నమ్మడం లేదు. పరిస్థితి మొత్తాన్ని ఆయన తన అదుపులోకి తెచ్చుకుని సంక్షోభం మరింత ముదరకుండా జాగ్రత్త పడ్డారు. హఠాత్తుగా కనిపించకుండా పోయిన ఎమ్మెల్యేలతో నిరంతరం సంప్రదిస్తూనే ఉన్నారు. పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతోనూ సంప్రతిస్తూ స్థానిక కాంగ్రెస్ నేతలను పక్కనపెట్టేశారు.

కర్ణాటకలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడడానికి కారకుడు రాహుల్ గాంధీ కాబట్టి, తలెత్తిన సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత కూడా ఆయనపైనే ఉంది. అందుకే హెచ్‌డికే చాలా ప్రశాంతంగా ఉన్నారు. అతని కుమారుడు నిఖిల్ గౌడ నటించిన కురుక్షేత్ర చిత్రం రషెస్‌ను చూస్తూ గడిపారు. కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నేత సిద్ధరామయ్య, నీటి వనరుల శాఖ మంత్రి డికె శివకుమార్ మధ్య అధికారం కోసం సాగుతున్న యుద్ధం ప్రతిష్ఠాత్మకంగా తయారైంది. కారణం సిద్ధరామయ్య వహిస్తున్న ట్రబుల్ షూటర్ పాత్ర. మూడు రోజుల సంక్షోభంలో టీవీ చానెళ్ళకు కావాల్సినంత ఇంధనాన్ని అందించింది. సిద్ధరామయ్య, డికెఎస్ ఇద్దరూ క్యాబినెట్లో పదవులు, కార్పొరేషన్ పదవులు తమ అనుయాయులకు సమానంగా దక్కేలా చూసుకున్నారు. ఇది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో అసంతృప్తికి కారణమైంది. శబ్దం లేకుండా వారు తమ అసంతృప్తిని బయటపెడుతూ వస్తున్నారు. దీనినే వినియోగించుకోవడానికి బీజేపీ ప్రయత్నించింది. తొలి స్థానంలో బీజేపీ సంక్షోభాన్ని సృష్టించలేదు. ఒక అవకాశాన్ని కనుగొని పరిస్థితులకు అనుగుణంగా స్పందించింది. పార్టీ అధ్యక్షుడు అమిత్ షా హెచ్చరికతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.ఎస్. ఎడ్డియూరప్ప బీజేపీ ఆపరేషన్ లోటస్‌కు శ్రీకారం చుట్టింది. లోక్ సభ ఎన్నికలకు ముందు కర్ణాటకలో రాజకీయంగా సాహసమో, దుస్సాహసమో ఏదో ఒకటి చేయాలనే కృతనిశ్చయాన్ని కనబరుస్తున్నారు అమిత్ షా. ఈ ఎపిసోడ్‌లో తప్పు పట్టాల్సింది ఎవరైనా ఉంటే అది కాంగ్రెస్ పార్టీనే అని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి జి. పరమేశ్వర అంగీకరించారు. దీనిని నేను తిరస్కరించను అని వ్యాఖ్యానించారు. మంత్రివర్గంలో చేరాలనీ, లేదా మంత్రులు కావాలని ఆశించే



వారు తమ అభిప్రాయాలను భిన్న మార్గాలలో వ్యక్తపరుస్తారు. కానీ కొంత కాలం తరవాత ఆ భావన అణగారుతుంది. అందరూ మంత్రులు కాలేమన్న వాస్తవాన్ని గ్రహించడమే దీనికి కారణం. వారిని ఎన్ని రకాలుగా వీలైతే అన్ని రకాలుగా వినియోగించుకోవడానికి చూస్తామంటూ పరమేశ్వర ముక్తాయించారు. కాంగ్రెస్ తరఫున మధ్యవర్తిత్వం వహిస్తున్నారని కుమారస్వామి చర్యలను ఆయన సమర్థించారు. ఆయన రాష్ట్రానికి ముఖ్యమంత్రి తప్ప ఏ పార్టీకి కాదని అన్నారు. ఎమ్మెల్యేలందరితో ఆయన టచ్‌లో ఉన్నారు. అందరితోనూ మాట్లాడుతున్నారంటూ పేర్కొన్నారు. సంక్షోభం అస్పష్టంగా ఉన్న తరుణంలో కుమార స్వామి తన నమ్మినబంట్లు అయిన హోం మంత్రి ఎమ్.బి. పాటిల్, ఆహార, పౌరసరఫరాల మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్‌లను రంగంలోకి దింపారు. అసంతృప్తిగా ఉన్న ఎమ్మెల్యేలను తిరిగి తమ గూటికి చేర్చడం వారి కర్తవ్యం. బి. నాగేంద్ర, జెఎన్ గణేశ్, ఎల్బీపీ భీమనాయక్, అమరెగౌడ, హెచ్. నగేశ్‌లను తిరిగి తమవైపు తిప్పుకోవడంలో విజయం సాధించారు. అదే విధంగా రమేశ్ జర్కిహోలి, ఉమేశ్ జాదవ్ అనే మరో ఇద్దరు ఎమ్మెల్యేలను కూడా తమ వైపు తిప్పుకోగలమనే నమ్మకం వారిలో బలపడింది. పార్టీలోని అంతర్గత వర్గాలు మాత్రం ఇది ప్రాథమిక చికిత్స లాంటిదేనని వ్యాఖ్యానిస్తున్నారు.

ఎమ్మెల్యేలకు పెద్ద మొత్తంలో నగదు, కీలక పదవులు ఇస్తామని ఆశ చూపినట్లు బెంగళూరులో బలంగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే అతి త్వరలో కీలకమైన అంశం కాబోతోంది. మిగిలిన వారు సైతం తమ డిమాండ్లను వినిపించే అవకాశముందంటున్నారు. ఇలాంటి పరిస్థితుల నడుమ పార్టీ తన పని తాను చేసుకోలేదు. కేరళ రాజకీయాలలో హడావిడిగా ఉన్న ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తమకు సమయం ఇవ్వడం లేదని కొందరు అసంతృప్తిగా ఉన్నారు. ఈ మొత్తం నాటకంలో బీజేపీ నాయకుడు ఎడ్డియూరప్ప మాత్రమే నిందించవలసిన వ్యక్తి. బీజేపీ ఎమ్మెల్యేలు మొత్తం ఆయనపైనే భారం వేశారు. కానీ వృథా ప్రయాసగా మారింది. ఎడ్డియూరప్ప ప్రస్తుతం ఎందుకు ఉపయోగం లేని నేతగా మారారని బీజేపీ కేంద్ర నాయకత్వం భావిస్తోందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. రేసునుంచి ఆయన తనంతట తాను తప్పుకోవాలని అమిత్ షా వాంఛిస్తున్నట్లు తెలుస్తోంది. 75ఏళ్ళ వయసులో సైతం తాను యువకుడిలా పనిచేయగలనని ఎడ్డియూరప్ప అనుకుంటున్నారు. మరో పదేళ్ళు నేను పవర్ పాలిటిక్స్‌లో ఉంటానని బజాయించి మరీ చెబుతున్నారు. మరో రెండు ఎన్నికలలో నేను పోటీ చేస్తానని తెలిపారు ఎడ్డియూరప్ప. ఫిబ్రవరి 27న ఆయన 76వ ఏట ప్రవేశిస్తారు. ఏడాది క్రితం ఆయనలో ఉన్న శక్తి ఇప్పుడు కనిపించడంలేదని ఆయన సహచరులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇంకెంత కాలం ప్రభావశీలంగా ఆయన పార్టీని నడిపించగలరని పార్టీలోని ఒక వర్గం ప్రశ్నిస్తోంది. ఆయన ప్రతి చర్యలు నెమ్మదించాయి. నడకలోనూ వేగం తగ్గింది. ఆయనలో రాజకీయ చతురత సైతం ప్రశ్నార్థంగా మారింది. మూడు లోక్ సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలలో ఇది బహిర్గతమైందంటున్నారు. ఎడ్డియూరప్ప, చుట్టూ ఉన్న ఆయన కుటుంబ సభ్యులు మాత్రమే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలని తపిస్తున్నారు. అసంతృప్త కాంగ్రెస్ ఎమ్మెల్యేలపైనే ఆయన ఆశలు పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. రమేశ్ జర్కిహోలి అనే ఎమ్మెల్యే తాను కనీసం డజను మంది ఎమ్మెల్యేలను తెస్తానని హామీ ఇచ్చారు. కేవలం ముగ్గురు మాత్రమే ముంబై లోని హోటల్‌కు చేరుకున్నారు. మరింత మంది ఎమ్మెల్యేలు తమతో చేరతారని బీజేపీ చెప్పుకుంటోంది. పరుషమైన ప్రసంగాలకూ, చురుకైన ప్రణాళికలకూ పెట్టింది పేరైన ఎడ్డి ప్రస్తుత తీరు అదంతా గతమని తేల్చేస్తోంది. సొంత పార్టీ నేతలే దీన్ని ధ్రువీకరిస్తున్నారు. ఇటీవల ముగిసిన బీజేపీ కార్యవర్గ సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి డివి సదానంద గౌడ వెల్లడించిన అభిప్రాయం కూడా దీన్ని రూఢీచేస్తోంది. తాను అందరికీ తెలిసిన ఎడ్డియూరప్పను చూడాలని ఉందనేదే ఆయన వ్యాఖ్య. లింగాయత్ సామాజిక వర్గంలో బలీయమైన ఎడ్డియూరప్ప తనను తాను అంచనా వేసుకోవాలనీ, ఒకప్పటిక నాయకత్వ పటిమను ప్రదర్శించాలని కోరుతున్నారు. కర్ణాటక అసెంబ్లీ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా ప్రతిపక్షం అత్యంత బలీయంగా ఉంది. ప్రతిపక్షంలో 104మంది సభ్యులున్నారు. అయినప్పటికీ భారతీయ జనతా పార్టీ ఒక్కసారి కూడా పాలకపక్షాన్ని గత ఆర్నెలలో ఇరుకున పెట్టలేక పోయింది. ఈ సందర్భంలో తలెత్తుతున్న ప్రశ్న.. బిఎస్‌వై తిరిగి రాజు కాగలరా? లోక్ సభ ఎన్నికల తరవాత కాంగ్రెస్–జెడిఎస్ ప్రభుత్వం కుప్పకూలుతుందని అనేకమంది భావిస్తున్నరు. ఇది బీజేపీ–జేడీఎస్ మధ్య చర్చలకు తలుపు తెరుస్తుందంటున్నారు. ఇదంతా జరిగేదీ లేనిదీ సమయమే తేల్చాలి.




– ఇస్కా రాజేష్‌బాబు,
'సూర్య' అమరావతి బ్యూరో చీఫ్,
96520 39780

బాబు బీసీ బాట

- ఆదరణ పథకం కింద ఆధునిక పనిముట్లు
- 27న రాజమహేంద్రవరంలో 'జయహో బీసీ' సభ
- బీసీ సబ్‌ప్లాన్‌కు రూ.10వేల కోట్ల నిధులు
- బీసీలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు

'బాబు సర్కారు బడుగుల బాటలో పయనించేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వారి ఓట్లు కీలకం కావడంతో వారిని ప్రసన్నం చేసుకునే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. టీడీపీ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో 'జయహో బీసీ' సభను నిర్వహించేందుకు జోరుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇప్పటికే నవ్యాంధ్రలోని 13 జిల్లాల్లో 32 బీసీల సభలను నిర్వహించి ఉభయ గోదావరి జిల్లాలకు కేంద్రమైన రాజమహేంద్రవరంలో నిర్వహించే ఈ జయహో బీసీ సభ ద్వారా బీసీలకు మేలు చేసే కార్యాచరణ రూపొందించడంతోపాటు 2019 సార్వత్రిక ఎన్నికల సమర శంఖం పూరించేందుకు తెలుగుదేశం పార్టీ సమాయత్తమైంది...'

తెలుగుదేశం పార్టీకి వెన్నెముక బీసీలే. వారి ఓట్లు లేనిదే అధికారంలోకి రావడం కష్టం. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువచ్చేందుకు జయహో బీసీ పేరుతో తెలుగుదేశం పార్టీ ఇప్పటికే పలు జిల్లాల్లో సమావేశాలను నిర్వహించింది. ప్రస్తుతం నవ్యాంధ్రలో బీసీల సంక్షేమంపై సర్కారు ప్రత్యేక దృష్టి సారిస్తోంది. వారికి ఈ సారి ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని భావిస్తోంది. ఉన్నత వర్గాలకు ధీటుగా బీసీలు ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం అమరావతి బీసీ కార్పొరేషన్ ద్వారా చేయూత అందిస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో గ్రామీణ పథకం, పట్టణ ప్రాంతాల్లో అభ్యుదయ యోజన పథకం, బీసీ సభ్యుల ఆర్థిక అభివృద్ధి కోసం రెండు స్వయం ఉపాధి పథకాలను ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఫైనాన్స్ కార్పొరేషన్ అమలుచేస్తోంది. అలాగే ఆదరణ పథకం కింద పనిముట్లను అందించడం ద్వారా వెనుకబడిన తరగతులకు చెందిన వృత్తి పనివారి యొక్క శారీరక శ్రమను తగ్గించి ఆదాయం మెరుగయ్యేలా చర్యలు చేపడుతోంది. గత నాలుగు సంవత్సరాల్లో 11 బీసీ ఫెడరేషన్లకు రూ.1008.01 కోట్లు కేటాయించగా ఇప్పటివరకు రూ.830.69 కోట్లు ఖర్చు చేసి 53,703 మందికి మాత్రమే లబ్ధి చేకూరింది. ఆదరణ పథకాన్ని రూ.750 కోట్లతో 5లక్షల బీసీలకు లబ్ధి చేకూర్చేందుకు 2018–19 ఆర్థిక సంవత్సరంలో జనవరి 20న జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో ఆమోదించారు. పశువుల పెంపకం, గొర్రెపిల్లల పెంపకం, చేపల పెంపకం, నేతపని, బంగారు కమ్మీ, కమ్మరి, ఇత్తడి, వడ్రంగి, రాతి శిల్పం, లాండ్రీ, మృణ్మయకళ, చమురు నొక్కడం, బుట్టలు, జుట్టు వంటి సంప్రదాయ వృత్తులను అనుసరించే రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల జాబితాలో వర్గాల క్రింద డ్రస్సింగ్, టైలరింగ్, డ్రాయింగ్ పతనం ఇంకా సంప్రదాయ కార్యకలాపాలు లేకుండా అనేక బీసీ వర్గాలు వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలను చేపడుతున్నాయి. వృద్ధులైన వారు చాలామంది కళాకారులు కూడా తమ సాంప్రదాయిక కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదరణ పథకాన్ని పునఃప్రారంభించి కులవృత్తుల వారికి అత్యాధునికమైన పనిముట్లు సరఫరా చేసి వారి తలసరి ఆదాయాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామీణ పేదవారిని వారి ఉత్పాదకత మెరుగు పరిచి అదనపు ఆదాయాన్ని సృష్టించడం ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. 2017–18 సంవత్సరానికి సంబంధించి బీసీలకు శిక్షణ, నైపుణ్యం అభివృద్ధి కోసం రూ.106 కోట్లు కేటాయించారు. అలాగే ఆదరణ–2 పథకానికి సంబంధించి రూ.100కోట్లు కేటాయించారు. 2016–17 సంవత్సరానికిగాను ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ కోసం రూ.409 కోట్ల సబ్సిడీ అందించింది.ఇందులో 77,001 మంది బీసీ లబ్దిదారులకు రూ.401.56 కోట్లు బ్యాంకు ద్వారా పంపిణీ చేశారు. మిగిలిన రాయితీ మొత్తాన్ని విడుదల చేయనున్నారు. 2017–18 సంవత్సరానికి ప్రభుత్వం రూ.366కోట్లు కేటాయించగా గ్రాంట్–ఇన్–ఎయిడ్‌గా రూ.300కోట్లను కేటాయించారు. 2017–18 సంవత్సరానికి ప్రభుత్వం రూ.460 కోట్ల సబ్సిడీ అందించగా ఇందులో 46వేల మంది బీసీ లబ్దిదారుల కోసం కొంత మొత్తం రాయితీ



మంజూరు చేశారు. ఇందులో రూ.391.27 కోట్ల సబ్సిడీ మొత్తాన్ని 57,836 మంది బీసీ లబ్దిదారులకు బ్యాంకుల ద్వారా పంపిణీ చేశారు. అలాగే రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల వారిని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేలా వారి కోసం సబ్‌ప్లాన్‌ను ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని మొత్తం ప్రణాళిక వ్యయం నుంచి నిధుల్లో కొంత భాగాన్ని కేటాయించారు. 2015–16లో 21 శాఖల ద్వారా రూ.6640.50 కోట్లు కేటాయించగా 2016–17లో 33 శాఖల ద్వారా రూ.8832.15 కోట్లు, 2017–18 ఆర్థిక సంవత్సరానికి గాను 37శాఖల ద్వారా రూ.10వేల కోట్లు కేటాయించారు.

బీసీ ఫెడరేషన్లతో ఆర్థిక స్థితి మెరుగు

రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు చెందిన చేతివృత్తులు, కుల వృత్తుల వారి కోసం, సంక్షేమానికి 11 ఫెడరేషన్లు స్థాపించి వాటి ద్వారా ఆర్థిక పరిస్థితి మెరుగుపరచుకునే నిమిత్తం ఒక్కొక్క సభ్యునికి రూ.1లక్ష సబ్సిడీతో కూడిన రుణాన్ని వివిధ బ్యాంకుల ద్వారా ప్రభుత్వం మంజూరు చేస్తోంది. రాష్ట్రంలో 11 ఫెడరేషన్లకు సంబంధించి 4లక్షలకు పైగా సభ్యులు వివిధ ఫెడరేషన్లలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ రజక సమాఖ్య, నాయిబ్రాహ్మణ, వడ్డె, సగర(ఉప్పర), వాల్మీకి/బోయ, కృష్ణ బలిజ (పూసల), బట్రాజు, మేదర సహకార ఆర్థిక సంస్థ, విశ్వబ్రాహ్మణ సహకార ఆర్థిక సంస్థ, కుమ్మరి/శాలివాహన సమాఖ్య, కల్లుగీత సహకార ఆర్థిక సంస్థ 11 ఫెడరేషన్ల ద్వారా 2016–17 ఆర్థిక సంవత్సరంలో 45,060 మంది లబ్దిదారులకు రూ.354.09కోట్లు సబ్సిడీగా మంజూరు చేయాలని లక్ష్యం పెట్టుకోగా 14781 మంది లబ్దిదారులకు రూ.62.47 కోట్లు సబ్సీడీగా మంజూరైంది. 2017–18 ఆర్థిక సంవత్సరంలో 30,106 మంది లబ్దిదారులకు రూ.296.06కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 9488మంది లబ్దిదారులకు రూ.61.67 కోట్లు సబ్సిడీగా మంజూరు చేశారు.

చంద్రన్న పెళ్లికానుకతో చేయూత

బీసీ వధువులకు ఆర్థిక సహాయాన్ని అందించేందుకు 'చంద్రన్న పెళ్లి కానుక' పేరుతో ప్రభుత్వం 2017 అక్టోబర్ 30న జీఓఎంఎస్ నెంబర్ 32 ద్వారా ఉత్తర్వులు జారీ చేసి కొత్త పథకాన్ని ప్రారంభించింది. బాల్య వివాహాలు తగ్గింపు, గృహ హింస నుంచి మహిళలకు రక్షణ కల్పించడం, పేద బీసీ సంఘాలకు వారి వివాహాల నమోదు చేయడానికి, ప్రోత్సహించడానికి, సమాజం యొక్క సంతృప్తి, సంతోషం సూచిక పెంచడం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం. ప్రతి బీసీ వధువునకు రూ.35వేల ఆర్థికసాయం అందించేలా 40వేలమందికి ఇచ్చేందుకు బడ్జెట్‌లో రూ.100కోట్లు కేటాయించారు.

గత ప్రభుత్వాలకు భిన్నంగా నిధులు

2004–05 నుంచి 2014–15 వరకు గత 10 సంవత్సరాల్లో వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం రూ.8482 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.8594.49 కోట్లు ఖర్చు చేసి 135.76 కోట్లమందికి లబ్ది చేకూర్చారు. 2014–15 నుండి 2017–18 వరకు గత 4 సంవత్సరాల్లో బీసీల సంక్షేమానికి రూ.10844.47 కోట్లు కేటాయించగా ఇప్పటివరకు రూ.10980.08 కోట్లు ఖర్చు చేసి 70.64 మందికి లబ్ది కలిగింది. 2004–05 నుంచి 2013–14 వరకు గత పదేళ్లలో వెనుకబడిన తరగుతల సహకార ఆర్థిక సంస్థకు రూ.127.49 కోట్లు కేటాయించగా ఇందులో రూ.127.49 కోట్లు ఖర్చు చేసి 1,43,398 మందికి లబ్ది చేకూర్చారు. అలాగే 2014–15 నుంచి 2017–18 వరకు నాలుగేళ్లలో బీసీ సహకార ఆర్థిక సంస్థకు రూ.1019.08 కోట్లు కేటాయించగా ఇప్పటి వరకు రూ.1050.55 కోట్లు ఖర్చు చేసి 2,08,093మందికి లబ్ది చేకూర్చారు. 2004–05 నుంచి 2013–14 వరకు గత పదేళ్లలో 11 బీసీ ఫెడరేషన్లకు రూ.160.15 కోట్లు కేటాయించగా ఇందులో రూ.19.62 కోట్లు ఖర్చు చేసి 18,396మందికి లబ్ది చేకూర్చారు. అలాగే 2014–15 నుంచి 2017–18 వరకు గత నాలుగేళ్లలో 11 బీసీ ఫెడరేషన్లకు రూ.1008.01 కోట్లు కేటాయించగా ఇప్పటివరకు రూ.830.69 కోట్లు ఖర్చు చేసి 53,703 కోట్లమందికి లబ్ది చేకూర్చారు. సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తున్న తరుణంలో బీసీల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తోంది.

ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కాకపోవచ్చు: అరుణ్ జైట్లీ



ముంబై: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్‌పై హింట్ ఇచ్చారు. సీఎన్‌బీసీ ఇండియన్ బిజినెస్ లీడర్ అవార్డుల కార్యక్రమంలో అమెరికాలోని న్యూయార్క్‌లో చికిత్స పొందుతున్న అరుణ్ జైట్లీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం పాత సాంప్రదాయాన్ని బ్రేక్ చేయవచ్చంటూ హింట్ ఇచ్చారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే తాత్కాలిక బడ్జెట్ ఓట్ ఆన్ అకౌంట్ కాకపోవచ్చని పేర్కొన్నారు. కేవలం ఓట్ ఆన్ అకౌంట్‌గా మాత్రమే కాక అంతకుమించి ఉండొచ్చని అన్నారు. దేశం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోందని, ముఖ్యంగా వ్యవసాయం రంగం సంక్షోభంలో ఉందని జైట్లీ అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం కేవలం ఓట్ ఆన్ అకౌంట్‌కే పరిమితం కావాల్సిన అవసరం లేదని ఆర్థిక మంత్రి అన్నారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు బడ్జెట్‌లో పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాదు ఈ బడ్జెట్‌లో రైతులకు భారీ ఉపశమనాన్ని ఇవ్వనుందని పేర్కొన్నారు. వ్యవసాయం రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఒప్పుకున్న ఆయన, రైతు సహాయక చర్యలను ప్రజాకర్షక చర్యగా పరిగణించరాదని అన్నారు. నరేంద్ర మోదీ సర్కారు చిన్న,మధ్య తరహా రైతులకు రూ. 3లక్షలు దాకా వడ్డీ లేని రుణాలను ఇవ్వనుందని ఇటీవల వార్తలు వెలువడిన నేపథ్యంలో జైట్లీ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. 2019 మార్చిలో ఆర్‌బీఐ 50 బేసిస్ పాయింట్ల వడ్డీ రేటు పెంపు ఉంటుందన్న ఉదయ కోటక్ వ్యాఖ్యలకు ప్రతిగా దేశీయ వాస్తవ వడ్డీరేట్లు ప్రపంచంలోనే అధిక స్థాయిలో ఉండాల్సిన అవసరం లేదన్నారు.




18-1-2019 ... మార్కెట్ సమాచారం

సెన్సెక్స్	
ఆరంభం	36,198.13
గరిష్ఠం	36,236.70
కనిష్ఠం	35,734.01
ముగింపు	**36,386.61**
మార్పు (పా)	12.53
మార్పు (శా)	0.03

&

నిఫ్టీ	
ఆరంభం	10,920.85
గరిష్ఠం	10,930.30
కనిష్ఠం	10,845.85
ముగింపు	**10,906.95**
మార్పు (పా)	1.75
మార్పు (శా)	0.02

ఎన్ఎస్ఈ ఇండియా మార్కెట్ గ్రాఫ్



సెక్టోరల్ ఇండెక్స్‌లు

ఇండెక్స్	ప్రస్తుతం	మార్పు (పా)	మార్పు (శా)
S&P BSE SENSEX 50	11,408.06	-0.80	-0.01
S&P BSE SENSEX Next 50	32,383.62	-295.23	-0.90
S&P BSE 100	11,165.66	-14.94	-0.13
S&P BSE Bharat 22 Index	3,432.05	-37.36	-1.08

అత్యధిక లాభాల్లో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
KRBL	381.25	+41.70	+12.28
VAKRANGEE	50.55	+2.40	+4.98
RELIANCE	1,182.95	+49.20	+4.34
FLFL	404.40	+13.40	+3.43
ORIENTCEM	79.05	+2.45	+3.20

భారీ నష్టంలో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
LINDEINDIA	613.60	-153.35	-19.99
SPARC	148.40	-23.60	-13.72
SUNPHARMA	390.75	-36.40	-8.52
SUNTV	524.90	-41.05	-7.25
BHARTIARTL	310.95	-21.35	-6.42

టాప్ టర్నోవర్

కంపెనీ (కోడ్)	ధర (రూ)	టర్నోవర్	వాల్యూమ్
SUNPHARMA	390.75	256.86	6672418
RELIANCE	1182.95	210.63	1808806
ICICIBANK	371.90	95.72	2567765
JETAIRWAYS	281.35	83.61	2933053
YESBANK	198.25	79.16	3973738

రూపాయి మారకపు విలువ


కరెన్సీ	మారకపు విలువ	కరెన్సీ	మారకపు విలువ
డాలర్	71.3418	యూరో	81.2583
యన్	65.51	పౌండ్	91.8616

రిలయన్స్ తొలి ప్రాధాన్యం గుజరాత్

● వైబ్రెంట్ గుజరాత్ సమ్మిట్‌లో ముఖేష్ అంబానీ ● వచ్చే పదేళ్లలో రూ. 3 లక్షల కోట్ల పెట్టుబడి ● డేటా వలసవాదం మనకు వద్దు ● ప్రపంచానికి సరికొత్త సంపద డేటాయే ● విదేశాల గుత్తాధిపత్యాన్ని ఆడ్డుకోవాలి ● ప్రధాని నరేంద్ర మోడీ చేతల మనిషి ● రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ

గాంధీనగర్: భారతీయులకు సంబంధించిన వివరాలపై ఇతర దేశాల గుత్తాధిపత్యం అడ్డుకొనేలా చర్యలు తీసుకోవాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. అలాగే రానున్న పది సంవత్సరాల్లో తమ సంస్థ గుజరాత్‌లో రూ.3లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించారు. గాంధీనగర్‌లో తొమ్మిదో వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్‌లో మాట్లాడుతూ.. గుజరాత్ ఎప్పటికీ తమ మొదటి ప్రాధ్యాన్యమన్నారు. రాజకీయ వలసవాదానికి వ్యతిరేకంగా జాతిపిత మహాత్మా గాంధీ చేపట్టిన ఉద్యమాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ.. రాజకీయ వలసవాదాన్ని పారద్రోలడానికి గాంధీజీ జాతీయోద్యమానికి నాయకత్వం వహించారు. ఇప్పుడు మనందరం కలిసి డేటా వలసవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ కొత్త ప్రపంచంలో డేటా అనేది కొత్త సంపద. భారత్‌కు చెందిన డేటాకు భారతీయులే నేతృత్వం వహించాలి. విదేశాల గుత్తాధిపత్యాన్ని అడ్డుకోవాలి. భారత్‌లో సమాచార విప్లవాన్ని తీసుకురావడంలో విజయం సాధించడానికి మన సంపదపై నియంత్రణను మన ఆధీనంలోకే తెచ్చుకోవాలి అని వెల్లడించారు.

ప్రధాని చేతల మనిషని, డిజిటల్ ఇండియా మిషన్ లక్ష్యాల్లో దీన్ని చేర్చుతారని ముకేశ్ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే రానున్న పది సంవత్సరాల్లో గుజరాత్‌లో వివిధ రంగాల్లో రూ.3లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనున్నామని ప్రకటించారు. గుజరాత్ రిలయన్స్ జన్మభూమి. అలాగే కర్మభూమి. మా మొదటి ప్రాధ్యాన్యం ఎప్పటికీ గుజరాత్ రాష్ట్రమే అని స్పష్టం చేశారు. అలాగే పండిట్ దీన్ దయాళ్ విశ్వవిద్యాలయ నిర్మాణానికి రూ.150 కోట్లు కేటాయించనున్నామని తెలిపారు.



గుజరాత్ అభివృద్ధికి అదానీ సహకారం: గుజరాత్ రాజధాని గాంధీ నగర్‌లో ప్రధాని నరేంద్ర మోడీ 9వ వైబ్రెంట్ గుజరాత్ అంతర్జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ పెట్రోకెమికల్ సంస్థ అదానీ అధినేత గౌతమ్ మాట్లాడుతూ ఈ సదస్సుకు హాజరు కావడం తనకెంతో ఆనందంగా ఉందని తన స్వారాష్ట్రమైన గుజరాత్‌లో ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం గొప్పగా భావిస్తున్నానని అన్నారు. అభివృద్ధి విషయంలో దేశానికి గుజరాత్ మోడల్‌గా మారిందని పేర్కొన్నారు. ప్రధాని మోడీ దేశంలో వివిధ రంగాల అభివృద్ధికి అమితంగా కృషి చేస్తున్నారని దేశవిదేశాల నుంచి పెట్టుబడులను తీసుకువస్తున్నారని అన్నారు. దీనికితోడు మోడీ అధికారంలోకి వచ్చాక అనేక ఆర్థిక సవరణలు జరిగాయని, దీనితో సులభతర వాణిజ్యం సాధ్యమైందన్నారు. గుజారాత్ అభివృద్ధికి అదానీ సహకారం అందిస్తుందని గౌతమ్ తెలిపారు.



రెస్టారెంట్ వద్ద లైన్‌లో బిల్‌గేట్స్



వాషింగ్టన్: మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ సంపన్నుడే అయినా సాధారణ జీవితాన్ని గడపటానికి ఇష్టపడతారాయన. అందులోనూ ఫాస్ట్‌వుడ్ అంటే ఆయనకు చాలా ఇష్టమట. ఎప్పుడూ వాషింగ్టన్‌లో ఆయన నివసించే బెల్లెవ్యూ ప్రాంతానికి దగ్గర్లో ఉన్న బర్గర్ షాప్ వద్దకు వెళుతుంటారు. అయితే మైక్ గాలోస్ అనే నెటిజన్ పోస్ట్ చేసిన బిల్‌గేట్స్ ఫొటో ఒకటి సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. స్థానిక బర్గర్ రెస్టారెంట్ వద్ద సాధారణ వ్యక్తిలా ఆయన లైన్‌లో వేచిచూస్తున్నప్పుడు తీసిన ఫొటో అది. కోట్ల ఆస్తి ఉండి.. ప్రపంచంలోనే అతిపెద్ద ఛారిటీకి యజమాని అయివుండి ఓ బర్గర్ కోసం సాధారణ వ్యక్తిలా లైన్‌లో వేచిచూస్తున్న బిల్‌గేట్స్. నిజమైన సంపన్నులు ఇలాగే ప్రవర్తిస్తారు అని మైక్ క్యాప్షన్‌లో పేర్కొన్నారు.

పెట్రో కెమికల్ హబ్ అభివృద్ధికి
నయారా ఎనర్జీ కృషి

గాంధీనగర్: ప్రముఖ ఆయిల్ కంపెనీ నయారా ఎనర్జీ గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరుగుతున్న 9వ వైబ్రెంట్ గుజరాత్-2019 సదస్సులో గుజరాత్ ప్రభుత్వంతో కెమికల్ హబ్ అభివృద్ధి కోసం భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. తొలిదశలో సంస్థాగతంగా ఏర్పాటు చేయబోయే నూతన రిఫైనరీ, పెట్రో కెమికల్ యూనిట్లనునెలకొల్పేందుకు నయారా ఎనర్జీ 850 మిలియన్ల అమెరికన్ డాలర్లను వెచ్చించనుంది. దీనికితోడు దేవభూమి ద్వారకలో స్మార్ట్ అగ్రికల్చర్, వాటర్ కన్జర్వేషన్ ప్రోగాంను 11000 హెక్టార్లలో నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ సందర్భంగా నయారా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆనంద్ మాట్లాడుతూ గుజరాత్ ప్రభుత్వ భాగస్వామ్యంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

రూ. 2,000 కోట్ల సేకరణ దిశగా ఐఐఎఫ్ఎల్



ముంబై: ప్రముఖ ఇండియా ఇన్ఫోలైన్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్)కు అనుబంధంగా ఉన్న ఐఐఎఫ్ఎల్ హోల్డింగ్స్ లిమిటెడ్ జనవరి 22న పబ్లిక్ ఇష్యూ బాండ్లను విడుదల చేసి రూ. 2,000 కోట్లను సేకరించాలని నిర్ణయించింది. ఇలా సేకరించిన నిధులతో సంస్థను విస్తరించాలని భావిస్తోంది. ఈ సందర్భంగా ఐఐఎఫ్ఎల్ గ్రూప్ సీఎఫ్ఓ ప్రభోద్ అగర్వాల్ మాట్లాడుతూ ఈ విధంగా సేకరించిన మొత్తాన్ని లెండింగ్, ఫైనాన్సింగ్, జనరల్ కార్పోరేట్ విభాగాలలో వినియోగించి సంస్థను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

బిగ్‌బజార్‌లో సబ్‌సే సస్తే పాంచ్ దిన్

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద షాపింగ్ ఫెస్టివల్ అయిన బిగ్ బజార్‌కు చెందిన సబ్ సే సస్తే పాంచ్ దిన్ మరోసారి వినియోగదారుల ముందుకు వచ్చింది. జనవరి 23 నుంచి 27 వరకూ నిర్వహించే ఈ ఐదు రోజుల వేడుకలో అదనంగా మరో 20శాతం రాయితీ కల్పించనున్నట్లు బిగ్ బజార్ తెలిపింది. అలాగే 20శాతం క్యాష్ బ్యాక్ అందించనున్నట్లు పేర్కొంది. దీనిని రూ. 3000 అంతకు మించిన వస్తువులను బిగ్ బజార్‌లో కొనుగోలు చేసినపుడు అందుకోవచ్చు. కాగా బిగ్‌బజార్‌లో ఫుడ్, హౌస్‌హోల్డ్ ఐటమ్స్, ఎలక్ట్రానిక్, ఫ్యాసన్ అపెరల్స్, ఫుట్‌వేర్, టాయిస్, లగేజ్, కిచెన్‌వేర్, హోమ్ డెకార్ మొదలైన వస్తువులు అందుబాటులో ఉంటాయి.

డాకర్ ర్యాలీలో హీరో ముందడుగు



న్యూఢిల్లీ: డాకర్ ర్యాలీలో సెకెండ్ బ్యాక్ టు బ్యాక్ టాప్ టెన్‌ను హీరో మోటో స్పోర్ట్స్ టీమ్ ర్యాలీ అధిగమించింది. ఈ టీమ్ థర్డ్ రౌండ్‌ను కూడా విజయవంతంగా పూర్తి చేసింది. డాకర్ ర్యాలీలో పాల్గొంటున్న మూడు సంవత్సర్లానూ హీమో మోటో ఇదే విధమైన విజయాన్ని అందుకుంటూ వస్తోంది. పిస్కోలో జరురుగున్న డాకర్ ర్యాలీలో ఫినిష్ లైన్‌ను హీరో మోటో అధిగమించింది. ఈ సందర్భంగా ఈ పోటీలో పాల్గొన్న ఓరియల్ మెనా మాట్లాడుతూ డాకర్ ర్యాలా అత్యద్భుతంగా సాగింది. ఈ మార్గంలో ఎన్నో ఎత్తుపల్లాలు ఎదురయ్యాయి. వాటిని అధిమిస్తూ ఫైనల్ పాయింట్‌కు చేరుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో
వివో ఆఫర్లు

న్యూఢిల్లీ: గ్లోబల్ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ వివో నాలుగు రోజుల వివో రిపబ్లిక్ డే సేల్‌ను ప్రకటించింది. ఈ సమయంలో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో వివో ఫోన్లను కొనుగోలు చేసేవారికి ప్రత్యేక ఆఫర్లను అందించనున్నట్లు తెలిపింది. ఎక్స్ఛేంజ్ ఆఫర్‌తో పాటు నో కాస్ట్ ఈఎంఐ ఆప్షన్ అందిస్తున్నట్లు పేర్కొంది. అమెజాన్‌లో జనవరి 20 నుంచి 23 వరకు, జనవరి 20 నుంచి ఆఆ వరకూ ఫ్లిప్‌కార్ట్‌లో ఈ ఆఫర్లు అందిస్తున్నట్లు వివో తెలిపింది. ఈ సందర్భంగా వివో ఇండియా సీనియర్ వీపీ జెరోమ్ ఛాన్ మాట్లాడుతూ రాబోయే 70వ రిపబ్లిక్‌డేను వినియోగదారుల కోసం ప్రత్యేకంగా నిర్విహించాలని వివో భావిస్తోంది. అందే కొనుగోలుదారులకు ప్రత్యేక ప్రయోజనాలతో పాటు రాయితీలు అందిస్తున్నట్లు తెలిపారు.

సీనియర్ సిటిజన్లకు ఆఫర్
60 శాతం రాయితీ ప్రకటించిన ఎయిర్ ఇండియా



న్యూఢిల్లీ: సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక డిస్కౌంట్లను ప్రకటించాలని ఎయిర్ ఇండియా నిర్ణయించింది. ఎయిర్ ఇండియా వెబ్‌సైట్ నుంచి 60 ఏళ్లు పైబడిన భారత పౌరులు బుక్ చేసుకునే ప్రతి ఎకానమీ క్లాస్ టికెట్‌పైనా 50 శాతం వరకూ రాయితీని ఆఫర్ చేయనున్నారు. 60 సంవత్సరాలు మించిన సీనియర్ సిటిజన్ల వయసును ధ్రువీకరించేందుకు ప్రభుత్వం గుర్తించిన సరైన గుర్తింపు కార్డులను చూపి ఈ ఆఫర్‌ను పొందవచ్చని ఎయిర్ ఇండియా పేర్కొంది. ప్రయాణ తేదీకి వారం రోజుల ముందు ఈ ఆఫర్‌ను ఉపయోగించుకోవచ్చు. దీంతో పాటు చిన్నారులతో ప్రయాణించే సీనియర్ సిటిజన్‌కు రూ 1000ల ప్రత్యేక డిస్కౌంట్‌ను కూడా ఎయిర్ ఇండియా ప్రవేశపెట్టింది. ఎయిర్ ఇండియా ప్రత్యేక ఆఫర్‌తో దేశంలో పెద్దసంఖ్యలో ఉన్న సీనియర్ సిటిజన్లకు విమాన ప్రయాణం అందుబాటులోకి రానుంది.

ఫిట్‌నెస్ సెంటర్ల ఏర్పాటులో కల్ట్ సెంచరీ: హైదరాబాద్: అగ్రగామి వెల్‌నెస్ స్టార్టప్ క్యూర్ ఫిట్ తన 100 వ కల్ట్ ఫిట్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించింది. 2019 చివరినాటికి దేశంలో అత్యధిక ఫిట్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిశ్చయించుకుంది. సంస్థ స్థాపించిన రెండేళ్ల స్వల్ప వ్యవధిలోనే బెంగళూరు, ఢిల్లీ, గురుగ్రామ్, హైదరాబాద్‌లలో ఫిటెనెస్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ముంబైలో ఏర్పాటైన క్యూర్ ఫిట్ సంస్థ 2018 నుంచి విస్తరణ దిశగా ముందుకు సాగింది. కాగా కల్ట్ ఫిట్ లో లక్షమంది సభ్యులుగా చేరారు. ఈ ఫిట్‌నెస్ సెంటర్లో స్ట్రెంత్ కండీషనింగ్, బాక్సింగ్, యోగా తదితర వ్యాయామానికి సంబంధించిన విధానాలు అందుబాటులో ఉంటాయని సంస్థ తెలిపింది.

సామర్థ్యం కలిగిన స్టాక్స్‌తో చక్కని రాబడులు



హైదరాబాద్: భారతదేశంలో ఆర్థిక పరంగా ఆశావాద సంవత్సరంగా 2019 వ సంవత్సరం నిలుస్తుందని హైదరాబాద్‌లోజరిగిన పాత్రికేయుల సమావేశంలో కార్వీవెల్లడించింది. ఇటీవలనే ఆర్‌బీఐ విడుదల చేసిన ఆర్థిక స్థిరత్వ నివేదిక ప్రకారం బ్యాంకుల గ్రాస్ నాన్ -ఫెర్‌ఫార్మింగ్ ఎస్సెట్స్ (ఎన్‌పీఏ)లు మార్చి 2018లో ఉన్న 11.5 శాతం నుంచి సెప్టెంబర్ 2018 నాటికి 10.8 శాతానికి తగ్గాయి. ఇది మార్చి 2019 నాటికి మరింతగా తగ్గి 10.3 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. ఆర్థికవ్యవస్థకు, మార్కెట్‌లకు ఇది సానుకూలంగా ఉండటంతో పాటుగా నిఫ్టీ14 వేల పాయింట్లను చేరుకోవడాన్ని లక్ష్యంగా చేసుకుంది. తాజా సమాచారం వెల్లడించిన దాని ప్రకారం రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబర్‌లో వేగంగా తగ్గింది. ఈ కారణం చేత ఆర్‌బీఐ వడ్డీరేట్లను సవరించే అవకాశాలున్నాయనే అంచనాలున్నాయని కార్వీ వెల్లడించింది.

మార్చి మొదటి వారంలో లోక్‌సభ షెడ్యూల్?



న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల సమరానికి నగారా మోగనున్నది. మార్చి మొదటి వారంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసేందుకు కసరత్తు సాగుతున్నట్టు ఎన్నికల కమిషన్ (ఈసీ) వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత లోక్‌సభ గడువు జూన్ 3తో ముగియనున్నది. ఎన్నికలను ఏయే తేదీల్లో ఎన్ని దశల్లో నిర్వహించాలనే అంశంపై ఈసీ తర్జనభర్జనలు సాగిస్తున్నట్టు ఆ వర్గాలు తెలిపాయి. భద్రతా దళాల లభ్యత, వాతావరణ పరిస్థితులు సహా పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈసీ ఎన్నికల తేదీలను ఖరారు చేయనున్నది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కసరత్తును పూర్తి చేసి మార్చి మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ప్రకటిస్తుందని భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్ర ప్రదేశ్, ఒడిషా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలనూ నిర్వహించవచ్చని ఈసీ వర్గాలు పేర్కొన్నారు. ఇక 2014లో మార్చి 5న ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన ఈసీ ఏప్రిల్- మే నెలల్లో తొమ్మిది విడతలుగా పోలింగ్ నిర్వహించింది. ఏప్రిల్ 7న తొలి విడత పోలింగ్ చేపట్టిన ఈసీ మే 12న తుది విడత పోలింగ్‌తో ఎన్నికల ప్రక్రియను ముగించింది.

ఏపీలో వైసిపిదే అధికారం

• రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి రావడం తథ్యం • రానున్న ఎన్నికలలో ఒంటరిగానే వైసిపి పోటీ • ప్యాకేజీ ముద్దు అని అంగీకరించిన చంద్రబాబు • బిజెపిపై నిందలేసి పబ్బం గడుపుతున్నారు • మాజీ మంత్రి, వైసిపి నేత ధర్మాన

(సూర్యబ్యూరో శ్రీకాకుళం) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాల కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దేనికైనా రెడి అని మాజీ మంత్రి,ఆ పార్టీ సినియర్ నేత ధర్మాన ప్రసాదరావు అన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ ముందుకు వస్తే ఆ రాజకీయ పార్టీతో కలిసి పోరాటం చేయడానికి సిద్దమని ఎప్పుడో జగన్ చెప్పారన్నారు. జగన్ ఆలోచనలకు మద్దతు పలికిన మరో ప్లాట్ ఫాం ఫెడరల్ ఫ్రంట్ అన్నారు.అటువంటి అవకాశం లభిస్తే తిరస్కరించాలా చెప్పండంటూ చంద్రబాబుని ప్రశ్నించారు.శ్రీకాకుళంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ కేంద్రంలోని ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి కారణంగా రాష్ట్రానికి సంక్రమించిన హక్కులు సాధించుకోవడంలో కష్టమవుతుందన్నారు.రాష్ట్రాల హక్కులను సాధించుకోవడం కోసం పోరాడేందుకు ఏర్పాటైందే ఫెడరల్ ఫ్రంట్ అన్నారు.దేశంలోని ఇతర రాష్ట్రాలతో చర్చిస్తున్నట్లుగానే ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని టిఆర్ ఎస్ సంప్రదించిందన్నారు.విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ల తో పోరాటం చేస్తున్న వై.ఎస్ జగన్ కు మద్దతు తెలిపి తాము బాసటగా నిలుస్తామని చెప్పడం జరిగిందన్నారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసి పోరాటం చేస్తామంటే వైసిపి,టిఆర్ ఎస్ కలిసి పోటీ చేయడం కాదన్నారు. ఆంధ్రప్రదేశ్ లో టిఆర్ ఎస్,వైసిపి కలిసి పోటీ చేస్తాయని ఎక్కడా చెప్పలేదన్నారు.ఈ విషయాన్ని చంద్రబాబుకి జ్ఞాపకం చేస్తున్నామన్నారు.చంద్రబాబుకి అర్థమైనా అర్థం కానట్లు మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.చంద్రబాబు వ్యవహారాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, విధానాల ప్రకారం రాష్ట్రాలకు రావాల్సిన హక్కులు తూచ తప్పకుండా అమలు చేసేలా ఉండేటటువంటి ఒక ఆలోచన కలిగిన ఫ్లాట్ ఫాం ఒకటి ఏర్పాటైతే దానిని సమర్ధించేటటువంటి ప్రాథమిక చర్చలవి .టిఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటిఆర్,వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డిని కలిసి ఆ విషయంలోనే చర్చలు జరిపారు.అయితే ఈ చర్చలపై చంద్రబాబు అండ్ కో ప్రజలను మభ్యపెట్టేలా వ్యాఖ్యానిస్తున్నారన్నారు.మంత్రులైతే వైసిపి,టిఆర్ఎస్ కలిసి పోటీ చేస్తాయంటూ ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని వారిని చూసి ప్రజలు బఫూన్లగా భావిస్తున్నారన్నారు.ఏ రాజకీయ పార్టీలతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి పొత్తులు ఉండవన్నారు.తమ అధినేత జగన్ ఇప్పటికే స్పష్టం చేసారన్నారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం దేనికైనా తెగించగల పార్టీ వైసిపి అని ప్రజలు అంగీకరించారన్నారు.రానున్న ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టబెట్టేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారన్నారు . రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత నాలుగున్నరేళ్ళలో విభజన హామీలు సాధించడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. అనైతిక పొత్తులతో చంద్రబాబు రాజకీయాలు చేసిన విషయం ప్రజలకు తెలిసి అసహించుకుంటున్నారన్నారు.జగన్ నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు.జగన్ క షి ఫలిస్తే ఏడాదిలోగా ప్రత్యేక హోదా సాధించగలుగుతామన్నారు. దా వస్తే పెట్టుబడులు రాష్ట్రానికి విరివిగా వస్తాయని,ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.వైసిపి కల ,జగన్ ఆలోచన విజయవంతంమవుతుందన్నారు.విభజన హామీలను సాధించుకునేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తున్న విషయం ప్రజలందరికి తెలిసిందేనన్నారు.రాష్ట్ర ప్రజల అభిప్రాయాలను కేంద్ర ప్రభుత్వం ద ష్టికి అలాగే రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వం ద ష్టికి తీసుకువెళ్లడం కోసం సభలు,సమావేశాలు ,నిరసనలు చేయడం జరిగిందన్నారు.చివరికి కేంద్ర ప్రభుత్వంపై వైసిపి ఎం.పిలుఅవిశ్వాస తీర్మానం పెట్టడం,పదవులకు రాజీనామలు చేయడం జరిగిందన్నారు.రాష్ట్ర విభజన



సమయంలో అప్పట్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్,ప్రతిపక్షంలో ఉన్న బిజెపిలు కలిసి ఏకగ్రీవంగా తీర్మానం చేసిన హామీలు నేటికి అమలు కాలేదన్నారు.2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ నాలుగేళ్ళ పాటు కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉండి కూడా వాటిని సాధించలేకపోయిందన్నారు.ప్రత్యేక హోదాకి బదులుగా ప్యాకేజీకి అంగీకరించిన చంద్రబాబు కేంద్ర ప్రభుత్వం,ప్రధాని నిర్ణయాన్ని స్వాగతిస్తూ అభినందిస్తూ శాసనసభలోను తీర్మానం చేసారన్నారు.ఇప్పుడు యు టర్న్ తీసుకుని ప్రత్యేక హోదా అంశాన్ని తెరపైకి తెచ్చారన్నారు.ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు.అయితే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో నష్టపోయిన ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని క షి చేస్తుందన్నారు.పరిశ్రమలు,ఉపాధి తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలన్నది జగన్ ఆలోచనన్నారు2014 నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒకే మాట మీద నిలబడిందన్నారు.రాష్ట్రాన్ని చంద్రబాబు అదోగతి పాలుచేసారని మండిపడ్డారు.అమరావతి రాజధాని పేరుతో రహస్య ఒప్పంధాలు చేసుకుని ప్రజాధనాన్ని లూటీ చేసారన్నారు.

జైపాల్‌రెడ్డికి డీకే అరుణ చెక్




హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలంగాణ కాంగ్రెస్‌పార్టీలో ఫాంహౌజ్ రాజకీయం తీవ్ర కలకలం సృష్టిస్తున్నది. పార్టీ సీనియర్ నేత జైపాల్ రెడ్డికి చెక్ పెట్టేందుకు డీకే అరుణ స్కెచ్ వేస్తున్నట్లుగా తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ చేతిలో ఓడిపోయిన అరుణ ఎంపీగా పోటీ చేయాలన్న నెపంతో ఫాంహౌజ్‌లో పార్టీకి చెందిన సీనియర్ నేతలతో పాటు కొత్తగా ఎంపికైన ఎమ్మెల్యేలకు విందు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో తన రాజకీయ ప్రత్యర్థి, మహబూబ్ నగర్ ఎంపీ స్థానానికి అడ్డుగా వున్న జైపాల్ రెడ్డికి చెక్ పెట్టేందుకు మరో కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డితో కలిసి మంతనాలు జరుపుతున్నట్లుగా కాంగ్రెస్‌పార్టీ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. మహబూబ్ నగర్ లోక్ సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించిన డీకే అరుణ ఇటీవల పార్టీ సీనియర్ నేతలు, కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలు, ఓడిపోయిన అభ్యర్థులకు విందు ఇచ్చిన విషయం తెలిసిందే!. మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాలో రెండు లోకసభ స్థానాలుండగా..వీటిలో నాగర్ కర్నూల్ సీట్ ఎస్సీలకు రిజర్వ్ అయింది. గత ఎన్నికల్లో నంది ఎల్లయ్య పోటీ చేసి గెలిచారు. ఇప్పుడు ఆ సీటుపై మల్లు రవి, సంపత్ కుమార్ తదితరులు పోటీపడుతున్నారు. అయితే, మల్లు రవికి వ్యతిరేకంగా కూడా డీకె అరుణ పావులు కదుపుతున్నట్లు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో నారాయణపేట టిక్కెట్ పై జైపాల్ రెడ్డి, అరుణ మధ్య వివాదం రాజుకుంది. ఈ క్రమంలో మరోసారి ఎంపీ టిక్కెట్ విషయంలో మరోసారి ఇద్దరి మధ్యా వివాదం తలెత్తే అవకాశముంది.

సంక్షేమ కార్యక్రమాలకు ఎన్టీఆరే ఆద్యుడు



హైదరాబాద్, సూర్య ప్రధానప్రతినిధి : బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఎన్టీఆర్ ఎంతగానో కృషి చేశారని హిందుపురం ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. ప్రస్తుతం దేశంలో అమలు అవుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఎన్టీఆరే ఆధ్యుడని ఆయన తెలిపారు. తెలుగుజాతి ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రాజకీయపార్టీని ఏర్పాటు చేశారన్నారు. పార్టీ ఏర్పాటు చేసిన తొమ్మిదిమాసాలకే అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో బడుగు,బలహీనవర్గాలకు చెందిన ఎంతో మంది రాజకీయంగా ఎదిగారన్నారు. ఎన్టీఆర్ 23వ వర్ధంతి సందర్భంగా నగరంలోని బేగంపేటలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి బాలకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలీని ప్రారంభించారు. అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు దివంగత శ్రీపతిరాజేశ్వర్ తనయుడు శ్రీపతి సతీష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ఘాట్ వరకు అమరజ్యోతి ర్యాలీ సాగింది. ఈ ర్యాలీలో పార్టీకి చెందిన నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎల్.రమణ, నగర పార్టీ అధ్యక్షుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావుతో పాటు నందమూరి సుహాసిని, సనత్‌నగర్ పార్టీ ఇంచార్జీ కూన వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విదేశీ విద్య (ఓవర్సీస్) విద్యా నిధికి 42 మంది విద్యార్థుల ఎంపిక



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అంబేద్కర్ విదేశీ విద్యా నిధి కింద 42 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఎస్సీ సంక్షేమ శాఖ కమిషనర్ పి.కరుణాకర్ తెలిపారు. శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో వీరికి సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూలు నిర్వహించామని తెలిపారు. ఈ పథకానికి 48మంది దరఖాస్తు చేసుకోగా..45మంది హాజరు కాగా వీరిలో ముగ్గురు ఎంపిక కాలేదని తెలిపారు. ఈ పథకం కింద ఎంపికైన విద్యార్థులు అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, సింగాపూర్, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా దేశాలలో ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్ సైన్సెస్, మెడిసిన్, నర్సింగ్, సోషల్ సైన్సెస్, హ్యూమనిటీస్‌లలో పోస్టు గ్రాడ్యుయేషన్ ఆ పై కోర్సులు చదవడానికి తెలంగాణ ప్రభుత్వం రూ.20లక్షల ఆర్థిక సహాయాన్ని అందించనుందని, విమాన ప్రయాణానికి, వీసా ఖర్చులు మంజూరు చేయబడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మొదటి పేజీ తరువాయి

ధర్మాసనం ముందుకు పంచాయతీ



ఎన్నికల్లో మున్సిపల్ ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి ఇరవై మూడు శాతానికి తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం దుర్మార్గం ఒకవైపు జనాభా ప్రకారం బిసి రిజర్వేషన్లను 34 శాతం నుంచి 56 శాతం కు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉద్యమాలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ను సాకుగా చూపుతూ తగ్గించడం అన్యాయం. సుప్రీంకోర్టు తీర్పు కొత్తగా వచ్చింది కాదు 2010లోనే తీర్పు వచ్చింది సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తర్వాత 2013 లో గ్రామ పంచాయతీ ఎన్నికలు 2014 ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు జరిపారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం బిసి రిజర్వేషన్లను 34 శాతం నుంచి 23 శాతం కు తగ్గించడానికి జీవో జారీ చేసింది, వెంటనే బీసీ సంఘాలు ఉద్యమాలు చేయగా అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి పంచాయతీరాజ్ శాఖ మంత్రి జానా రెడ్డి బీసీ సంఘాలతో చర్చలు జరిపి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసి, ప్రముఖులైన న్యాయవాదులను పెట్టి స్టే తీసుకువచ్చి 34 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరిపారు. గత 30 సం.లుగా 34 శాతం రిజర్వేషన్లు కొనసాగుతున్నాయి. అప్పుడులేని అవరోధాలు ఇప్పుడు ఎందుకు వస్తున్నాయి. బి సి సంక్షేమ సంఘం ఆ.కృష్ణన్న అద్వర్యంలో 1980 1986 వరకు అనేక పోరాటాలు చేసి ఈ 34 శాతం రిజర్వేషన్లు బి సి లు పోరాడి సాధించుకున్నారు. ఎన్ని త్యాగాలు, పోరాటాలు చేసైనా ఈ రిజర్వేషన్లను కాపాడుకోవాల్సిన భాద్యత బి.సిల పై యుంది. ఈ రిజర్వేషన్లను కొనసాగించడానికి రెండు ప్రత్యామ్నాయ మార్గాలు యున్నవి, మొట్టమొదట జనవరిలోగా ఎన్నికలు జరపాలనే హై కోర్టు తీర్పుపై సుప్రీం కోర్టులో అప్పిల్ చేసి ఎన్నికలు ఆరు నెలలు వాయిదా వెయాలి. ఇక రెండవ దశలో ముఖ్యమంత్రి అధ్యక్షతన అఖిలపక్షాన్ని డిల్లికి తీసుక వెళ్లి ప్రధానమంత్రి తో చర్చలు జరిపి పార్లమెంటులో రాజ్యాంగా సవరణ బిల్లు పెట్టించాలి. ఇక తాత్కాలికంగా హై కోర్టులో రిమ్యు పెటిషన్ దాఖలు చేసి ఈ ఒక ధఫా 34 శాతం కోన సాగించాలని ప్రత్యేకంగా కోరాలి. ఈ రెండు అవకాశాలను వినియోగిస్తే బి.సి. లకు న్యాయం జరుగాతుంది. ఒకవైపు బి.సి. రిజర్వేషన్లు జనాభా ప్రకారం 34 శాతం నుంచి 56 శాతంకు పెంచాలని బి.సి.లు డిమాండ్ చేస్తూటే కోర్టులు ప్రభుత్వాలు 34 శాతం నుంచి 23 శాతంకు తగ్గివడం న్యాయం కాదు. సుప్రీంకోర్టు తీర్పు కొత్తదేమీ కాదు. ఇది 2010 లో వచ్చింది. ఈ తీర్పు వచ్చిన తర్వాత 2013 లో గ్రామ పంచాయితి ఎన్నికలు 2014 ఎన్నికలు బి.సిలకు 34 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు కూడా అదే పద్దతిలో జరుపాలి. ఒకవేళ ప్రభుత్వానికి న్యాయపరమైన ఇబ్బందులు ఎదురవుతాయని భావిస్తే ఎన్నికలు ఆరు నెలలు వాయిదా వేసి పార్లమెంటు లో రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టడానికి చర్యలు తీసుకోవాలి. సుప్రీంకోర్టు హైకోర్టు పదే, పదే బి.సి రిజర్వేషన్లకు అడ్డు తగులుతున్నందున ఈ సమస్య అధిగమించడానికి రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారానే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. సుప్రీంకోర్టు 2010 లో మరియు 2018 లో బి.సి రిజర్వేషన్లు తగ్గించాలని తీర్పు చెప్పినందున దీనిని అధిగమించడానికి శాశ్వత పరిష్కారం రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్ లో ప్రవేశపెట్టాలని కోరుతున్నాం. బి.సి రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్దత లేనందువలననే కోర్టులు పదే, పదే జోక్యం చేసుకుంటున్నాయి. అందుకు గాను పార్లమెంట్ లో రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టి బి.సి లకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెట్టి విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రిజర్వేషన్లకు 50 శాతం సీలింగ్ రాజకీయ రిజర్వేషన్లకు పెట్టడంలో ఏ మాత్రం ఔచిత్యం లేదు. విద్యా, ఉద్యోగాలలో, మెరిట్ ప్రతిభ దెబ్బతినరాదనే కారణంతో 50 శాతం సీలింగ్ విధించడంలో శాస్త్రీయమైన, హేతుబద్దమైన, శాస్త్రీయమైన కారణం ఉంది. శాస్త్రవేత్తలు పరిపాలకులలో సమర్దత తోగ్గోద్దనే లక్ష్యం ఉంది. కాని రాజకీయ రిజర్వేషన్లకు సీలింగ్ విధించడంతో ఎలాంటి హేతుబద్దమైన కారణం లేదు. రాజకీయాలలో ఎలాంటి మెరిట్ లేదా సంఘ సేవ లేదా ప్రజల కోసం త్యాగాలు చేయడం లాంటి పారామీటర్స్ చూసి టికెట్లు ఇవ్వడం లేదు. కేవలం డబ్బులు వెదజల్లే పారిశ్రామిక వేత్తలు, కాంట్రాక్టర్లు, వ్యాపారస్తులు, రియల్ ఎస్టేట్ వారికీ, అలాగే ధనవంతులు సంపన్నులకు ఇచ్చి గెలువును ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. ఇలాంటి కలుషిత రాజకీయ వాతావరణంలో 50 శాతం సీలింగ్ పెట్టడంలో ఏమైనా ప్రజాస్వామ్య నీతి ఉందా ? ఏమైనా శాస్త్రీయత హేతుబద్దత యుందా! రిజర్వేషన్లు లేక పోతే బి.సిలు సర్పంచ్ లు బీసీలు అయ్యే అవకాశం లేదు. మనది ప్రజాస్వామ్యదేశం ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి కులం-ప్రతి సామాజిక వర్గానికి వారి, వారి జనాభాప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి, కాని ఈ రాజకీయ పార్టిలు ప్రభుత్వాలు, కోర్టులు బి.సి. లకు అన్యాయం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం పై వత్తిడి తేచ్చి రాజ్యంగ సవరణ బిల్లును పార్లమెంటులో పెట్టి బి.సి.లకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పిచాలని బీసీలు డిమాండ్ చేస్తున్నారు.

గులాబీ నీడన ఒంటేరు



వేగంగా అభివృద్ధి జరగాలంటే, ప్రాంతీయ పార్టీలు కేంద్రంలో నిర్ణయాత్మక పాత్ర పోషించాలన్నారు. కేంద్రాన్ని శాసించడం ద్వారానే తెలంగాణలో అనుకున్న అభివృద్ధి వేగవంతమవుతుందని చెప్పారు. అది జరగాలంటే రానున్నా లోక్‌సభ ఎన్నికల్లో 16 పార్లమెంట్ స్థానాలను టీఆర్ఎస్ పార్టీ గెలవాల్సిందేనని అన్నారు. ఒరిస్సా సీఎం నవీన్ పట్నాయక్ కూడా బీజేపీ, కాంగ్రెస్ యేతర పార్టీకే మద్దతు అంటున్నారని, వైసీపీ అధ్యక్షుడు జగన్ కూడా కేంద్ర లో మనమే చక్రం తిప్పేలా ఉండాలని కోరుకుంటున్నారని చెప్పారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో గజ్వేల్ నుంచి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలైన ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, టీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పిపార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ కేసీఆర్ పై అక్కసుతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇష్టారీతిలో మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అంధ్రపై గద్దల్లా వాలింది ఎవరంటూ ప్రశ్నించారు. మోడీని, కేసీఆర్ ను బూచిగా చూపి ప్రజలను చంద్రబాబు గందరగోళం లో పడేస్తున్నారని విరుచుకుపడ్డారు. ఆంధ్ర ప్రజలకు తమ విజ్ఞప్తి ఒక్కటేనని, తామేమి ఆంధ్ర ప్రజలకు, ఆంధ్ర అభివృద్ధికి వ్యతికం కాదన్నారు. తెలంగాణ లోని సెటిలర్స్ అంతా కేసీఆర్ కే జై కొట్టారని పేర్కొన్న కేటీఆర్, తన అసమర్ధతను కప్పిపుచ్చుకోవడానికి చంద్రబాబు, కేసీఆర్ పై అభాండాలు వేస్తున్నారంటూ మండిపడ్డారు. సోనియా గాంధీని ఇటలీ మాఫియా అన్న చంద్రబాబు, ఇప్పుడు ఆపార్టీ తోనే జత కట్టారంటూ ఎద్దేవా చేశారు. నాలుగున్నరేళ్లు మోడీ తో సంసారం చేసినా చంద్రబాబు, ఇవాళ బయటికి వచ్చి తన చేతగాని తనాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఇతరులను బూచిగా చూపెట్టే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. అన్నదమ్ముల్లా విడిపోదామని, అభివృద్ధిలో కలిసుందామని తాము గతంలోనే చెప్పామని, అన్నట్టుగానే తాము ఎక్కడా కూడా ఏపీ కి వ్యతిరేకంగా వ్యవహరించలేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాంతంలో నివసించే సీమాంధ్రులు కేసీఆర్ కి ఓటు వేసి గెలిపించారంటేనే, వాళ్ళని తాము ఎలా గుండెల్లో పెట్టి చూసుకున్నామో అర్ధం అవుతుందన్నారు. 2018 ఎన్నికల్లో 47-50% ప్రజలు కు ఓట్లు వేశారని, ఓడిపోయిన చోట కూడా అతి తక్కువ తేడాతో ఓడిపోయామని తెలిపారు. ఆసిఫాబాద్ లో కేవలం 180 ఓట్ల తేడాతో ఓడిపోయినట్లు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 75% స్థానాలను తెరాస కు ప్రజలు కట్టబెట్టారని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ లో కోపం వచ్చినా, ప్రేమ వచ్చినా ఆగదని, ఆ తర్వాత అంతా మంచిగానే కలిసుంటామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేద్దామని కేటీఆర్ కోరారు. స్వల్ప కాలం లోనే ఎంతో మందితో కలిసి టీఆర్ఎస్ లో చేరుతున్న ప్రతాప్ రెడ్డికి పార్టీలోకి స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. 2009 లోనే టీఆర్ఎస్ లో చేరాలని అడిగామని, కాదని కొన్ని కారణాలతో రాలేదన్నారు. 2009-2019 వరకు పోరాటం చేసి ఇప్పుడు మంచి నిర్ణయం తీసుకున్నారని అభినందించారు. గజ్వేల్ లో ఎవరు అడగకుండానే , అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రతాప్ రెడ్డి చేరికతో టీఆర్ఎస్ తిరుగు లేని శక్తిగా మారిందన్నారు. 10 సంవత్సరాల తర్వాత అయినా ప్రతాప్ రెడ్డి టీఆర్ఎస్‌లోకి రావడం ఆనందాన్ని ఇస్తోందన్నారు. కోటి ఎకరాల తెలంగాణ మాగానం కావాలని కేసీఆర్ పెట్టుకున్న కల, త్వరలోనే నెరవేరబోతోందన్నారు. కేసీఆర్ నేతృత్వంలోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని ప్రజలు నమ్మి, ఇటీవల జరిగిన ఎన్నికల్లో అఖండ విజయాన్ని కట్టబెట్టారన్నారు. టీఆర్ఎస్‌లో చేరిన ఒంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ 2009,14,18 లో నన్ను టిఆర్ఎస్ లో చేరాలని కోరితే, తాను చేరలేదన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే టీఆర్ఎస్ ను గెలిపించాయన్నారు. మల్లన్న సాగర్, వేముల ఘాట్ రైతులు కూడా టీఆర్ఎస్ కే ఓటు వేశారని, దీంతో నేను చేసిన ఉద్యమమే తప్పని నేను ఒప్పుకుంటున్నానని చెప్పారు. కేసీఆర్ నాకు ఎలాంటి బాధ్యత అప్పగించినా పని చేస్తానని తెలిపారు. గజ్వేల్ లో ప్రాజెక్టులు పూర్తి కావడమే తనకు ముఖ్యమన్నారు.

సిఎల్పీ నేతగా భట్టి విక్రమార్క



న్యూఢిల్లీ : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) నేత ఎంపికపై కొన్ని రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మల్లు భట్టి విక్రమార్కను సీఎల్పీ నేతగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నియమించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అశోక్ గెహ్లాట్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎల్పీ నేత ఎన్నిక పరిశీలకుడు కేసీ వేణుగోపాల్ గత రెండు రోజులుగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో సీఎల్పీ నేత నియామకంపై సమాలోచనలు జరిపి వారి అభిప్రాయాలు తీసుకున్నారు. గురువారం ఉదయం శాసనసభ కమిటీ హాల్‌లో కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం జరగగా కేసీ వేణుగోపాల్, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి ఆర్.సి. కుంతియా, 19 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు హాజరయ్యారు.ఈ సమావేశంలో సీఎల్పీ నేత ఎంపిక బాధ్యతను రాహుల్‌కు అప్పగిస్తూ ఏకవాక్య తీర్మానం చేశారు. ఈ ఏక వాక్య తీర్మానంతో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ ఢిల్లీకి వెళ్లిన విషయం తెలిసిందే. ఇది ఇలా ఉండగా, సీఎల్పీ రేసులో సబితా ఇంద్రారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు ఉన్నప్పటికీ ఈ పదవి దళిత వర్గానికి చెందిన భట్టికే దక్కింది. 2009లో, 2014లో భట్టి విక్రమార్క ఎమ్మెల్యేగా గెలిచారు. 2018లో మధిర నుంచి పోటీ చేసిన ఆయన విజయం సాధించారు.

లక్ష్మీపుత్ర పోచారం

చేశారు. రైతుబంధు పథకం ఎన్నో రాష్ట్రాల్లో స్ఫూర్తిని నింపిందని, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీలు ఇదే పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారని చెప్పారు. ఎన్నో మంచి కార్యక్రమాలను, మంచి ఫలితాలను ఆయన తెచ్చారని, ఆయన స్పీకర్ గానూ విజయవంతం అవుతారన్న నమ్మకం ఉందని అన్నారు. వివాద రహితుడిగా ఆయనకు మంచి పేరుందని, భగవంతుడు పరిపూర్ణమైన ఆరోగ్యం, ఆయుష్షును ఆయనకు ఇవ్వాలని ఆకాంక్షించారు. స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవానికి సహకరించిన ప్రతిపక్ష సభ్యులకు సీఎం కేసీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

టి.హరీష్ రావు

తెలంగాణ తొలి ఉద్యమం, మలి ఉద్యమంలో పాల్గొని శాసనసభ్యుడుగా ఎన్నికయి తిరిగి సభాపతిగా ఎన్నికకావడం తెలంగాణ ఉద్యమకారులకు దక్కిన గౌరవం.

కేటీఆర్


పోచారం స్పీకర్ కావడం రాష్ట్రాభివృద్ధికి శుభపరిణామం. రాష్ట్రంలో రెండో హరిత విప్లవానికి కూడా పోచారం వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడే బీజం పడింది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

రాష్ట్ర హోంమంత్రి మొహమద్ అలీ

శ్రీనివాసరెడ్డి వ్యవసాయ శాఖ మంత్రిగా దేశంలోనే గౌరవం అందుకున్నారు.ఆయన పనితీరుతో వ్యవసాయ రంగం అద్భుతమైన ప్రగతి సాదించింది.

ఈటెల రాజేందర్

శాసనసభా పతిగా రైతు బిడ్డ ఎన్నిక కావడం గొప్ప గౌరవం. రైతుల సమస్యలపై



సమావేశంలో ముక్కు సూటిగా మాట్లాడేవారు. తెలంగాణ మత్స్యకారుల జీవితంలో వెలుగు తేవడానికి ప్రయత్నం చేశారు.

కాంగ్రెస్ నేత గండ్ర వెంకటరమణారెడ్డి

రైతు బిడ్డగా రైతుల సమస్యలు తెలిసిన పోచారం గతంలో వ్యవసాయ శాఖను నిర్వహించిన తీరు ఆదర్శం. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.



పది అనుబంధ సంఘాలకు అధ్యక్షులను నియమించిన సీఎం

విజయవాడ, సూర్య బ్యూరో : తెలుగు యువత రాష్ట్ర అధ్యక్ష పదవి కష్ణాజిల్లాకు చెందిన దేవినేని అవినాశ్‌ను వరించింది. ఆయన దివంగత మాజీ మంత్రి దేవినేని నెహ్రూ తనయుడు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పది అనుబంధ పార్టీ విభాగాల అధ్యక్షులను ఖరారు చేశారు. రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ జాబితా విడుదలైంది. ప్రకాశం జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ పోతుల సునీత తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలుగా నియమితులయ్యారు. ఆమె బీసీల్లో చేనేత సామాజిక వర్గానికి చెందినవారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డిని తెలుగురైతు అధ్యక్షునిగా నియమించారు. బీసీ విభాగానికి రాష్ట్ర అధ్యక్షునిగా గుంటూరుజిల్లాకు చెందిన బోనబోయిన శ్రీనివాసయాదవ్, ఎస్సీ సెల్ విభాగ అధ్యక్షునిగా అనంతపురం జిల్లాకు చెందిన ఎం.ఎస్.రాజు, ఎస్టీ విభాగానికి అధ్యక్షునిగా విశాఖపట్నం జిల్లాకు చెందిన ఎం.వి.వి.ప్రసాద్, మైనారిటీ విభాగానికి అధ్యక్షునిగా కర్నూలు జిల్లాకు చెందిన ఇంతియాజ్ అహ్మద్ నియమితులయ్యారు. చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ బి.నరేశ్‌కుమార్‌రెడ్డి టీఎన్‌టీయూసీ అధ్యక్షునిగా, గుంటూరుకు చెందిన మద్దిరాల జోసెఫ్ ఇమ్మానుయేల్ క్రైస్తవ విభాగానికి అధ్యక్షునిగా, అదే జిల్లాకు చెందిన భీమినేని వందనాదేవి అంగన్‌వాడీ యూనియన్‌కు అధ్యక్షురాలిగా నియామకం పొందారు. కాగా, పార్టీ బలోపేతానికి క షి చేయడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందేలా చూస్తానని దేవినేని అవినాశ్ అన్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షునిగా అవినాశ్‌ను నియమిస్తూ టీడీపీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

జీవితాంతం ఒకటే కుల సర్టిఫికెట్

- కార్యదర్శుల సమావేశంలో సీఎస్ పునేఠ నిర్ణయం
- 15 రోజుల్లో జీఓ జారీ

(వెలగపూడి సూర్య ప్రత్యేక ప్రతినిధి) : ప్రతి పౌరునికి కులం, పుట్టిన తేదీ, పుట్టిన ప్రదేశంలలో జీవితాంతం మార్పులు ఏమీ ఉండవని, అందువల్ల ఒక సారి ఇచ్చిన ధృవపత్రం(సర్టిఫికెట్) జీవితాంతం ఉపయోగపడే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) అనిల్ చంద్ర పునేఠ నిర్ణయం తీసుకున్నారు. సచివాలయం 5వ బ్లాక్ మొదటి అంతస్తులోని కలెక్టర్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఉదయం జరిగిన కార్యదర్శుల సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఈ ధృవపత్రాల కోసం ప్రతి ఆరు నెలలకు ఒకసారి విద్యార్థులను, నిరుద్యోగులను, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను రెవెన్యూ కార్యాలయాలు, మీసేవా కేంద్రాల చుట్టూ తిప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ఒకసారి ఇచ్చిన సర్టిఫికెట్ జీవితాంతం ఉపయోగపడాలన్నారు. ఆదాయంలో మార్పు వచ్చే అవకాశం ఉంటుందని, ఆ సర్టిఫికెట్ కూడా 4 ఏళ్ల వరకు ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సర్టిఫికెట్ల విషయంలో అన్ని శాఖల సిబ్బందికి అవగాహన కల్పించాలని, విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రభుత్వ ఇ-గవర్నెన్స్, ఐటీ సలహాదారు జె.సత్యనారాయణతో చర్చించి సీనియర్ అధికారుల సలహాలు తీసుకొని 15 రోజుల్లో జీఓని రూపొందించమని ఆర్టీజీ సీఈఓ అహ్మద్ బాబుకు సూచించారు. అవసరంలేని పోలీస్ వెరిఫికేషన్, ఇతర సర్టిఫికెట్లను ఆయా శాఖలతో సంప్రదించి తీసివేయాలన్నారు. సర్టిఫికెట్ల విషయంలో ప్రజలు ఇబ్బందిపడకుండా ఉండాలని సీఎస్ చెప్పారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు సమాచార, పౌరసంబంధాల శాఖ కార్యదర్శి రామాంజనేయులు సీఎస్‌కు ధన్యవాదాలు తెలిపారు. 60 ఏళ్లుగా ఈ సర్టిఫికెట్ల కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఇది చాలా మంచి నిర్ణయంగా పేర్కొన్నారు.

21వ తేదీ నాటికి అవసరమైన ఫైల్స్ సిద్ధం చేయాలి

ఈ నెల 21వ తేదీకి మంత్రి మండలి ఆమోదించవలసిన అన్ని ఫైల్స్ సిద్ధం చేయాలని సీఎస్ కార్యదర్శులకు, హెచ్ఓడీలకు సూచించారు. కేంద్రం నుంచి రావలసిన నిధులపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. యుటిలిటీ సర్టిఫికెట్లు సమర్పించకపోతే సమర్పించాలని, సమర్పించినవాటి పరిస్థితి గురించి తెలుసుకోవాలని, ఏపీ భవన్ రెసిడెన్స్ కమిషనర్‌తో ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ రావలసిన నిధులు రాబట్టాలని చెప్పారు. కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టిన పథకాలను అధ్యయనం చేసి ఆ నిధులను పూర్తి స్థాయిలో పొందడానికి ప్రయత్నించాలన్నారు. ప్రతి శాఖ నుంచి కార్యదర్శి గానీ, కమిషనర్ గానీ రావాలని, వారికి అవకాశం లేకపోతే ఆ శాఖ ప్రతినిధి ఒకరు తప్పనిసరిగా రావాలన్నారు. ఆ శాఖకు సంబంధించిన సమాచారం ఎవరు ఇస్తారని సీఎస్ ప్రశ్నించారు. సమావేశంలో అధికారులకు, ఇతర సిబ్బందికి శిక్షణ, వివిధ శాఖలలో ఇంజనీరింగ్ విభాగం పనులు, హెచ్ ఆర్ పాలసీ, సర్వీస్ రూల్స్, మున్సిపాలిటీలలో పనులకు నిధులు, ఏపీపీఎస్సీ ద్వారా ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన, చేయవలసిన పోస్టులు, సిలబస్, వివిధ పోస్టులకు కావలసిన విద్యార్హతలు, గ్రామీణ, పట్టణ నీటి సరఫరా, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పని భారం, వివిధ శాఖలు జారీ చేసే లైసెన్సుల ప్రక్రియ సులభతరం చేయడం, లైసెన్స్ మేనేజ్ మెంట్ వ్యవస్థ, భూధార్, నబార్డ్ నిధుల వినియోగం, గ్రామీణ రహదారులు, వివిధ శాఖలలో చెల్లించవలసిన బిల్లులు, మధ్యాహ్న భోజన పథకం, స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాలు, జన్మభూమిలో వచ్చిన ఫిర్యాదులు, యువనేస్తం, గ్రామీణ, పట్టణ గృహ నిర్మాణం, మునిసిపల్, పంచాయతీరాజ్ పథకాలు ... తదితర అంశాలపై చర్చించారు. వివిధ శాఖల పనితీరుపై ప్రజా స్పందనను, వారి సంతృప్తి స్థాయిని ఆర్టీజీ సీఈఓ బాబు వివరించారు. ఏపీ భవన్ రెసిడెన్స్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ వీడియో కాన్ఫ రెన్స్‌లో మాట్లాడుతూ కేంద్రం నుంచి రావలసిన నిధులు, యుసీలు, నరేగా నిధులు, భారత్ నెట్ వర్క్, గ్రామీణ సడక్ యోజన, సాగరమాల పనులు, స్వచ్ఛభారత్ అర్బన్ నిధులు, కేంద్ర ప్రభుత్వ శిక్షణా కార్యక్రమాల గురించి వివరించారు. ఫిబ్రవరి మొదటి వారంలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో అవకాశం ఉన్నమేరకు రాష్ట్రానికి రావలసిన వాటా నిధులు రాబట్టడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. ఇ-ప్రగతి, ఇ-ఆఫీస్ ద్వారా సమయం చాలా ఆదా అవుతున్నట్లు అధికారులు చెప్పారు. ప్రజలకు కూడా కార్యాలయాల చుట్టూ తిరిగే పని తప్పిందన్నారు. ఇ-ఆఫీస్ నిర్వహణలో కార్యదర్శి నాగులాపల్లి శ్రీకాంత్, సంబంధిత శాఖల కార్యదర్శుల కృషిని అందరూ ప్రశంసించారు. కరతాళ ధ్వనులతో అభినందించారు.



సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు డాక్టర్ డి.సాంబశివరావు, నీరబ్ కుమార్ ప్రసాద్, జెఎస్వీ ప్రసాద్, ఆదిత్యనాథ్ దాస్, జి.అనంతరామ్, ముఖ్యకార్యదర్శులు కె.ప్రవీణ్ కుమార్, అజయ్ జైన్, షంషేర్ సింగ్ రావత్, కె.ఎస్.జవహర్ రెడ్డి, ఆర్.కరికాల వళవన్, బి.ఉదయలక్ష్మి, కార్యదర్శులు రామాంజనేయులు, శశిభూషణ్ కుమార్, పియూష్ కుమార్, ముఖేష్ కుమార్ మీనా, నాగులాపల్లి శ్రీకాంత్, కాంతిలాల్ దండే, సోలమన్ అరోకియా రాజ్, పరిశ్రమల శాఖ కమిషనర్ సిద్ధార్థ జైన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కౌగిలి తప్పనిపించడం లేదా?




కాకినాడ, మేజర్‌న్యూస్: కాంగ్రెస్‌తో జత కట్టి మరోసారి ఎన్టీఆర్ ఆత్మను వెన్నుపోటు పొడిచిన చరిత్ర ఏపీ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు దేనని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత కురసాల కన్నబాబు విమర్శించారు. ఆనాడు అధికారం కోసం ఎన్టీఆర్‌ను వెన్ను పోటు పొడిచిన చంద్రబాబు ఇవాళ మరోసారి ఎన్టీఆర్ ఆత్మను వెన్నుపోటు పొడిచారన్నారు. శుక్రవారం మీడియాతో కన్నబాబు మాట్లాడారు. కేసీఆర్‌ని రాచ మర్యాద లతో రాష్ట్రానికి ఆహ్వానించింది మీరు కాదా, అమరావతి శంకుస్థాపనకు కేసీఆర్‌ను తీసుకువచ్చి సన్మానించారు. కాంగ్రెస్ కూటమిలో టీడీపీ కలిసినప్పుడు, రాష్ట్రంలో ముఖ్య పార్టీ అయిన వైసీపీని మరొకరు ఆహ్వానిస్తే తప్పెలా అవుతుంది. మీరు కాంగ్రెస్ ను కౌగిలించుకుంటే తప్పనిపించడం లేదా. మా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన నవరత్నాల పథకాలను కాపీ కొట్టే పనిలో చంద్ర బాబు ఉన్నారు. నిన్నటి వరకూ చంద్రన్న బాట, నేడు జగనన్న బాటలో చంద్ర బాబు. చంద్రబాబు సర్కారు ఫించన్లు రూ.2వేల పెంపునకు జగనన్న కానుక అని, రైతుల పెట్టుబడి సాయానికి జగనన్న భరోసా అని పేర్లు పెట్టాలి. సొంతం గా ఆలోచించి పథకాలు ప్రవేశపెట్టలేని దిగజారుడు నైజం చంద్రబాబుది. జగన్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో పసలేదని చెప్పిన చంద్రబాబు, ఎన్ఐఎ దర్యాప్తును చూసి ఎందుకు వణికిపోతున్నారు. జగన్‌పై దాడి జరిగిన ప్రదేశం కేంద్రం పరిధిలోనిదని చెప్పిన బాబు ఎన్ఐఎ విచారణను ఎందుకు అడ్డుకుంటున్నారు అని కన్నబాబు ప్రశ్నించారు.

ఆయేషా మీరా కేసు విచారణ వేగవంతం

విజయవాడ, సూర్య బ్యూరో : సంచలనం సష్టించిన ఆయేషా మీరా హత్య కేసులో విచారణను సీబీఐ వేగవంతం చేసింది. శుక్రవారం కష్ణా జిల్లా నందిగామ మండలం అనాసాగరం గ్రామానికి చేరుకున్న సీబీఐ బందం సత్యం బాబును విచారిస్తోంది. సత్యంబాబు ఇంట్లోని ఓ గదిలో విచారణ జరుగుతోంది. కాగా మీడియాని లోపలికి అనుమతించేందుకు అధికారులు నిరాకరించారు. ఆయేషా మీరా హత్య కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కున్న సత్యంబాబు దాదావు 8 సంవత్సరాల పాటు జైలు శిక్షను అనుభవించి ఆ తరువాత నిర్దోషిగా విడుదలైన విషయం తెలిసిందే.

దోపిడీ చేశారు... రాజధాని నిర్మించలేదు




తణుకు, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధానిని నిర్మించాల్సిన పనిని వదిలేసిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజధానిలో భూ దోపిడీ మాత్రం చేశారని వైసీపీ మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి విమర్శించారు. శుక్రవారం తణుకు పట్టణ వైసీపీ కార్యాలయంలో మాట్లాడిన సుబ్బారెడి మళ్లీ మీరే రావాలని కోరటానికి అసలు బాబు రాష్ట్రానికి ఏమి చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. “ఎంతో ప్రాముఖ్యత ఉన్న పోలవరం ప్రాజెక్ట్ కేంద్రం నిర్మిస్తా మంటే దాన్ని నువ్ టేకప్ చేసి ప్రజలకు ప్రాజెక్ట్ కూడా లేకుండా చేసావ్. నీ పాలనలో మంత్రులు నుండి గ్రామస్థాయి నాయకులవరకూ అంతా దోపిడీకే పాల్పడ్డారు. నీ పాలనలో అర్హులైన వారికి పెన్షన్‌లు అందాలన్నా కమీషన్ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి. ఎప్పుడెప్పుడు ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడాలా అని ప్రజలందరూ ఎదురు చూస్తున్నారు. నీవు నీ స్వార్ధ ప్రయోజనాలకోసం రోజుకొకరితో కలుస్తావ్ ఎంతకైనా దిగజారతావు. మా పార్టీకి రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. మేము ఎవ్వరితోనూ పొత్తు పెట్టుకోం. ఒంటరిగానే పోటికి దిగుతాం.” అని స్పష్టం చేశారు.


పేద బ్రాహ్మణులు, అర్చకులను ఆదుకొనేందుకు చర్యలు

కే.ఈ. కృష్ణమూర్తి

(వెలగపూడి సూర్య ప్రత్యేక ప్రతినిధి) : తక్కువ ఆదాయం కలిగిన దేవాలయాల యాజమాన్యపు బాధ్యతలను ఆయా ఆలయాల అర్చకులకు అప్పగించేందుకు ప్రభుత్వంగా సానుకూలంగా వుందని, దీనిపై త్వరలోనే తగిన ఉత్తర్వులు వెలువడేలా ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చిస్తానన్నారు ఉపముఖ్యమంత్రి కే.ఈ క్రిష్ణమూర్తి హామీ ఇచ్చారు. సచివాలయం వేదికగా దేవదాయ శాఖ, అనుబంధ సంస్థలతో ఉపముఖ్యమంత్రి కే.ఈ. క్రిష్ణమూర్తి సమీక్ష నిర్వహించారు. పేద బ్రాహ్మణులు, అర్చకులను ఆదుకొనేందుకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. పేద బ్రాహ్మణులతో పాటు విద్యార్థులను ఆదుకొనేందుకు బ్రాహ్మణ కార్పోరేషన్ ద్వారా వివిధ పథకాలు రూపొందించామని బ్రాహ్మణ కార్పోరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనంద సూర్య వెల్లడించారు. ఈ సమావేశంలో దేవదాయ శాఖ సలహాదారు రామకోటయ్య, బ్రాహ్మణ కార్పోరేషన్ ఛైర్మన్ ఆనంద సూర్య, హిందూ ధార్మికపరిషత్ ట్రస్ట్ ఛైర్మన్ ప్రసాద్, వేదిక్ యునివర్సిటీ వైస్‌ఛాన్సలర్ సుదర్శన శర్మ, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. అనుబంధ సంస్థల ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను అధికారులను అడిగి ఉపముఖ్యమంత్రి తెలుసుకున్నారు. వృద్ధ బ్రాహ్మణులకు, వితంతువులకు బ్రాహ్మణ కార్పోరేషన్ ద్వారా ప్రస్తుతం వెయ్యి రూపాయల ఫించన్ అందజేస్తున్నాం. వీరికి కూడా 2 వేలు చేయాల్సిన అవసరం ప్రభుత్వం యోచిస్తుంది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కారం చూపెడతానన్నారు. వంశపారంపర్య అర్చకత్వంపై ప్రభుత్వం సానుకూలంగా వుందని, విధివిధానాలు రూపొందించేందుకు ప్రభుత్వం కమిటీ నియమించిందని, సాధ్యమైనంత త్వరలో జీవోనెం.76ను త్వరగా విడుదల చేస్తామన్నారు. అలాగే తక్కువ ఆదాయంగల దేవాలయాల యాజమాన్యంను అర్చకులకే ఇచ్చే ఆలోచన ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. ఎంత ఆదాయం వున్న దేవాలయాలు దీని పరిధిలోకి తీసుకురావాలనే విషయం పై చర్చిస్తున్నామన్నారు. దీని వల్ల అర్చకుల సమస్యలు వంద శాతం తీరుతాయని భావిస్తున్నామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. దేవాదాయశాఖ, అనుబంధ సంస్థల ద్వారా చేసే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శంఖారావం పేరుతో మ్యాగజైన్ తీసుకొస్తున్నామని తెలిపిన హిందూ ధార్మిక పరిషత్ ట్రస్ట్ ఛైర్మన్ ప్రసాద్ ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. హిందూ సంస్కృతిని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు హిందూ మతాన్ని పరిరక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు త్వరలో విజయవాడలో 46 మంది పీఠాధిపతులతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. వేదిక్ విశ్వవిద్యాలయం అనుబంధంగా రాజధాని ప్రాంతంలో, ఇతర ప్రాంతాలలో వేద విశ్వవిద్యాలయాల శాఖలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వేదిక్ యునివర్సిటీ ప్రిన్సిపల్ సుదర్శన శర్మ ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో చర్చించిన అంశాలను నోట్ రూపంలో ఇవ్వాలని దేవదాయశాఖ అనుబంధ సంస్థ ప్రతినిధులను ఉపముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశంలో ప్రతినిధులు అందజేనసిన సూచనలు, ప్రతిపాదనలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని ఉపముఖ్యమంత్రి కే. ఈ క్రిష్ణమూర్తి తెలిపారు.




చంద్రబాబుకు భయం పట్టుకుంది



తణుకు, మేజర్‌న్యూస్: ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభద్రతాభావంతో ఉన్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి వ్యాఖ్యానించారు. ఏపీ ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిస్తే చంద్రబాబుకు ఎక్కడా లేని భయం పట్టుకుందని ఆయన ఎద్దేవా చేశారు. శుక్రవారం తణుకులోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన చంద్రబాబుపై నిప్పులు చెరిగారు. రెండు పార్టీల నాయకులు ఎక్కడైనా కలిసినా, మాట్లాడుకున్నా చంద్రబాబుకు భయం కలుగుతుందని విమర్శించారు. చంద్రబాబు కేసీఆర్‌తో పొత్తు అడిగితే ఆయన బాబు నీకో దండం, నీతో పొత్తు వద్దన్నారు మర్చిపోయారా, చంద్రబాబు శవరాజకీయాలు చేయటానికి కూడా సిద్ధమవుతారు. హరికృష్ణ మృతదేహం వద్ద కూడా కేటీఆర్‌తో చంద్రబాబు రాజకీయాలు మాట్లాడారు. శవాల మీద పేలాలు వేరుకొని తినే మనస్తత్వం గల చంద్రబాబు, కేటీఆర్ వద్ద కూడా తిరస్కరించబడ్డారు. టీఆర్ఎస్ పార్టీ ఛీ పొమ్మంటే కాంగ్రెస్‌తో చంద్రబాబు జతకట్టారు.” అంటూ చంద్రబాబుపై ఆనం రాంనారాయణ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

దరఖాస్తు చేసుకున్న వారందరికీ హజ్ యాత్రకు అవకాశం



విజయవాడ, సూర్య బ్యూరో : 2019 హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకున్న వారందరినీ ఎంపిక చేసినట్లు హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ లియాఖత్ అలీ ప్రకటించారు. 2,135 మంది పెద్దలు, రెండేళ్ళ లోపు ముగ్గురు చిన్నారులు మొత్తం 2,138 మంది ఈ ఏడాది ఎపి నుంచి హజ్ యాత్రకు వెళ్ళనున్నారు. ఇందులో 40 మంది 70 ఏళ్ళు పైబడిన వారు ఉన్నారు. అనంతపూర్ జిల్లా నుంచి 298, చిత్తూర్ జిల్లా 206, ఈస్ట్ గోదావరి జిల్లా 39, గుంటూరు జిల్లా 326, కడప జిల్లా 241, కృష్ణాజిల్లా 230, కర్నూల్ జిల్లా 473, నెల్లూరు జిల్లా 121, ప్రకాశం జిల్లా 43, శ్రీకాకుళం జిల్లా 7, విశాఖపట్నం జిల్లా 90, విజయనగరం జిల్లా 24, వెస్ట్ గోదావరి జిల్లా 37 మంది డ్రా తో నిమిత్తం లేకుండా హజ్ యాత్రకు ఎంపికైయ్యారు. 70 ఏళ్ళు పై బడిన యాత్రికులు 40 మంది కూడా డ్రాతో సంబంధం లేకుండా ఎంపికయ్యారు. 2019 హజ్ యాత్రకు ఎంపికైన ప్రతి హజ్ యాత్రికుడు మొదటి విడత 81,000 రూపాయలు ఫిబ్రవరి 5వ తేదీ లోవు సెంట్రల్ హజ్ కమిటీకి చెల్లించాలి. చలానా ఫాంను హజ్ కమిటీ వెబ్‌సైట్‌నుంచి డౌన్‌లోడ్గ చేసుకొని బ్యాంక్‌లో జమా చేయాలని హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ లియాఖత్ అలీ పత్రికా ప్రకటన విడుదల చేశారు. 81,000 రూపాయల బ్యాంక్ ఒరిజనల్ చలానా, (ఒరిజినల్ పే ఇన్ స్లిప్), ఒరిజనల్ పాస్‌పోర్ట్, వైట్ బ్యాక్ గౌండ్లలో కలర్ ఫొటో, చెస్ట్ ఎక్స్ రే రిపోర్ట్, బ్లడ్ల రిపోర్ట్‌తో పాటు మెడికల్ ఫిట్‌నెస్, స్క్రీనింగ్ సర్టిఫికెట్‌లను ఫిబ్రవరి 5వ తేదీ లోవు విజయవాడలోని ఎపి స్టేట్ హజ్ కమిటీ వద్ద జమ చేయాలని ఎపి హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ లియాఖత్ అలీ విజ్ఞప్తి చేశారు.

బాబుకు నో ఎంట్రీ బోర్డు పెట్టబోతున్నారు

వైసీపీ నేత జోగి రమేష్



విజయవాడ, మేజర్‌న్యూస్: గత మూడు రోజులుగా టీడీపీ నేతలు పూనకం వచ్చినట్లు మాట్లాడుతున్నారని వైసీపీ అధికార ప్రతినిధి జోగి రమేష్ విమర్శించారు. శుక్రవారం రాష్ట కార్యాలయంలో మాట్లాడిన జోగి రమేష్ ప్రజలంతా టీడీపీ నాయకుల్ని చీ కొట్టే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. వైసీపీపై టీడీపీ ప్రబుద్ధులు విష ప్రచారం చేస్తూ విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. మూడు రోజులుగా టీడీపీ నాయకులకు పూనకం వచ్చింది, పిచ్చి ముదిరింది. జనమంతా వేప మండలు, చీపుర్లతో వారి పూనకం పోగొట్టాలి. ఫెడరల్ ఫ్రంట్‌పై ఇండియా, పాక్ యుద్ధం లాగా టీడీపీ అండ్ కో, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోంది. కేసీఆర్‌తో మాకెందుకు పొత్తు, ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం మాకు లేదు. హరికృష్ణ శవం పక్కన బెట్టుకుని కేసీఆర్‌తో పొత్తుకు ప్రయత్నించిన మాట వాస్తవం కాదా. మాకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. ప్రత్యేక హోదా అంశం నిలబెట్టింది జగన్ మాత్రమే. ఉమా మాయల ఫకీరు నాటకంలో డైలాగులు చెప్తున్నారు. కేసీఆర్‌కు సిగరెట్ కూడా అంటించిన ప్రబుద్ధులు టీడీపీ నేతలు. చంద్రబాబు రాష్ట్రంలో నో ఎంట్రీ బోర్డ్ పెట్టారు. కానీ జనం మూడు నెలల్లో చంద్రబాబుకి నో ఎంట్రీ బోర్డ్ పెట్టబోతున్నారు. చంద్రబాబు లాంటి రాజకీయ తార్పుడు లేడని ఎన్టీఆర్ స్వయంగా చెప్పారు. చంద్రబాబు, ఆయన తాబేదార్లకు మూడు నెలల్లో పూనకం వదిలించబోతున్నారు.” అని జోగి రమేష్ ధ్వజమెత్తారు.

23, 24 తేదీల్లో ఎపిఎస్ఎస్‌డిసి స్కిల్ ఎక్స్‌పో

విజయవాడ, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి) ఆధ్వర్యంలో ఈనెల 23, 24న స్కిల్ ఎక్స్‌పో పేరుతో కష్ణాజిల్లాలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఆసంస్థ జిల్లా మేనేజర్ ప్రణయ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 23వ తేదీన విజయవాడ మాచవరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ గవర్నమెంట్ డిగ్రీకాలేజీలో, 24న మచిలీపట్నంలోని నోబల్ డిగ్రీ కాలేజీల్లో జరిగే జాబ్ మేళాల్లో 30కి పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని ప్రణయ్ చెప్పారు. 10వ తరగతి, ఐటిఐ, డిప్లొమా, బీటెక్, పీజీ పూర్తై 18 నుంచి 30 ఏళ్లలోవు యువతీ యువకులు తమ సర్టిఫికెట్లతో హాజరుకావచ్చు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారు తమ వివరాలను ఈనెల 22వ తేదీలోవు ఎపిఎస్ఎస్‌డిసి వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. ఇప్పటికే ఎపిఎస్ఎస్‌డిసి వెబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేసుకున్నవారు పోర్టల్లోని ‘అప్ కమింగ్ ఈవెంట్స్’ విభాగంలో ‘సెలెక్ట్ జాబ్’ సెక్షన్ లో కష్ణాజిల్లా జాబ్‌మేళాపై క్లిక్ చేసి లాగిన్ అయి అప్లై చేసుకోవాలి. జాబ్ మేళాకి మొదటిసారి హాజరయ్యేవారు వెబ్‌సైట్ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. 2 రోజులపాటు నిర్వహించే కెరీర్ ఎక్స్‌పోను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎపిఎస్ఎస్‌డిసి జిల్లా మేనేజర్ ప్రణయ్ కోరారు. మరిన్ని వివరాల కోసం 8367390590, 9966489796, 9959036764, 9989519495, 8885159008 నంబర్లలో సంప్రదించవచ్చు.

టీడీపీకి గుబులు పట్టుకుంది

వైసీపీ నేత కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం, మేజర్‌న్యూస్: ప్రత్యేక హోదా వద్దు ప్రత్యేక ప్యాకేజీ ముద్దు అన్న వ్యక్తి ఈ రోజు ప్రత్యేక హోదా కోసం ధర్మపోరాట దీక్షలు చేయడం శోచనీయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ ఆరోపించారు. తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలవడంతో ఒక్కసారిగా టీడీపీకి గుబులు పట్టుకుందని ఎద్దేవా చేశారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కని ఆవిధంగా తెలంగాణ ఎంపీలు కలిసిరావలని కేటీఆర్‌కు వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన పలు అంశాలపై చర్చించారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తన స్వప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నారని సత్యనారయాణ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పోలవరం నిర్మాణంలో టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. చంద్రబాబుకి ఏది అవసరం అనుకుంటే అది చరిత్రాత్మాక అవసరమంటారని విమర్శించారు. జన్మభూమి కమిటీలు రాజ్యేంగేతర శక్తులుగా మారి ప్రజలను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ గ్రామ స్థాయి నుంచి విశ్వాసం కోల్పోయిందని గత ఎన్నికల వేళ చంద్రబాబు ఇచ్చిన 600 హామీలలో ఒక్కటి కూడా ఆచరణకు నోచుకోలేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో దోపిడి డబ్బులతో రాజకీయం చేయాలని చంద్రబాబు అండ్ కో ప్రయత్నిస్తోందని మండిపడ్డారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఓటరు అవగాహన ఫోరమ్స్

(మేజర్ న్యూస్ శ్రీకాకుళం కలెక్టరేట్) అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఓటరు అవగాహన కార్యక్రమం జరగాలని జిల్లా కలెక్టర్ కె.ధనంజయ రెడ్డి అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఓటరు అవగాహన ఫోరమ్ (ఓటరు అవేర్ నెస్ ఫోరమ్) ఏర్పాటును శుక్ర వారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ మేరకు పోస్టర్ ను విడుదల చేసారు. ప్రతి కార్యాలయంలో ఓటరు అవగాహన కల్పించాలని, ఓటరు నమోదుకు సంబంధించిన చైతన్యం కల్పించాలని అన్నారు. ఇప్పటికే కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులతోను, గ్రామాల్లో యువజనులతోను ఓటరు అవగహన క్లబ్బులను ఏర్పాటు చేసామని అన్నారు. ఇకపై ప్రతి కార్యాలయంలోను కమిటీలు పని చేయాలని అన్నారు. ముఖ్యంగా రెవిన్యూ కార్యాలయాలు క్రియాశీలకంగా పనిచేయాలని కలెక్టర్ అన్నారు. 1950 టోల్ ఫ్రీ ఫోన నంబరును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునే విధంగా అందరికి తెలియజేయాలని ఆదేశించారు.జిల్లా కాంటాక్ట్ కేంద్రం ఏర్పాటు : కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కాంటాక్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ధనంజయ రెడ్డి తెలిపారు. 1950 తో టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేసామని దానిని జిల్లా కాంటాక్ట్ కేంద్రం ల్యాండ్ల లైన్ ఫోన్ తో అనుసంధానించామని చెప్పారు. ఓటర్లు తమ ఓటు వివరాలు, ఓటరుగా నమోదుకు, మార్పుకు, తొలగింపు తదితర అంశాలకు సంబంధించిన ఫారం 6,7,8 ల విషయాలను తెలుసుకోవచ్చని చెప్పారు. ఓటరు తుది జాబితా ఇప్పటికే ప్రకటించామని, వాటిపై పిర్యాధులు, అభ్యంతరాలు తెలియజేయవచ్చని కలెక్టర్ స్పష్టం చేసారు. 1950 టోల్ ఫ్రీ ఫోన్ నంబరుకు వచ్చే కాల్స్ ను జాతీయ పిర్యాధుల సేవా కేంద్రం పోర్టల్ లో అప్ డేట్ చేయడం జరుగుతుందని చెప్పారు. బి.ఎస్.ఎన్.ఎల్ తో పాటు ఇతర నెట్ వర్కుల నుండి వచ్చే కాల్స్ స్వీకరణకు అనుకూలంగా కాంటాక్ట్ కేంద్రంను రూపొందిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఫారెస్ట్ సెటిల్ మెంట్ అధికారిని జిల్లా కాంటాక్ట్ కేంద్రం అధికారిగా నియమించామని పేర్కొన్నారు. ఇ.ఆర్.ఓలు, ఏ.ఇ.ఆర్.ఓలు పిర్యాధులు, అభ్యంతరాలపై ద ష్టి కేంద్రీకరించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పోలింగు కేంద్రాలలో అవసరమగు సౌకర్యాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. తాగు నీరు, మరుగుదొడ్లను గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. పోలింగు కేంద్రం మరమ్మతులను పంచాయతీరాజ్, విద్యుత్ సమస్యలను ఇపిడిసిఎల్ తక్షణం చేపట్టాలని ఆదేశించారు. 25న జాతీయ ఓటరు దినోత్సవం : ఈ నెల 25వ తేదీన జాతీయ ఓటరు దినోత్సవంను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవంలో అధిక సంఖ్యలో యువ ఓటర్లు పాల్గొనాలని పిలువునిచ్చారు. దేశానికి యువత మార్గదర్శకం అన్నారు. ఓటరు దినోత్సవం రోజున ఎక్కువ సార్లు ఓటు చేసిన సీనియర్లకు సన్మానం, మొదటిసారిగా ఓటు వేయనున్న యువ ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు అందించడం జరుగుతుందని చెప్పారు. జాతీయ ఓటరు దినోత్సవంను ప్రతి మండలంలో పెద్ద ఎత్తున చేపట్టాలని అన్నారు. ఓటరు నమోదు, ఓటింగు ప్రక్రియ విధానాన్ని ఓటర్లకు వివరించాలని ఆదేశించారు.



జాయింట్ కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర బాబు మాట్లాడుతూ జిల్లా కాంటాక్ట్ కేంద్రానికి అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. జాతీయ ఓటరు దినోత్సవంను ఘనంగా నిర్వహించాలని, ప్రజలు యువ ఓటర్లు అధిక సంఖ్యలో హాజరు కావడానికి చర్యలు చేపట్టాలని అన్నారు. వివిధ అంశాలను చేపట్టాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్సులో జిల్లా రెవిన్యూ అధికారి కె.నరేంద్ర ప్రసాద్, ఎన్నికల రిటర్నింగు అధికారులు ఎం.వి.రమణ, ఎం.వెంకటేశ్వర రావు, ఆర్.గున్నయ్య, అనిత, బి.శాంతి, జయ దేవి, సూర్యనారాయణ, కలక్టరేట్ పరిపాలన అధికారి పి.రమేష్ బాబు, సహాయ ఆర్.ఓలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో లేని పార్టీతో పొత్తు

సాలూరు, మేజర్‌న్యూస్: రాబోవు ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో టీఆర్ఎస్‌తో తమ పార్టీ పొత్తు పెట్టుకుట్టుందని టీడీపీ నాయకులు ప్రచారం చేయడం నిజంగా శోచనీయమని వైసీపీ ఎమ్మెల్యే పీడిక రాజన్న దొర పేర్కొన్నారు. అసలు రాష్ట్రంలో లేని టీఆర్ఎస్ పార్టీతో ఏ విధంగా పొత్తు పెట్టుకుంటామని ఈ సందర్భంగా రాజన్న దొర ప్రశ్నించారు. తమ పార్టీ 175 నియోజకవర్గాల్లో సింగిల్‌గా పోటి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇక్కడ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదన్నారు. దీనిలో భాగంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై రాజన్న దొర మండిపడ్డారు. ఆయన పూటకో మాట రోజుకో మాట మాట్లాడుతూ తాను చేస్తే సంసారం, ఇతరులు చేస్తే వ్యభిచారం అన్నట్లుగా చెబుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలోని ప్రాంతీయ పార్టీలైన తృణమూలు కాంగ్రెస్, డీఎంకే, ఎస్పిలతో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చర్చలు జరిపిన మాదిరిగానే, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో ఫెడరల్ ఫ్రంట్‌పై చర్చించారని రాజన్న దొర పేర్కొన్నారు.

అరకును ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు

అరకులోయ, సూర్య ప్రతినిధి : అరకులోయను ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా చెప్పారు. విశాఖ జిల్లా అరకులోయలో మూడు రోజుల పాటు జరిగే అఖిల భారత అడ్వెంచర్ టూర్ అసోసియేషన్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన మీనా మాట్లాడుతూ 'అరకులోయ సందర్శనకు ప్రస్తుతం ఒడిశా, చత్తీస్‌గఢ్, కర్ణాటక, పశ్చిమ్‌బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచే పర్యాటకులు వస్తున్నారు. వీరంతా ఒక రోజులోనే అరకులోయను సందర్శించి వెళ్లిపోతున్నారు. రెండు, మూడు రోజులపాటు అరకు పరిసరాల్లోనే ఉంచేలా అవసరమైన చర్యలు చేపట్టేందుకు అడ్వెంచర్ టూర్ అసోసియేషన్‌తో సమావేశాలను ఏర్పాటు చేశాం' అని పేర్కొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు విదేశీయులూ ఇక్కడకు వచ్చేలా చూడాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అరకు ప్రాంతంలో సాహసక్రీడల నిర్వహణకు ఉన్న అవకాశాలు, సాధ్యాసాధ్యాలు, సౌకర్యాలు తదితరాలపై మూడు రోజులపాటు చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఏడాది పొడవునా సాహస క త్యాల క్రీడలు ఉండేలా ప్రణాళికలను సిద్ధం చేసి వచ్చే నాలుగు నెలల్లో అమలు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. అడ్వెంచర్ టూర్ ఆపరేటర్స్ దేశవ్యాప్తంగా సుమారు 500 మంది ఉండగా వారిలో 300 మంది ఇక్కడకు వచ్చారన్నారు. గిరిజనులను భాగస్వాములుగా చేసి కొత్త ప్రాజెక్టుల రూపకల్పనకు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే గండికోట, భవాని ద్వీపం, విజయనగరంలో సూవా అకాడమీ, రుషికొండ తదితర ప్రాంతాల్లో అడ్వెంచర్స్ కార్యక్రమాలను ప్రారంభించామని వివరించారు.



నిరంకుశత్వాన్ని ఎదిరించడం నేర్పింది ఎన్టీఆర్

● ఎన్టీఆర్ ఒక స్ఫూర్తి ప్రదాత ● మోడీ అనుకూల కూటమిలో టీఆర్ఎస్, వైసీపీ ● ఇంకా వంద రోజులే ● టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి) : నేటితరానికి ఎన్టీఆర్ స్ఫూర్తి ప్రదాత అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. అమరావతి నుంచి శుక్రవారం టీడీపీ నేతలు, కార్యకర్తలతో సీఎం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ నిరంకుశత్వాన్ని ఎదిరించడం నేర్పింది ఎన్టీఆరేనని తెలిపారు. సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆరే అని చెప్పారు. ఆయన ఆదర్శాలకు పునరంకితం కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. పేదరికంపై గెలుపే ఎన్టీఆర్‌కు నిజమైన నివాళి అని చెప్పారు. సమాజ సేవలో చురుగ్గా పాల్గొని పేదల సేవకు పునరంకితం కావాలని సూచించారు. ఇప్పుడు నిరంకుశత్వం బీజేపీ రూపంలో, పెత్తందారీ ప్రధాని మోదీ రూపంలో ఉందన్నారు. అందుకే బీజేపీపై ధర్మపోరాటం చేస్తున్నామన్నారు. ఎన్నికలకు ఇంకా 100 రోజులే ఉన్నాయని, టీడీపీ ఘన విజయం సాధించాలని చెప్పారు. దేశ రాజకీయాల్లో కీలక భూమిక పోషిస్తూ రాష్ట్ర ప్రయోజనాలను నెరవేర్చాల్చిన అవసరం ఉందని చంద్రబాబు అన్నారు.

ఎన్టీఆర్ ఒక స్ఫూర్తి ప్రదాత

ఎన్టీఆర్ ఒక స్ఫూర్తి ప్రదాత అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి ఒక సంకల్పదినమన్నారు. సమాజ సేవల్లో చురుకుగా పాల్గొనాలని..పేదల సేవకు పునరంకితం కావాలని నేతలకు సీఎం పిలుపునిచ్చారు. పేదరికంపై గెలుపే ఎన్టీఆర్‌కు నిజమైన నివాళి అని అన్నారు. సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్ అని, అందుకే పింఛన్లను 10 రెట్లు పెంచామని పేర్కొన్నారు. పేదల సంక్షేమాన్ని మూడు విధాలుగా చేస్తున్నామన్నారు. నేరుగా నగదు బదిలీ, విద్య, వైద్య, ఆహారం రూపంలో సంక్షేమం కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి కుటుంబం ఆదాయం పెంచడం, నెలకు కనీసం రూ.10వేల ఆదాయం వచ్చేలా చేస్తామన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజల ఆదాయం పెరిగి, జీవన ప్రమాణాలు మెరుగుపడాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

మోడీ అనుకూల కూటమిలో టీఆర్ఎస్, వైసీపీ

ఇంకా ఎన్నికలకు వంద రోజులే ఉన్నాయని సీఎం అన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించాలని నేతలకు తెలియజేశారు. పార్టీ మన కోసం ఏం చేసింది అనేది కాదని, పార్టీ కోసం మనం ఏం చేయాలని ఆలోచించే సమయం ఇది అని అన్నారు. నిరంకుశత్వాన్ని ఎదిరించడం ఎన్టీఆర్ నేర్పిందే అని అన్నారు. ఇప్పుడు నిరంకుశత్వం బీజేపీ రూపంలో, పెత్తందారీతనం నరేంద్ర మోదీ రూపంలో ఉందన్నారు. అందుకే బీజేపీపై ధర్మపోరాటం చేస్తున్నామని చంద్రబాబు చెప్పుకొచ్చారు. రేపు కోల్‌కతాలో బీజేపీయేతర పార్టీల ర్యాలీకి హాజరవుతున్నట్లు తెలిపారు. టీఆర్ఎస్, వైసీపీ మినహా అందరూ కోల్‌కతా వస్తున్నారని, దీన్ని బట్టే ఆ రెండు పార్టీలు ఎక్కడ ఉన్నాయో తెలిసిపోతుందని వ్యాఖ్యానించారు. మోడీ అనుకూల కూటమి, వ్యతిరేక కూటమి.. రెండే ఉన్నాయని స్పష్టం చేశారు. టీఆర్ఎస్, వైసీపీ మోదీ అనుకూల కూటమిలో ఉన్నట్లే అని పేర్కొన్నారు. అసత్యాలతో దుష్ప్రచారం చేసేందుకే కడపలో బీజేపీ సభ ఏర్పాటు చేసిందని మండిపడ్డారు. తెలంగాణలో 26 కులాలను బీసీ జాబితా నుంచి తొలగించి, ఇక్కడికొచ్చి బీసీల సంక్షేమంపై మాట్లాడుతున్నాని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇంకా వందరోజులే

దేశంలో నిరంకుశత్వపాలన సాగుతోందని ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు. బీజేపీ రూపంలో జరుగుతున్న నిరంకుశత్వపాలనపై ధర్మపోరాటం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ పెత్తందారీతనానికి చెక్ పెట్టాలన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించాలని ఆయన నేతలకు దిశా నిర్దేశం చేశారు. పార్టీకోసం శ్రమించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఎన్నికలకు ఇంకా వంద రోజులే ఉన్నాయన్నారు. కోల్‌కతాలో జరిగే బీజేపీయేతర పార్టీల ర్యాలీకి హాజరవుతున్నట్లు చంద్రబాబు పార్టీ నేతలకు తెలిపారు. టీఆర్ఎస్, వైసీపీ మినహా బీజేపీని వ్యతిరేకించే అన్ని పార్టీలు ర్యాలీకి హాజరవుతున్నాయని ఆయన తెలిపారు. ఆ రెండు పార్టీలు ఎక్కడ ఉన్నాయో చెప్పడానికి ఇంతకంటే పెద్ద ఉదాహరణ లేదని అన్నారు. దేశంలో ఇప్పుడు మోదీ అనుకూల కూటమి, వ్యతిరేక కూటమి అంటూ రెండే ఉన్నాయని అన్నారు. ర్యాలీకి హాజరు కావడంలేదంటే.. టీఆర్ఎస్, వైసీపీ.. మోదీ అనుకూల కూటమిలో ఉన్నట్లేనని చంద్రబాబు అన్నారు. అసత్యాలతో దుష్ప్రచారం చేసేందుకే కడపలో బీజేపీ సభ పెట్టిందని చంద్రబాబు మండిపడ్డారు.



పడవ ప్రమాదాల నివారణ చర్యలు



అధికారుల సమీక్షలో సీఎస్ అనిల్ చంద్ర పునేఠా

అమరావతి, సూర్య బ్యూరో : కష్ణా, గోదావరి నదులు దాటేం దుకు ప్రమాదరహిత బోట్లు సమకూర్చుకోవాలని సీఎస్ అనిల్ చంద్రపునేఠా, అధికార ులను ఆదేశించారు. పడవ ప్రమాదాల నివారించేందుకు అవసరమైన ఏర్పాట్లపై సీఎస్, పలు శాఖల ఉన్నత అధికారులతో సచివాలయంలో సమీక్ష జరిపారు. గడచిన మూడు సంవత్స రాల్లో జరిగిన పడవ ప్రమాదాల్లో దాదాపు 67 మందికి పైగా చనిపోయారని అధికారులు సీఎస్ కు వివరించారు. ఇకపై పడవ ప్రమాదాలు జరగకుండా రక్షణ ఉండే అధునాతన పడవలు కొనుగోలు చేసుకోవాలని సీఎస్ అధికారులకు సూచించారు. పడవలకు లైసెన్సులు ఇవ్వడం, శిక్షణ కలిగిన చోధకులను నియమించడం ద్వారా ప్రమాదాలు తగ్గించవచ్చని సీఎస్ సూచించారు. ప్రయాణీకులను చేరవేసే పడవలకు అనుమతులు తప్పనిసరి చేసి, గడువులోగా లైసెన్సులు ఇవ్వాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. అవసరమైతే జలవనరుల శాఖ అధికారులకు కొన్ని బాధ్యతలు అప్పగించాలని సీఎస్ అనిల్ చంద్ర పునేఠా సూచించారు. జలవనరులు, పోలీస్, ఫైర్, పంచాయతీరాజ్, పర్యాటక శాఖ ఉన్నత అధికారులు రెండు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించుకుని పడవ ప్రమాదాల నివారణపై చర్చించుకోవాలని సీఎస్ అధికారులను ఆదేశించారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు


అమరావతి, సూర్య బ్యూరో : 135 కార్యక్రమాలతో గ్రామ పంచాయతీ అభివద్ధి ప్రణాళికలు (జీపీడీపీ) రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించింది. ఇప్పటికే ఉన్న మార్గదర్శకాలను సవరించి కొత్త మార్గదర్శకాలకు రూపకల్పన చేశారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు వనరుల వినియోగంలో సామాజిక న్యాయం ఉండేలా తాజా ప్రణాళికలు ఉండాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. స్థానికుల భాగస్వామ్యం ఎక్కువగా ఉండాలని, ఈ ప్రణాళికల రూపకల్పనలో ఉపాధి హామీ పథకం, 14వ ఆర్థికసంఘం నిధుల లభ్యత బట్టి ఆయా రాష్ట్రాలు వేర్వేరుగా ప్రణాళికలు సిద్ధం చేసుకునేలా స్వేచ్ఛ కల్పించారు. స్థానికుల భాగస్వామ్యంతో పాటు గ్రామసభ నిర్వహణ, మౌలిక వసతుల కల్పనకు, పెట్టుబడులకు ప్రాధాన్యమివ్వడం, ప్రజలకు విస్తతమైన సేవలు, ఆదాయ వనరుల కల్పనపై దష్టి, పాలకవర్గాలను మరింత భాగస్వామ్యం వహించేలా చేయడం, ఐటీ సేవలు, ఇతర పథకాలతో అనుసంధానం చేయడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు.

31న అమరావతిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూకర్షణం

టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

అమరావతి, సూర్య బ్యూరో : రాష్ట్ర రాజధాని అమరావతిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి ఈ నెల 31న భూకర్షణం, బీజావాపనం కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు టిటిడి కార్యనిర్వహణాధికారి అనిల్‌కుమార్ సింఘాల్ వెల్లడించారు. అమరావతిలో శ్రీవారి ఆలయ నిర్మాణ స్థలంలో భూకర్షణ కోసం జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం టిటిడి తిరుపతి జెఈవో పోల భాస్కర్, సివిఎస్‌వో గోపినాథ్‌జెట్టితో కలిసి ఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 31న ఉదయం 9.15 నుండి 9.40 గంటల మధ్య భూకర్షణ కార్యక్రమం జరుగనుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్నారని తెలిపారు. ఆలయ నిర్మాణం కోసం ఆగమశాస్త్రం ప్రకారం భూకర్షణ చేయడం ఆనవాయితీ అని, ఆగమ సలహాదారుల సూచన మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నామని వివరించారు. సిఆర్‌డిఏ 25 ఎకరాలు టిటిడికి కేటాయించిందని, ఇందులో 5 ఎకరాల్లో శ్రీవారి ఆలయం, మిగిలిన 20 ఎకరాల్లో మాస్టర్‌ప్లాన్ రూపొందించి ఆధ్యాత్మిక కార్యకలాపాల నిర్వహణ కోసం ఆడిటోరియాలు, కల్యాణమండపాలు తదితర నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. దాదాపు రూ.140 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టేందుకు టిటిడి ధర్మకర్తల మండలి టెండర్లు ఖరారు చేసినట్టు వెల్లడించారు. శ్రీవారి భక్తుల కోరిక మేరకు గత ఏడాది జులైలో కురుక్షేత్రంలో శ్రీవారి ఆలయ నిర్మాణం చేపట్టామని, ఇక్కడ రోజువారీగా వెయ్యి నుండి 2 వేల మంది, ఉత్సవాల రోజుల్లో 10 వేల నుండి 15 వేల మంది స్వామివారిని దర్శించుకుంటున్నారని ఈవో తెలిపారు. ఈ నెల 27న కన్యాకుమారిలో శ్రీవారి ఆలయ విగ్రహప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం నిర్వహిస్తామని, మార్చి 13న హైదరాబాద్‌లో శ్రీవారి ఆలయాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలైన సీతంపేట, రంపచోడవరం, పార్వతీపురంలో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి టెండర్లు ఖరారు చేశామన్నారు. విశాఖపట్నం, భువనేశ్వర్‌లో శ్రీవారి ఆలయాలతో పాటు చెన్నైలో శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ నిర్మాణాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ధర్మప్రచారంలో భాగంగా వీలైనన్ని ఎక్కువ ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాలు నిర్మించి తిరుమల తరహాలో సంప్రదాయబద్ధంగా కైంకర్యాలు నిర్వహిస్తామన్నారు. భూకర్షణం కోసం హోమగుండాలు, వేదిక, సిఆర్‌డిఏ స్టాళ్లు, ఆలయ నమూనా ఎగ్జిబిషన్, ప్రత్యక్ష ప్రసారాలు, డిస్‌ప్లే స్క్రీన్లు తదితర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించామని ఈవో తెలిపారు. భూకర్షణంలో భాగంగా శ్రీవారి కల్యాణోత్సవం, వసంతోత్సవం నిర్వహిస్తామన్నారు. భూకర్షణం తరువాత 10 రోజుల పాటు అర్చకులు ఆగమోక్తంగా వైదిక కార్యక్రమాలు, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు చేపడతారని, అనంతరం ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయన్నారు.

శ్రీవారి సేవకులకు ఆహ్వానం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచన మేరకు ఈ కార్యక్రమానికి శ్రీవారి సేవకులను, భజన మండళ్ల సభ్యులను ఆహ్వానిస్తున్నామని ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. శ్రీవారి సేవకులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో టిటిడి ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు, చీఫ్ ఇంజినీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఇ (ఎలక్ట్రికల్) వేంకటేశ్వర్లు, ఎస్వీబీసీ సిఈవో వెంకట నగేష్, ఈఈ ప్రసాద్, డెప్యూటీ ఈవోలు రాజేంద్రుడు, అన్నప్రసాదం ప్రత్యేకాధికారి వేణుగోపాల్, ఏఈవో గోవిందరాజులు ఇతర అధికారులు పాల్గొన్నారు.



చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి




అమరావతి, సూర్య బ్యూరో : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మళ్ళీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివద్ధి కొనసాగుతుందని స్పీకర్ కోడెల శివప్రసాద్ అన్నారు. జిల్లాలో ఎన్టీఆర్ భారీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో స్పీకర్ మాట్లాడుతూ పోలవరం, రాజధాని నిర్మాణాలు జరగాలంటే చంద్రబాబు మళ్లీ సీఎం కావాలన్నారు. అభివ ద్ధిని అడ్డుకోవడానికి కొన్ని రాబందులు మనపై వాలుతున్నాయని అన్నారు. ఆంధ్రులంతా అండగా ఉంటారని, దుర్మార్గులపై ధైర్యంగా పోరాడండని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ ఆశయాల కోసం పని చేస్తున్న వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు. సత్తెనపల్లి నేడు అభివ ద్ధిలో పరుగులు తీస్తోందని స్పీకర్ కోడెల పేర్కొన్నారు.

కేంద్రం నుంచి రూ.1,692 కోట్లు : పూనం మాలకొండయ్య



(అమరావతి సూర్య ప్రత్యేక ప్రతినిధి) : రాష్ట్ర వైద్యారోగ్యశాఖకు కేంద్రం రూ.1692 కోట్లు విడుదల చేసింది. ఇందులో అనేక కొత్త వైద్యసేవలు ఉన్నాయని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య తెలిపారు. కొత్తగా రాష్ట్రంలో 148 ఆసుపత్రుల్లో దంత వైద్య సేవలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఇందుకోసం కేంద్రం రూ.12.5 కోట్లు ఇచ్చిందన్నారు. దంతాలు తొలగించడం, రూట్ కెనాల్, క్యాపింగ్ కూడా ఇక నుంచి ప్రభుత్వాసుపత్రుల్లో అందుబాటులోకి వస్తాయన్నారు. అన్ని జిల్లా ఆసుపత్రుల్లో గ్యాస్ట్రోఎంటరాలజీ యూనిట్లు నెలకొల్పుతున్నామని, ఇందుకోసం కేంద్రం నుంచి రూ.13 కోట్లు తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలో ఆహారపు అలవాట్ల కారణంగా అల్సర్ వ్యాధి అధికంగా వస్తోంది కాబట్టి ఈ వ్యాధికి ఇక నుంచి ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా వైద్య సేవలందించాలనే లక్ష్యంతో కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చామన్నారు. వినికిడి లోపంతో బాధపడుతున్న వారికి ఉచితంగా మెషీన్లు అందించనున్నామని, ఇందుకోసం కేంద్రం నుంచి రూ.15 కోట్లు తెచ్చామన్నారు. ఈ వినికిడి మెషీన్లను 28 ఏరియా ఆసుపత్రుల్లోనూ, 13 జిల్లా ఆసుపత్రుల్లోనూ పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్రంలోని 21 ఏరియా ఆసుపత్రుల్లో, 13 జిల్లా ఆసుపత్రుల్లో కంటికి సంబంధించిన చికిత్సలు చేయడం, నేత్రాలు భద్రపరచడం కోసం కొత్త పరికరాలతో కొత్త యూనిట్లు ప్రారంభిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన అంబులెన్సుల ఉబరైజేషన్ కార్యక్రమం కోసం కేంద్రం రూ.27 కోట్లు ఇచ్చిందని పూనం మాలకొండయ్య తెలిపారు. రాష్ట్రానికి కొత్తగా 122 టెలీఆప్తమాలజీ సెంటర్లను కేంద్రం మంజూరు చేసిందన్నారు. ఇంతకు ముందు రాష్ట్రంలో ఉన్న 115 సెంటర్లకు ఇవి అదనం అని చెప్పారు. ఏఎన్‌ఎంలకు ట్యాబ్‌లు కొనిచ్చేందుకు కేంద్రం రూ.14 కోట్లు ఇచ్చిందని ఆమె చెప్పారు. 13 పీహెచ్‌సీలు, 60 సీహెచ్సీల్లో జాతీయస్థాయి ప్రమాణాలతో లేబర్‌రూమ్‌లను అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు చెప్పారు. ప్రసవం సమయంలో గర్భిణిలు చీరల్లో ఉండడం వల్ల వారికి అసౌకర్యంగా ఉంటుందని, ఆ అసౌకర్యాన్ని పోగొట్టి మాత్రుసమ్మాన్ డ్రెస్సులు అందజేస్తామని, దీంతో ఆ సమయంలో వారికి గౌరవప్రదంగా , సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ ప్రతిపాదనకు కేంద్రం అంగీకరించి నిధులు ఇచ్చిందని తెలిపారు.

కేసీఆర్ గురించి ఏపీ ప్రజలు ఒకసారి మననం చేసుకోవాలి



అమరావతి, సూర్య బ్యూరో : రాష్ట్రాభివద్ధిని చూసి ఓర్వలేక ఫెడరల్ ఫ్రంట్ ప్రయత్నాలు జరుగుతున్నాయని ఏపీ మంత్రి యనమల రామక ష్ణుడు విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్, జగన్‌ను అడ్డం పెట్టుకుని ప్రధాని మోడీ కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. విభజన హామీలు అమలు చేయని మోదీతో జగన్ ఎలా చేతులు కలిపారని ఆయన ప్రశ్నించారు. మోదీ, జగన్, కేసీఆర్ కుట్ర పూరిత కలయిక ప్రజలకు అర్ధమయిందన్నారు. కేసీఆర్ గురించి ఏపీ ప్రజలు ఒకసారి మననం చేసుకోవాలని యనమల సూచించారు.

గుంటూరు టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి

అమరావతి, సూర్య బ్యూరో : ఎన్టీఆర్ 23వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పలువురు టీడీపీ నేతలు నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు, మంత్రి నక్కా ఆనంద్ బాబు, ఎంపీ గల్లా జయదేవ్, ఎమ్మెల్సీలు వి.వి.వి చౌదరి, డొక్కా మాణిక్య వరప్రసాద్, రామకృష్ణ... ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిభిరాన్ని కళా వెంటక్రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ రాష్ట్ర రాజకీయాలలో, సినిమాలో తెలుగు ప్రజల గుండెచప్పుడన్నారు. ఎన్టీఆర్ పేదప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించారని అన్నారు. ఎన్టీఆర్ చేసిన పథకాలు ఇప్పటికీ ఆదర్శంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. చంద్రబాబు ఆయన సిద్ధాంతాలను ఆశయాలను ముందుకు తీసుకెళుతున్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేసేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని కళా వెంకట్రావు పేర్కొన్నారు. చంద్రబాబు క షి చేస్తున్నారు.

నామినేషన్ల గడువు ముగిసే వరకూ ఓట్ల తొలగింపు, నమోదు




రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి గోపాలకృష్ణ ద్వివేది

అమరావతి, సూర్య బ్యూరో : రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసే వరకూ కొత్త ఓటర్ల నమోదు, నకిలీ ఓటర్ల తొలగింపు కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి గోపాలకష్ణ ద్వివేది తెలిపారు. సచివాలయంలో రాష్ట్రంలో ఉన్న పలు పార్టీల నాయకులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి, ఈ నెల 11వ తేదీన ఎన్నికల సంఘం రూపొందించిన తుది ఓటర్ల జాబితాను హార్డ్ డిస్క్ రూపంలో ఆయా పార్టీల నేతలకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి గోపాలకష్ణ ద్వివేది అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితాతో పాటు ఇతర ఏ సమస్యలైనా ఉంటే తమ ద ష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సంఘం తీసుకుంటున్న నిర్ణయాలను ఎప్పటికప్పుడు అన్నిపార్టీలకూ సమాచారమందిస్తామన్నారు. రాష్ట్రంలో ఎన్నికలను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి ఎన్నికల సంఘం కట్టుబడి ఉందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి గోపాలకష్ణ ద్వివేది స్పష్టం చేశారు. అనంతరం పలు సమస్యలు పరిష్కరించాలని ఆయా పార్టీల నాయకులు కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ, సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


ఈ సమావేశంలో ఏపీఎస్ ఆర్టీసీ ఎం.డి., టీడీపీ నాయకులు వర్ల రామయ్య, వైసీపీ నాయకులు అంబటి రాంబాబు, మల్లాది విష్ణూ, వెల్లంపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ నేత టి.సూరిబాబు, బీజేపీ నాయకుడు జూపూడి రంగరాజు, సీపీఎం నాయకులు ఎం.కష్ణమూర్తి, వై.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుతో లగడపాటి రాజగోపాల్ భేటీ



అమరావతి, సూర్య బ్యూరో : విజయవాడ మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ ఏపీ సీఎం చంద్రబాబును కలిశారు. ఉండవల్లిలోని సీఎం నివాసానికి వెళ్లిన లగడపాటి, ఆయనతో కొద్దిసేపు భేటీ అయ్యారు. ఈ నెల 27న తన ఇంట్లో జరిగే శుభకార్యానికి రావాల్సిందిగా చంద్రబాబును ఆయన ఆహ్వానించారు. అనంతరం లగడపాటి మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం తాను రాజకీయాలకు దూరంగా ఉన్నానని, ఈ నేపథ్యంలో కేసీఆర్ నేత త్వంలోని ఫెడరల్ ఫ్రంట్‌పై వ్యాఖ్యలు చేయలేనన్నారు. రాజకీయాలపై మాట్లాడేందుకు ఇది సరైన సమయం కాదని లగడపాటి చెప్పారు.

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సిసోడియా బదలీ



● ఎన్నికల కొత్త ప్రధానాధికారిగా గోపాలకృష్ణ ద్వివేది
● మరింత సమర్థుడి కోసం ఈసీ నిర్ణయం
● ముగ్గురిని సూచించిన రాష్ట్రప్రభుత్వం
● వారిలో ద్వివేది ఎంపికకు ఉత్తర్వులు జారీ
● తక్షణమే బాధ్యతలు స్వీకరించిన కొత్త సీఈవో

(అమరావతి సూర్య ప్రత్యేక ప్రతినిధి) : రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ఆర్.పి.సిసోడియాను కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) అర్థాంతరంగా ఆ పదవి నుంచి తప్పించింది. ఆయన స్థానంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకష్ణ ద్వివేదిని నియమించింది. నవ్యాంధ్రలో త్వరలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఒకేసారి వస్తున్నాయని, దీంతో పని బాధ్యతలు ఎక్కువగా ఉంటాయని, మరింత సమర్థుడు, చురుగ్గా ఉండే అధికారి ఉంటే బాగుంటుందని ఈసీ రాష్ట్రప్రభుత్వానికి చెప్పినట్లు తెలిసింది. 'సిసోడియాను మార్చాలి.. మీకేమైనా అభ్యంతరమా' అని అడిగినట్లు సమాచారం. ఈసీ ఏ నిర్ణయం తీసుకున్నా తమకు అభ్యంతరం లేదని ప్రభుత్వం తెలిపింది. కొత్తగా ఎవరిని నియమించాలో ముగ్గురి పేర్లతో ప్యానెల్ పంపాలని కమిషన్ సూచించింది. సీనియర్ ఐఏఎస్ అధికారులు గోపాలకష్ణ ద్వివేది, ముఖేశ్‌కుమార్ మీనా, శ్యామలరావు పేర్లతో కూడిన ప్యానెల్‌ను ప్రభుత్వం పంపింది. వీరిలో ద్వివేదిని నూతన సీఈవో నియమిస్తూ ఈసీ గురువారం నోటిఫికేషన్ జారీచేసింది. ఆ మేరకు రాష్ట్రప్రభుత్వం కూడా ఉత్తర్వులిచ్చింది. సిసోడియాను గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీచేసింది. ప్రస్తుతం పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ద్వివేది, గతంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. పురందేశ్వరి కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఆమె వద్ద ఓఎస్డీగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు.

ఓటర్ల జాబితాల్లో లోపాలు దొర్లకుండా

ద్వివేది తక్షణమే బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎన్నికలను ప్రశాంతంగా, అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. ఓటర్ల జాబితాల్లో ఎలాంటి లోపాలు దొర్లకుండా చూస్తానని స్పష్టం చేశారు. 'ఎన్నికలు అత్యంత పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు నిర్వహిస్తాం. ఓటర్లు తమ పేర్లను వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. ఎస్ఎంఎస్ ద్వారా కూడా ఓటు ఉన్నదీ లేనిదీ తెలుసుకోవచ్చు' అని సూచించారు. ఓటర్లు తమ ఓట్లు ఉన్నదీ లేనిదీ తప్పని సరిగా పరిశీలించుకోవాలన్నారు. శాఖలన్నీ సహకరిస్తే ఎన్నికల ప్రక్రియ విజయవంతమవుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణపై అధికారులు, రాజకీయ పార్టీలతో చర్చిస్తామని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తామన్నారు

21న జనసేనలోకి బీజేపీ ఎమ్మెల్యే ఆకుల

రాజమండ్రి, మేజర్‌న్యూస్: ఈనెల 21న పవన్ సమక్షంలో జనసేనలో చేరుతున్నామని బీజేపీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ ప్రకటించారు. రాజకీయ వ్యవస్థను పవన్ ప్రక్షాళన చేస్తారన్న నమ్మకంతో జనసేనలో చేరుతున్నానని, పవన్ ఎక్కడ నుంచి పోటీ చేయమంటే అక్కడ నుంచి పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. 2014లో టీడీపీ, బీజేపీ పొత్తులో భాగంగా బీజేపీ తరపున రాజమండ్రి అర్బన్ స్థానం నుంచి ఆకుల పోటీ చేశారు. ఎమ్మెల్యే బీజేపీలో ఉన్న సమయంలో కూడా ఆయన భార్య పవన్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఆ నేపథ్యంలోనే ఎమ్మెల్యే కూడా పార్టీ మారతారనే ప్రచారం జరిగింది. చివరికి ఈ ప్రచారమే నిజమైంది.



కలర్స్

LIFE IS A RAINBOW





అంచెలంచెలుగా ఎదిగిన జాగృతి

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతూ, తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలతో మమేకమవుతూ కీలక పాత్ర పోషించిన తెలంగాణ జాగృతి ఇటీవలే పదేళ్ల సంబరాన్ని జరుపుకుంది. కేవలం తెలంగాణలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలను ఏకం చేసేందుకు, సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, పరిష్కారాలకు కృషి చేస్తున్న జాగృతిని తనదైన ప్రణాళికలతో ముందుకు తీసుకెళ్లడంలో సక్సెస్ అయిన నాయకురాలు జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ పార్లమెంటు సభ్యురాలు కల్వకుంట్ల కవిత అనటంలో సందేహం లేదు. ప్రజల కోసమే జాగృతి గమనం, గమ్యం అని వారి అభివృద్ధి కోసమే ఎడతెరపి లేకుండా కృషి చేస్తామంటూ నేటి నుంచి యువతే లక్ష్యంగా హైదరాబాద్ వేదికగా ఇంటర్నేషనల్ యూత్ లీడర్‌షిప్-2019 సదస్సు నేటి నుంచి నిర్వహించనుంది.

హైదరాబాద్ వేదికగా మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సు జరగనుంది యవతే లక్ష్యంగా నేడు ప్రారంభం కానున్న అంతర్జాతీయ సదస్సును తెలంగాణా రాష్ట్రసమితి ఎంపీ కవిత నేతృత్వం లోని తెలంగాణ జాగృతి సంస్థ శ్రీకారం చుట్టింది. 19, 20న నావాటెల్ కన్వెన్షనల్ సెంట ర్లో తెలం గాణ జాగృతి ఇంటర్నేషనల్ యూత్ లీడర్షిప్ కాన్ఫరెన్స్ -2019 జరగబోతోంది. ప్రపంచ వ్యాప్తంగా 110 దేశాల నుంచి 500 మందికిపైగా ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కానున్నారు. యూత్ లీడర్షిప్ కాన్ఫరెన్సు కు సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అలాగే సార్క్ మాజీ సెక్రటరీ జనరల్ అర్జున్ బహదూర్ థాపా ప్రత్యేక అతిథిగా హాజరవుతున్నారు.గాంధేయమార్గంలో సుస్థిర అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు ఇతివృత్తం గా జరగనున్న ఈ యూత్ లీడర్షిప్ కాన్ఫరెన్స్ లో16 దేశాల నుంచి వచ్చిన 70 మంది వక్తలు ప్రసంగిస్తారు. వీరుకాకుండా మరో 40 మంది ఇన్నోవేటర్స్ కూడా పాల్గొని ప్రపంచం ఎదుర్కొంటున్న సవా ళ్లను అహింసా మార్గంలో ఎలా ఎదుర్కోవాలన్న దానిపై వ్యక్తలు ప్రసంగించనున్నారు. తొలిరోజు జరిగే సదస్సులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కవిత ప్రారంభోపన్యాసం చేస్తారు. మొదటి రోజు యువత అభివృద్ధి పై ప్రముఖ జర్నలిస్ట్ శేఖర్ గుప్తా చర్చా గోష్టిని నిర్వహిస్తారు. పది వేర్వేరు హాళ్లలో వేర్వేరు అంశాలపై చర్చా గోష్టులు జరుగుతాయి. ప్రపంచ ప్రగతిలో యువత పాత్రపైనా యువ నాయకులు మాట్లాడ తారు. రెండో రోజు నైపుణ్య శిక్షణ, సమతులాభివృద్ధిలో యువత, మహిళల పాత్ర, కార్పోరేటు, ప్రభుత్వాల భాగస్వామ్యంపై చర్చిస్తారు. వీటిని అంతర్జాతీయంగా ఆయా రంగాల్లో నిష్టాతులు నిర్వహిస్తారు. ముగింపు సమావేశానికి గవర్నర్ ఇ.ఎస్.ఎల్ నరసింహన్ ముఖ్య అతిథిగా హాజరవుతారు.



సాధనలో భాగంగా తెలంగాణ జాగృతి ఈ అంతర్జాతీయ సదస్సు ను ప్రపంచ సమస్యలు, సవాళ్లపై నిర్వహిస్తోంది. సమాజ నిర్మాణంలో యువత పోషించాల్సిన పాత్రపై అంతర్జాతీయ సదస్సు-2019లో చర్చించనున్నారామె.

ప్రముఖులతో చర్చా గోష్ఠులకు ప్యానెళ్లు

యువత అభివృద్ధి అనే అంశంపై తొలి రోజున జరిగే చర్చా గోష్టిని ప్రముఖ సీనియర్ పాత్రికేయులు శేఖర్ గుప్తా నిర్వహిస్తారు. అసోం ఎంపి గౌరవ్ గగోయ్, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసితో పాటు నిజామాబాద్ ఎంపి కల్వకుంట్ల కవిత ప్యానలిస్టులుగా వేర్వేరు చర్చల్లో పాల్గొంటారు. గాంధీ, యూత్, సస్టైనబిలిటీ, పర్‌స్పెక్టివ్స్ ఫ్రం ది వరల్డ్ అనే అంశంపై యూకె ఎంపి సీమా మల్హోత్రా, న్యూజిలాండ్ ఎంపి కన్వజిత్ సింగ్ భక్షి, ఐక్య రాజ్య సమితిలో నేపాల్ శాశ్వత ప్రతినిధి మధు రామన్ ఆచార్య, శ్రీలంక పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఉప మంత్రి బుదికా పథిరాణా, మాసిడోనియా రిపబ్లిక్ పెట్టుబడుల శాఖ మాజీ మంత్రి గ్లిగర్ తస్కోవి, ఒకినవా, అఫ్ఘనిస్తాన్‌లలో వరల్డ్ ట్రేడ్ సెంటర్స్ వ్యవస్థాపకుడు జాన్ డిక్సన్ తదితరులు చర్చల్లో పాల్గొని ప్రసంగిస్తారు.

ఐక్యరాజ్య సమితి లక్ష్యాలు ఇవే

ఐక్య రాజ్య సమితి నిర్దేశించిన 17 లక్ష్యాలు, అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో చర్చించే అంశాలు ఈ విధంగా ఉన్నాయని తెలంగాణ జాగృతి సంస్థ తెలియజేసింది. పేదరిక నిర్మూలన, ఆహార సమృద్ధి, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, మంచి నీరు పరిశుభ్రత, పర్యావరణ అనుకూల విద్యుత్, గౌరవ ప్రదమైన పని, ఆర్థికాభివృద్ధి, పరిశ్రమలు, మౌలిక వస తులు, నూతన ఆవిష్కరణలు, అన్ని రంగాల్లో సమాన త్వం, పర్యావరణ అనుకూల నగరాలు, గ్రామాలు, బాధ్యతాయుతమైన వనరుల వినియోగం, వాతావరణంలో మార్పులు-మానవాళి బాధ్యత, సముద్ర జీవుల సంరక్షణ, భూచరాల జీవనానికి అనుకూల వాతావా రణంకు కృషి, శాంతి, న్యాయం దిశగా పటిష్ట వ్యవస్థల ఏర్పాటు, పై లక్ష్యాల కోసం వ్యవస్థలు, దేశాల పరస్పర సహకారం తదితరాలు.

ఐరాస లక్ష్యసాధన కోసమే

2030 వరకు భవిష్యత్ మానవాళి మనుగడకు అవసరమైన ప్రాథమిక లక్ష్యాలను సాధించేందుకు ఐక్య రాజ్య సమితి విడుదల చేసిన 17 అంశాల లక్ష్యాల

మహిళా సాధికారికత

కేవలం సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితమవ కుండా స్కిల్ డెవలప్ మెంట్, మహిళా సాధికారికత, చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాడు తెలంగాణా సాధన కోసం కేసీఆర్ స్ఫూర్తిగా ఈ జాగృాఎతి ఉద్యమం ప్రారంభించామని, తొలినాళ్ళలో కేవలం 18 మంది మాత్రమే ఉండేవారని, నేడు ప్రతి జిల్లా, పల్లెల్లో విస్తరించి ఓ బ్రాండ్‌గా తయారైందని కవిత తెలిపారు. మరుగున పడ్డ తెలంగాణా సంస్కృతికి జీవం పోసింది జాగృతేనన్నారు. స్కిల్ డెవలప్ మెంట్ ద్వారా 3500 మందికి శిక్షణనిచ్చామని ఇకపై మహిళలకు మరింతగా వారు కోరుకుంటున్న రంగాల్లో శిక్షణనిస్తామని తెలిపారు.



సమాజంలో యువతదే కీలక పాత్ర

సమాజ అభివృద్ధిలో యువతది కీలకపాత్ర. యువత కోసం అనేక కార్యక్రమాలు చేసిన తెలంగాణ జాగృతి సంస్థ ఐక్యరాజ్యసమితి సూచించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల అంశాలపై చర్చించేందుకు సదస్సును నిర్వహిస్తున్నది. పలు అంశాలపై వివిధ దేశాలకు చెందిన యువత చర్చించడం ద్వారా వాటికి పరిష్కార మార్గాలు, సలహాలు, సూచనలు అందనున్నాయి. రాష్ట్రంతోపాటు వివిధ దేశాల్లో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న జాగృతి సంస్థ ప్రపంచ స్థాయి సదస్సును నిర్వహిస్తున్నది. ఇలాంటి కార్యక్రమాలు యువతలో సరికొత్త ఉత్సాహన్నిచ్చే అవకాశమున్నది.

పదేళ్ల ప్రస్థానం

తెలంగాణ జాగృతి 2008 నవంబర్ 3న లాభాపేక్షలేని నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ (ఎన్‌జిఓ)గా ఏర్పాటైంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేస్తోంది. వీటితో పాటు పలు సంక్షేమ కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నారు. నిరుద్యోగ యువత, మహిళలు, రైతుల కోసం అనేక కార్యక్రమాలను చేపడుతోంది జాగృతి సంస్థ. బతుకమ్మ పండగకు ప్రపంచ గుర్తింపు తీసుకురావడంలో జాగృతి కీలక పాత్ర పోషించిందని ఎంపీ కవిత పలు సందర్భాల్లో చెప్పారు. ఇటీవలే జాగృతి పదేళ్ల ప్రస్థానం సింహావలోకనంతో పాటు భవిష్యత్ కార్యాచరణను నిర్దేశించుకుని ముందుకు దూసుకు పోతోంది కల్వకుంట్ల కవిత. తెలంగాణ జిల్లాలతో పాటు ముంబయి, లండన్, ఆస్ట్రేలియా, అమెరికా, బహ్రైన్, కువైట్ లలో కూడా జాగృతిని విస్తరించిన ఆమె ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 100 దేశాలలో తన సంస్థ పనిచేసాలా చూస్తున్నారు. ఎక్కడ తెలంగాణ ప్రజలున్నా వారికి కష్టనష్టాలలో పాలు పంచు కునేలా ఎప్పటికప్పుడు తన పరివారానికి సలహాలు సూచనలు చేస్తూ సేవలో ప్రోత్సాహం కల్గిస్తున్నారు. తరాలు మారుతున్నాయి. ఆలోచనలు మారుతున్నాయి. ప్రపంచ పరివర్తన వేగాన్ని అందుకోవడమే నేటి తరానికి ఒక అనివార్యత. వేగం అన్ని వ్యవస్థలకు అనివార్యమైపోయింది. ఫలితాలే సమాజ గమనాన్ని నిర్దేశిస్తాయి. వీటిని గమనంలోనికి తీసుకున్న తెలంగాణ జాగృతి సంస్థ అనేక లక్ష్యాలను నిర్దేశించుకుని వడివడిగా వాటిని చేరుకునే దిశగా అడుగులు ఆరంభించింది.

వృత్తి విద్యపై దృష్టి

అకడమిక్ విద్య కంటే, వృత్తి విద్యకే ఈ తరం బాగా మొగ్గు చూపుతుండటంతో ఆ దిశగా జాగృతి తన ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ప్రభుత్వం చూపించిన చొరవతో తెలంగాణ యువత అనేక మంది విదేశాల్లో ఉద్యోగాలు చేయడమో, విద్య కోసం వెళ్లడమో, స్థిరపడడమో జరిగింది. రెండు దశాబ్దాల కంటే ఈ వేగం బాగా పెరిగింది, ఇది మరింత పెరుగేందుకు ఆస్కారం ఉంది. గత మూడేళ్లలో దేశంలో అన్నిరాష్ట్రాల కన్నా తెలంగాణ ఐటీ రంగం ఐదు శాతం అభివృద్ధి చెందుతుండటాన్ని గమనిస్తే ఉపాధి కల్పనలో తెలంగాణ వేగాన్ని గమనించొచ్చు. పరివర్తనకు తగ్గ నాయకత్వాన్ని సమాజం ఎప్పుడూ కోరుకుంటుంది.

ట్రెయినింగ్ సెంటర్లు

యవతలోని ప్రతిభాపాటవాలను వెలుగులోనికి తీసుకువచ్చేందుకు జాగృతి సంస్థ ప్రత్యేకంగా ట్రెయినింగ్ సెంటర్ల నిర్వహణ చేస్తోంది. ఈ పెంటర్ల ద్వారా అనేక మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధికి అవసరమైన అనేక రంగాలలో శిక్షణ ఇవ్వటంతో పాటు ప్రోత్సాహకాలు కూడా అందజేస్తోంది. ఈ శిక్షణ శిబిరాల్లో పాల్గొన్నవారికే కాకుండా అర్హత కలిగిన ఇతర నిరుద్యోగ యువతకు కూడా జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలు కల్పిస్తూ, జాబ్ మేళా కోసం జాగృతి నుంచి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తోంది కూడా

యువత కోసం జాబ్ మేళాలు

ప్రధానమంత్రి కౌశల్ రోజ్ గారి యోజన కింద తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జాగృతి బ్రాంచ్‌లలో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నారు.ఈ జాబ్ మేళాలలో..లాజిస్టిక్స్, రిటెయిల్, ఎలక్ట్రానిక్స్, బ్యూటీ అండ్ వెల్నెస్, హోటల్ మేనేజ్మెంట్ రంగాల్లో ఉద్యోగ నియామకాలను చేపట్టారు. వీటితో పాటు బీపీఓ, ఎలక్ట్రానిక్స్, అగ్రిబేస్డ్ కంపెనీలు, ఫార్మసీ సంస్థలు, హోటల్ పరిశ్రమ, బ్యూటీ అండ్ వెల్నెస్, సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థలు కూడా పలువురు అభ్యర్థులను రికట్ చేసుకున్నాయి. జాబ్ మేళాకు సంబంధించిన మరిన్ని వివరాలకు కోసం హైదరాబాద్ దోమలగూడలోని నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రధాన కార్యాలయంలోని 040-40214215 నంబర్ కు కాల్ చేసి తెలుసుకోవచ్చు.

గల్ఫ్ బాధితులకు చేయూత

పనికోసం గల్ఫ్ దేశాల బాట పట్టి, తినడానికి తిండి లేక ఉండడానికి నీడ లేక తీవ్ర అవస్థలు పడుతున్న తెలంగాణ జిల్లాలకు చెందిన అనేక మంది బాధితులకు తెలంగాణా జాగృతి చేయూత నిచ్చింది. బాధితుల సమాచారం అందుకున్న జాగృతి ఖతర్ నిర్వాహకురాలు నందిని అబ్బాగౌని వారిని నేరుగా కలిసి వారి బాధలు ప్రత్యక్షంగా చూసిన ఆమె వారానికి సరిపడా ఆహార పదార్థాలను సమకూర్చారు. బాధితు లంతా ఏజెంట్ల మోసాలకు గురైనవారు కావటం, వీసా గడువు ముగిసిన వారు కొందరైతే, మరికొందరికి ఎగ్జిట్ పర్మిట్ లేకపోవటం, కొందరికి ఐడీ చెయ్యమంటే ఏజెంట్లు ఇంకా పైసలు అడుగడంతో ఖర్చులకు రూపాయి లేక.. ఇంటికి ఫోన్ చేయలేక సతమతమౌతుఎన్న విషయాన్ని అక్కడి యాజమాన్యాలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తున్నారు.

బీడీ కార్మికులకు అండగా

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని బీడీ కంపెనీల టేకేదారులకు తెలంగాణ జాగృతి అండగా నిలవడానికి ముందుకు వచ్చింది. వారికి ప్రమాదబీమా చేయించేందుకు నిర్ణయం తీసుకున్నది. నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత సూచన మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బీడీ కంపెనీల టేకేదారులకు బీమా కల్పించనున్నట్టు టీఆర్ఎస్కేవీ అనుబంధ తెలంగాణ బీడీ టేకేదారుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రూప్సింగ్, రాష్ట్ర అధ్యక్షుడు దుంపల నారాయణ సారథ్యంలో ఏర్పాటు చేసింది. టేకేదారులకు రూ.5లక్షల ప్రమాద బీమా కల్పించేందుకు గాను ప్రీమియం మొత్తాన్ని తెలంగాణ జాగృతి సంస్థ భరిస్తుంది. తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 6వేల మంది టేకేదారులకు మేలు కలిగి నట్టు జాగృతి వర్గాలు తెలిపాయి.

గిన్నిస్‌లోకి

కవులు కాళాకారులను ప్రోత్సహించే క్రమంలో కాళోజి 103వ జయంతిని పురస్కరించుకొని రవీంద్రభారతిలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కవితాంజలి పేరుతో ప్రత్యేక కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొ న్న కవులు 12 గంటలపాటు నిర్విరామంగా కవితలు చదివి ప్రపంచ రికార్డ్ నెలకొల్పారు. ఈ కవిసమ్మేళనంలో150 మందికి పైగా కవులు తమ కవితాగానంతో అలరించడంతో గిన్నిస్ రికార్డ్ సాధించింది. గతంలో 111 మంది కవులతో నార్వే దేశంలో నిర్వహించిన కవి సమ్మేళనం ప్రపంచ రికార్డును బద్దలు కొట్టారు.

- సత్యగోపాల్, హైదరాబాద్



వెంకీ-కమల్ కలయికలో అడ్డాల చిత్రం





కొత్త బంగారులోకం, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, ముకుంద చిత్రాలతో హ్యాట్రిక్ కొట్టి, బ్రహ్మోత్సవంతో డీలా పడిన శ్రీకాంత్ అడ్డాల తన తదుపరి చిత్రాన్ని కమల్ హాసన్-వెంకటేష్‌లతో రూపొందించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ విషయాన్ని ఆయన స్వయంగా వెల్లడించారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో తెరకెక్కనున్న ఈ చిత్రం కోసం కథను సిద్ధం చేశామని, త్వరలోనే ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనుందని అడ్డాల తెలిపారు!!

మహాలక్ష్మికి గుమ్మడికాయ కొట్టారు



తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న దట్ ఈజ్ మహాలక్ష్మి షూటింగ్‌కి గుమ్మడికాయ కొట్టారు. ఓ సాధారణ యువతి అసాధారణ మహిళగా ఎలా మారుతుందనే కథతో దటీజ్ మహాలక్ష్మి సినిమా తెరకెక్కుతుంది. ఈ మధ్యే విడుదలైన టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అమిత్ త్రివేది ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులతో బిజీగా ఉంది. త్వరలోనే చిత్ర యూనిట్ విడుదల తేదీని ప్రకటించనున్నారు. మైఖెల్ ట్యాబ్యురియస్ ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. టైజాన్ ఖొరాకివాలా దటీజ్ మహాలక్ష్మి సినిమాను సమర్పిస్తున్నారు. మెడైంటే ఇంటర్నేషనల్ బ్యానర్‌పై మను కుమరన్ ప్రొడక్షన్‌లో ఈ చిత్రం వస్తుంది. తమన్నాను ప్రముఖ బాలీవుడ్ క్రిటిక్స్ రాజీవ్ మసంద్, అనుపమ్ చోప్రా ఇంటర్వ్యూ చేసి సినిమా ప్రమోషన్‌ను ఘనంగా మొదలు పెట్టారు. నటి పరుల్ యాదవ్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా ఉన్నారు!!

బాలయ్యతో నాలుగోసారి.. బోయపాటితో మూడోసారి


సింహా, లెజెండ్ చిత్రాల అనంతరం బాలయ్య-బోయపాటి కలయికలో ఓ చిత్రం తెరకెక్కనున్నదనే సంగతి తెలిసిందే. బాలకృష్ణ ఈ చిత్రాన్ని స్వయంగా నిర్మించనున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నయనతారను తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. బోయపాటితో తులసి, సింహా చిత్రాల్లో నటించిన నయన.. బాలయ్యతో సింహా, శ్రీరామరాజ్యం, జై సింహా చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం ఈ అమ్మడు తెలుగులో చిరంజీవితో 'సైరా నరసింహా రెడ్డి' చేస్తోంది. ఇక తమిళంలో అయితే పలు చిత్రాలు చేస్తూ యమా బిజీగా ఉంది!!

అవినీతిపరుల గుండెల్లో భయోత్పాతం పుట్టించే భారతీయుడు



లంచం తీసుకునే అధికారులను కలుపు మొక్కల్లా ఏరేసి అవినీతి అధికారుల గుండెల్లో భయం పుట్టించాడు సేనాపతి. లంచం ఇచ్చి తన తప్పు కప్పిపుచ్చుకోవాలనుకున్న సొంత కొడుకుని సైతం చంపేశాడు. "ఏ తప్పు జరిగినా నేను తప్పకుండా వస్తాను. భారతీయుడికి చావే లేదు.. జైహింద్" అంటూ వెళ్లిపోయిన సేనాపతి మళ్లీ వస్తున్నాడు. శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'భారతీయుడు'. 1996లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'భారతీయుడు2' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఇప్పటికే లొకేషన్లను ఖరారు చేసిన శంకర్ రేపటి నుంచి మెగాఫోన్ పట్టనున్నారు. మర్మకళలో చేతివేళ్లను ఉపయోగించే తీరును చూపిస్తూ ఇటీవల ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసిన చిత్ర బృందం.. తాజాగా కమల్‌హాసన్ హాఫ్‌లుక్‌ను అభిమానులతో పంచుకుంది. ఇందులో పోస్టర్‌పై 'వృద్ధుడు.. తెలివైనవాడు.. గట్టివాడు..' అంటూ క్యాప్షన్ ఇవ్వగా, రేపటి నుంచి షూటింగ్ ప్రారంభం అంటూ చెప్పుకొచ్చింది. ఖాకీ దుస్తులు ధరించిన సేనాపతి పాత్రలో కమల్ లుక్ అభిమానులను అలరిస్తోంది. లైకా ప్రొడక్షన్ పతాకంపై సుభాష్ కరణ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ స్వరాలు సమకూరుస్తున్నారు. సిద్ధార్థ్ కీలక పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం!!

కేతిరెడ్డి చిత్రంలో లక్ష్మీపార్వతిగా శ్రీరెడ్డి?



రామ్ గోపాల్ వర్మ తీస్తున్న లక్ష్మీస్ ఎన్టీఆర్‌కు పోటీగా కేతిరెడ్డి జగదీశ్ రెడ్డి తెరకెక్కిస్తున్న 'లక్ష్మీస్ వీరగ్రంథం'లో లక్ష్మి పార్వతిగా శ్రీ రెడ్డి నటిస్తోందని తెలుస్తోంది. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని ఈ చిత్రం టీజర్ రిలీజ్ చేశారు. మరో మూడు నెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల లోపు ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు కేతిరెడ్డి సన్నాహాలు చేస్తున్నారు!!

దబంగ్-3లో వీళ్లిద్దరూ




బాలీవుడ్ సూపర్‌స్టార్ నటించనున్న దబంగ్-3లో హీరో టర్నడ్ స్టార్ విలన్ జగపతిబాబు ప్రతినాయకుడిగా నటించనున్నట్లు తెలుస్తోంది. తెలుగులో తిరుగులేని విలన్‌గా పేరు తెచ్చుకున్న జగపతిబాబు తమిళ, మలయాళ భాషల్లోనూ విలన్‌గా నటిస్తూ యమ బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన హిందీలో అజయ్‌దేవగన్ హీరోగా రూపొందుతున్న తన్హాజీలోనూ విలన్‌గా నటిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ప్రభుదేవా దర్శకత్వంలో సల్మాన్ నటించే దబంగ్-3 కోసం జగపతిబాబును ఎంపిక చేశారు. అంతేకాదు, కన్నడ స్టార్ సుదీప్‌ను సైతం ఈ చిత్రంలో రెండో విలన్‌గా తీసుకుంటున్నారని తెలుస్తోంది!!

నిషా రెబ్బా



అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా.. టాప్ హీరోయిన్‌గా అలరారేందుకు అవసరమైన అందం, అభినయ సామర్థ్యం, నాట్యం, వాచకం వంటివన్నీ పుష్కలంగా ఉన్నా.. ఇప్పటికీ సరైన బ్రేక్ రాక బి గ్రేడ్ హీరోయిన్ గానే ఉండిపోయిన ఈషా.. సోషల్ మీడియాలో మాత్రం తెగ హల్ చల్ చేస్తోంది. వీలయినంత తరచుగా హాట్ ఫోటో షూట్స్ చేయించుకుంటూ సందడి చేస్తోంది. గతేడాది ఈషా నటించిన బ్రాండ్ బాబు పూర్తిగా నిరాశపరచగా, సుబ్రహ్మణ్యపురం సో సో అనిపించుకుంది. ఈషా ప్రత్యేక అతిధి పాత్ర పోషించిన 'అరవింద సమేత వీర రాఘవ' హిట్ అయినప్పటికీ.. ఆమె కెరీర్‌కి పెద్దగా ఉపయోగపడలేదు. ఈ నేపథ్యంలో హాట్ హాట్‌గా ఫోటో షూట్ చేయించుకొని వాటిని నెట్‌లో వదులుతూ తన ఉనికిని ప్రకటించుకొంటోంది!!

దోషం ఎవరికి?



రామూవీ రిక్రియేషన్స్ పతాకంపై కిషోర్, సన హీరో హీరోయిన్లుగా రఘు గోపసాని స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దోషం' నాకా...! దేవుడికా..? అనే క్యాప్షన్‌తో వస్తున్న ఈ చిత్రం ఇటీవలే పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని సెన్సార్‌కి రెడీ అవుతుంది.

ఈ సందర్భంగా చిత్ర దర్శక నిర్మాత రఘు గోపసాని మాట్లాడుతూ.. వజ్రాన్ని వజ్రంతో కోసినట్లు.. మనిషిని పట్టి పీడిస్తున్న దోషాల తలలను కోయడానికి త్రిశులంగా దూసుకొస్తున్న 'దోషం' రాబోతుంది. ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకరానున్నాం.. అన్నారు!!

భీమవరంవారి రౌడీభాయ్



రౌడీ భాయ్ ఫస్ట్ లుక్‌ని మాజీ గవర్నర్ శ్రీ కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ కొణిజేటి రోశయ్య మాట్లాడుతూ.. రామ సత్యనారాయణకి సినిమా పట్ల వున్న ప్రేమ.. ఇప్పటివరకు దాదాపు వంద సినిమాలుకు చేరువకి తీసుకొచ్చింది. అన్ని సినిమాల్లోనూ డిఫరెంట్ డిఫరెంట్ కాన్సెప్ట్స్‌తో సినిమాలు నిర్మిస్తూ.. కొత్త కొత్త నటీ నటులను, సాంకేతిక నిపుణులను సినీ పరిశ్రమకి పరిచయం చేస్తూనే వున్నాడు. ఈ పోటీ ప్రపంచంలో ఇన్ని సినిమాలు నిర్మించిన ఆయన మరెన్నో మంచి సినిమాలు నిర్మించాలని, ఆయన ప్రతి ఒక్క సినిమా మంచి విజయాన్ని సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.. అని చెప్పారు. జాన్ సమర్పణలో భీమవరం టాకీస్ నిర్మించిన ఈ రౌడీ భాయ్ చిత్రానికి సంగీతం; అర్జున్, కెమెరా; భాస్కర్, నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ దర్శకుడు; ఉదయ్.జి!!

కె.యస్.100 ప్రచారచిత్రం



చంద్ర శేఖర్ మూవీస్ పతాకంపై సమీర్ ఖాన్, శైలజ, సునీత పాండే, ఆశి రాయ్, శ్రద్ధ, అక్షత ప్రధాన పాత్ర దారులుగా జి కె. వెంకట్ రామ్ రెడ్డి నిర్మించిన చిత్రం 'కె ఎస్ 100'. షేర్ దర్శకత్వం వహించిన ఈ చిత్ర ట్రైలర్ నిర్మాత సాయి వెంకట్, మల్టీ డీమెన్షన్ వాసు, అట్లూరి రామకృష్ణలచే విడుదలైంది. ఈ సందర్భంగా నిర్మాత వెంకట రామ్ రెడ్డి మాట్లాడుతూ ... మంచి హర్రర్ థ్రిల్లర్ రొమాంటిక్ మూవీ. సినిమా చాలా బాగొచ్చింది. అందరికీ నచ్చి తీరుతుందని ఆశిస్తున్నా అన్నారు. దర్శకుడు షేర్ మాట్లాడుతూ.. నా పేరు షిరాజ్.. కానీ ఎవరికీ పలకడం రావడం లేదనే షేర్ అని మార్చుకున్నా. ఈ సబ్జెక్టు యాప్ట్ అవ్వాలనే నలుగురు అందమైన అమ్మాయిలను ఈ సినిమాలో పెట్టడం జరిగింది. సినిమాలో వీరి పర్ఫామెన్స్ అద్భుతంగా ఉంటుంది. అంతేకాదు ఈ సినిమాను వరల్డ్‌వైడ్‌గా విడుదల చేయాలనే ప్లాన్‌లో ఉన్నాము. హీరో సమీర్ ఖాన్ యాక్టింగ్ మెచూర్డ్‌గా ఉంటుంది.. కొత్త అన్నట్టుగా ఎక్కడా కనిపించదు. ఈ తరం అమ్మాయిలు ఏవిధంగా ఫాస్ట్ కల్చర్‌ను అలవర్చుకున్నారు అనే విధంగా తెరకెక్కించడం జరిగింది.. అని చెప్పారు.

సాయి వెంకట్, అక్షత, కూసెట్టి, అజీబ్, సంగీత దర్శకుడు నవనీత్ చారి, శ్రద్ధ, రామకృష్ణ అట్లూరి, తదితరులు పాల్గొన్నారు!!



అమిత్ షాకు బహిరంగ క్షమాపణలు చెప్పాలి: జీవీఎల్

న్యూఢిల్లీ : భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా అనారోగ్యాన్ని ఉద్దేశిస్తూ కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు బీకే హరి ప్రసాద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హరి ప్రసాద్‌ను పార్టీ జనరల్ సెక్రెటరీ హోదా నుంచి తొలగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ హరి ప్రసాద్‌ను తొలగించకపోతే ఈ వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ కూడా మద్దతు ఇస్తున్నట్లు భావించాల్సి వస్తుందని తెలిపారు. ఈ విషయం గురించి బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్ నంసింహా రావు మాట్లాడుతూ, 'రెండు నాలుకల ధోరణిని ప్రదర్శించడం కాంగ్రెస్ స్వభావం. ఒక వైపు రాహుల్ గాంధీ జైట్లీ అనారోగ్యం గురించి విచారం వ్యక్తం చేస్తూంటే మరో వైపు హరి ప్రసాద్ వంటి వార్లు ఇలా విషం కక్కుతారు.

వీరి గురించి జనానికి బాగా తెలుసు. ఒక వేళ వారు (రాహుల్) నిజంగానే హరి ప్రసాద్ వ్యాఖ్యల్ని సమర్థించకపోతే అతనితో అమిత్ షాకు బహిరంగ క్షమా పణలు చెప్పించాలి' అని అన్నారు. అమిత్ షా స్వైన్ ఫ్లూతో బాధపడుతూ ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు హరి ప్రసాద్ కర్నాటకలో కాంగ్రెస్ – జేడీఎస్ కూటమిని చీల్చడానికి ప్రయత్నించడం వల్లే అమిత్ షా అనారోగ్యం పాలయ్యారని అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

మమత అక్కయ్య ! నా ఫుల్ సపోర్ట్ నీకే: రాహుల్

● కోల్‌కతాలో నేడు ప్రతిపక్షాల ర్యాలీ ● మోడీ బూటకపు హామీలు ఇచ్చారన్న రాహుల్ ● అందువల్లే ప్రతిపక్షాలు ఏకమవుతున్నాయని వ్యాఖ్య ● కేసీఆర్ జీ ! నేడు ర్యాలీకి రండి ● ఆహ్వానించిన మమతా బెనర్జీ ● తెలంగాణ సీఎంకు టీఎంసీ అధినేత్రి ఫోన్ ● 20 మంది నేతలు హాజరవుతున్నారన్న మమత ● దూరంగా ఉండాలనుకుంటున్న కేసీఆర్

న్యూఢిల్లీ : కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శనివారం కోల్‌కతాలో నిర్వహించనున్న ర్యాలీకి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తన మద్దతు ప్రకటించారు. దేశంలోని కోట్లాది మంది ప్రజలు ఆగ్రహావేశాల కారణంగానే ప్రతిపక్షాలు ఏకం అవుతున్నాయని రాహల్ అన్నారు. ఈ ప్రజలంతా మోడీ ప్రభుత్వ బూటకపు హామీలు, అబద్ధాలతో మోసపోయారని వ్యాఖ్యానించారు. మహిళలు, చిన్నారులు, కులం, మతం, భాష అన్న తేడా లేకుండా అందరి మాటకు గౌరవం ఇచ్చే రేపటి భారతం కోసం ప్రతిపక్షాలన్నీ ఏకం అవుతున్నాయని రాహుల్ పునరుద్ఘాటించారు. హక్కులు, భావజాలాల పరిరక్షణలో బెంగాలీలు ఎప్పుడూ ముందు ఉంటారని రాహుల్ ప్రశంసించారు. ప్రతిపక్షాలన్నీ ఒకే వేదికపైకి రావడం ద్వారా బలమైన సందేశాన్ని పంపినట్లు అవుతుందని రాహుల్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు మమతకు రాసిన లేఖను రాహుల్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కె చంద్రశేఖర్ రావుకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ శుక్రవారం ఫోన్ చేశారు. శనివారం కోలకతాలో తృణమూల్ కాంగ్రెస్ నిర్వహించనున్న ప్రతిపక్షాల ర్యాలీకి హాజరు కావాలని ఈ సందర్భంగా ఆమె ఆహ్వానించారు. దేశవ్యాప్తంగా పలు జాతీయ, ప్రాంతీయ పార్టీలకు చెందిన 20 మందికి పైగా నేతలు హాజరు అవుతున్నట్లు మమత కేసీఆర్‌కు వివరించారు. అయితే, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటున్న ఈ ర్యాలీకి దూరంగా ఉండాలని టీఆర్ఎస్ అధినేత



నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కాగా, రాజకీయాల్లో గుణాత్మక మార్పు తేవాలనే లక్ష్యంతో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మమతా బెనర్జీతో పాటు ఒడిశా సీఎం నవీన్



పట్నాయక్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, యూపీ మాజీ సీఎంలు మాయావతి, అఖిలేశ్ యాదవ్‌లతో భేటీ అయ్యారు. బీజేపీ, కాంగ్రెస్ కూటములకు ప్రత్యామ్నాయంగా ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటును కేసీఆర్ ప్రతిపాదించారు.

భారత్ లక్ష్యం అదే : ప్రధాని మోడీ



గాంధీనగర్ : సులువుగా వ్యాపారం చేయడంలో వచ్చే ఏడాదికల్లా మన దేశం ప్రపంచంలోని తొలి 50 దేశాల్లో ఒకటి కావాలని ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్షించారు. శక్తిమంతమైన గుజరాత్ సదస్సును ప్రారంభించిన అనంతరం మోడీ మాట్లాడుతూ, ప్రపంచ బ్యాంకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్స్‌లో మన దేశం 75 స్థానాలను అధిగమించిందని, ప్రస్తుతం 77వ స్థానంలో నిలిచిందని చెప్పారు. వచ్చే ఏడాదికల్లా టాప్ 50లో చేరేందుకు వీలుగా మరింత శ్రమించాలని తన బృందాన్ని కోరినట్లు ఆయన తెలిపారు. భారతదేశం తన సామర్థ్యాన్ని సాధించడానికి అడ్డుపడుతున్న నిరోధకాలను తొలగించడంపై తన ప్రభుత్వం దృష్టి పెట్టిందని చెప్పారు. సంస్కరణల వేగాన్ని కొనసాగిస్తామన్నారు. సంస్కరణలు, పని తీరు, పరివర్తన, మరింత పని చేయడం అనే మంత్రాన్ని ప్రయోగించి ప్రభుత్వాన్ని తగ్గించి, పరిపాలనను పెంచడంపై దృష్టి సారించినట్లు మోడీ తెలిపారు.

ప్రధాని మోడీని లేపేస్తున్నా

పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి చెప్పిన దర్జీ



న్యూఢిల్లీ : మద్యం మత్తులో ఓ వ్యక్తి పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి ప్రధాని నరేంద్ర మోడీని హత్య చేయబోతున్నానని చెప్పి కలకలం రేపాడు. అతడి ఫోన్ కాల్‌తో అప్రమత్తమైన పోలీసులు, ఇంటలిజన్స్ అధికారులు ఫోన్ నంబర్ ద్వారా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలోని ఆనంద్ పర్బత్ ప్రాంతంలో జరిగిందీ ఘటన. స్థానికంగా దర్జీ పని చేసుకుంటూ జీవిస్తున్న ముక్తియార్ అలీ (53) వ్యాపారంలో బాగా నష్టపోయాడు. ఆ ఒత్తిడిలో ఉన్న అలీ పూటుగా మద్యం తాగి వచ్చి పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశాడు. ప్రధానిని చంపేయబోతున్నానని చెప్పి పెట్టేశాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. ముక్తియార్ ఫోన్‌తో కదిలిన పోలీసులు ఫోన్ నంబర్ ఆధారంగా అలీని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. అలీ మంచోడేనని, మద్యం మత్తులోనే కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశాడని దర్యాప్తులో తేలింది. నిందితుడిపై గతంలో ఎటువంటి కేసులూ లేవని పోలీసులు పేర్కొన్నారు.

శబరిమలలోకి ప్రవేశించిన 51 మంది మహిళలు



న్యూఢిల్లీ : శబరిమల ఆలయంలోకి అన్ని వయసుల మహిళలను అనుమతిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఇప్పటి వంకు 10 నుంచి 50 ఏళ్ల లోపు మహిళలు 51 మంది ఆలయంలో ప్రవేశించారని కేరళ ప్రభుత్వం శుక్రవారం సుప్రీం కోర్టుకు సమర్పించిన నోట్‌లో పేర్కొంది. ఆలయ సంప్రదాయం ప్రకారం రుతుక్రమంలో ఉన్న పది నుంచి 50 సంవత్సరాల లోపు బాలికలు, మహిళలను ఆలయంలోకి అనుమతించని సంగతి తెలిసిందే. అయితే, శబరిమల ఆలయంలోకి అన్ని వయసుల మహిళలను అనుమతించాలని గత ఏడాది సెప్టెంబర్ 28న సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. పది నుంచి 50 ఏళ్ల లోపు మహిళల ఆలయ ప్రవేశం సంప్రదాయాలకు విరుద్ధమని హిందూ సంఘాలు సుప్రీం తీర్పుపై భగ్గుమన్నాయి. మహిళలను ఆలయంలోకి రాకుండా ఎక్కడికక్కడ ఆందోళనకారులు అడ్డుకోవడంతో పలు మార్లు ఉద్రిక్తత నెలకొంది. మరో వైపు ఈ నెల 2న ఇద్దరు మహిళలు కనకదుర్గ, బిందు ఆందోళనకారుల నిరసనలను నిలువరిస్తూ శబరిమల ఆలయంలోకి ప్రవేశించడం కలకలం రేపిన సంగతి తెలిసిందే.

సైనికులకు పెట్టే ఆహారంపై సంచలన విమర్శలు చేసిన

జవాన్ కుమారుడి అనుమానాస్పద మృతి

- **ఆహారం నాసిరకమంటూ వీడియోలు పెట్టిన తేజ్ బహదూర్ యాదవ్**
- **విధుల నుంచి తొలగించిన అధికారులు**
- **ఇంట్లో విగతజీవిగా కనిపించిన తేజ్ కుమారుడు రోహిత్**



న్యూఢిల్లీ : భారత సైనికులకు పెడుతున్న ఆహారం అత్యంత నాసిరకమని, దాన్ని తినలేక ఇబ్బందులు పడుతూ, అస్వస్థతకు గురవుతున్నామని సంచలన విమర్శలు చేస్తూ వీడియోలు పెట్టిన బీఎస్ఎఫ్ జవాను కుమారుడు అనుమానాస్పద స్థితిలో విగతజీవిగా కనిపించాడు. ఆరోపణల వీడియోలను పోస్ట్ చేసిన తేజ్ బహదూర్ యాదవ్‌ను ఉన్నతాధికారులు విధుల నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. ఇది ఇలా ఉంచితే, ఆయన కుమారుడు రోహిత్ (22) వారింట్లోనే తలుపులు మూసి ఉన్న గదిలో రక్తపు మడుగులో కనిపించాడు. అతని చేతుల్లో ఓ గన్ కూడా ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. 'రోహిత్ ఆత్మహత్య చేసుకున్నాడని మాకు ఫిర్యాదు అందింది. ఘటన స్థలానికి వెళ్లాము. అతని గది లోపలి నుంచి గడియ పెట్టబడి ఉంది. మంచంపై అతని మృతదేహం, చేతుల్లో ఓ పిస్టల్ కనిపించాయి' అని పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

అతను సూసైడ్ చేసుకుని ఉండవచ్చని అను కుంటున్నామని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని తెలిపారు. ఘటన జరిగిన సమయంలో తేజ్ బహదూర్ యాదవ్ ఇంట్లో లేడని, కుంభమేళా కోసం ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లాడని, అతనికి విషయం తెలిపామని అన్నారు.

డ్యాన్స్ బార్లను మళ్లీ తెరవకుండా ఆర్డినెన్స్?



ముంబయి : మహారాష్ట్రలో మళ్లీ డ్యాన్స్ బార్లను తెరవకుండా నిరోధించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి సుధీర్ ముంగంటివార్ మాట్లాడుతూ, సుప్రీం కోర్టు తీర్పును అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. అవసరమైతే ఈ డ్యాన్స్ బార్లు మళ్లీ వ్యాపారం ప్రారంభించకుండా చేసేందుకు ఆర్డినెన్స్ తీసుకువస్తామన్నారు. సామాజిక, సాంస్కృతిక, సాంఘిక అల్లికను పరిరక్షించేందుకు బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 'ఛత్రపతి శివాజీ మహరాజ్ రాజ్యంలో మా తల్లులు, సోదరీమణులు తమ గౌరవానికి తక్కువ రకమైన పనుల్లో ఉండడాన్ని మేము అనుమతించం. 2013 నాటి ప్రభుత్వం ఈ బార్లను నిషేధిస్తూ తెచ్చిన బిల్లుకు కూడా మేము మద్దతు ఇచ్చాం' అని ముంగంటివార్ చెప్పారు. సుప్రీం కోర్టు గురువారం ఇచ్చిన తీర్పులో డ్యాన్స్ బార్లపై సంపూర్ణ నిషేధం సరి కాదని చెప్పింది. కొన్ని నిబంధనలను అమలు చేయవచ్చునని తెలిపింది. డ్యాన్స్ బార్లను మళ్లీ తెరిచేందుకు అనుమతి ఇచ్చింది. అనుమతుల మంజూరుకు కఠిన నిబంధనలను పేర్కొంటున్న చట్టాన్ని కూడా రద్దు చేసింది.

పార్టీ కేడర్‌ను బలోపేతం చేసుకోవడం మేలు



చెన్నై : తమిళనాడులో భారతీయ జనతా పార్టీతో పొత్తు పెట్టుకోవాల్సిన అవ సరం లేదని అన్నా డీఎంకే స్పష్టం చేసింది. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో తమిళనాట పొత్తులు ఉంటాయని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించడంతో అందరి దృష్టి అన్నా డీఎంకే వైపు మరలింది. ఈ నేపథ్యంలో ఇదే అంశంపై ఆ పార్టీ సీనియర్ నేత తంబిదురై స్పందిస్తూ, బీజేపీతో పొత్తు పెట్టుకోబోమని తెలిపారు. బీజేపీని వీపు మీద మోస్తామనడం, తమిళనాట వారు బలపడేందుకు అవకాశం ఇస్తామనడం కంటే పెద్ద జోక్ మరొకటి ఉండదని చెప్పారు. బీజేపీని మోయడం కంటే సొంత కేడర్‌ను బలోపేతం చేసుకోవడమే మేలని అన్నారు. తమిళనాడులో తమ పని తాము చూసుకుంటామని, వారి సంగతి వారు చూసుకుంటారని చెప్పారు.

ఔరంగజేబుతో మొఘలు సామ్రాజ్యం పతనం... రాహుల్‌తో కాంగ్రెస్ ఖతం



జైపూర్ : ఔరంగజేబు అధికారంలోకి వచ్చిన తరువాత మొఘలు సామ్రాజ్యం పతనం ప్రారంభమయిందని, రాహుల్ గాంధీ పగ్గాలు చేపట్టిన అనంతరం కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఇదేనని భారతీయ జనతా పార్టీ రాజస్థాన్ శాఖ ఉపాధ్యక్షుడు జ్ఞాన్‌దేవ్ ఆహుజా వ్యాఖ్యానించారు. ఔరంగజేబు మాదిరిగానే కాంగ్రెస్‌కు చివరి చక్రవర్తి రాహుల్ అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాజస్థాన్ రాష్ట్రంలోని రామ్‌గఢ్ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నిక ప్రచారం సందర్భంగా జ్ఞాన్‌దేవ్ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో దుమారం చెలరేగింది. గోవుల స్మగ్లర్లను ఉగ్రవాదులతో పోల్చుతూ ఆహుజా గతంలోనూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గత ఎన్నికల్లో ఆహుజా రామ్‌గఢ్ నుంచి గెలుపొందారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ ఆయనకు టిక్కెట్ ఇవ్వలేదు. ఎన్నికల సమయంలో ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన బీఎస్పీ అభ్యర్థి హఠాన్మరణం చెందడంతో ఎన్నిక వాయిదా పడింది. ఈ నెల 28న ఇక్కడ ఉప ఎన్నిక జరగనున్నది.

ఒక్క కండిషన్‌కు ఒప్పుకుంటే మద్దతు ఇస్తా

రాహుల్ గాంధీకి ఒవైసీ ఆఫర్



నాందేడ్ : మహా కూటమి ఏర్పాటులో బిజీగా ఉన్న కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సెటైర్లు వేశారు. మహా కూటమిలో ప్రకాశ్ అంబేద్కర్‌కు చెందిన బారిప్ బహుజన్ మహాసంఘ్ పార్టీకి గౌరవ స్థాయిలో సీట్లను కేటాయిస్తే కాంగ్రెస్‌కు తాను పూర్తిగా మద్దతు ఇస్తానని ఒవైసీ అన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రకాశ్ అంబేద్కర్ కోరుకున్నన్ని సీట్లు ఇవ్వాలని, మహారాష్ట్రలో ఎంఐఎంకు ఒక్క సీటు కూడా అవసరం లేదని చెప్పారు. రాహుల్ గాంధీ, శరద్ పవార్‌లకు ఎంఐఎంతో సమస్య ఉంటే తన పెద్దన్నయ్య ప్రకాశ్ అంబేద్కర్‌తో మాట్లాడాలని ఒవైసీ సూచించారు. ప్రకాశ్ అంబేద్కర్ స్థాయికి తగ్గట్టుగా సీట్లను ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిరస్కరిస్తున్నారనే విషయం తెలంగాణ ఎన్నికల్లో తేలిపోయిందని అన్నారు. రాహుల్ గాంధీ తనను తాను సమీక్షించుకునేందుకు ఇది సరైన సమయమని అన్నారు.

రైలులో యువతికి నెలసరి ఇబ్బంది
కేంద్ర మంత్రికి ట్వీట్

బెంగళూరు : అందివచ్చిన ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుంటూ, రైలు ప్రయాణికుల సమస్యలను తక్షణం పరిష్కరిస్తూ, మన్ననలు అందుకుంటున్న భారతీయ రైల్వే మరోసారి తన ఉదారత చాటుకుంది. రైలులో ప్రయాణిస్తున్న వేళ నెలసరి సమస్యతో బాధ పడుతున్న యువతికి టాబ్లెట్లు, శానిటరీ ప్యాడ్లు అందించింది.

బెంగళూరు నుంచి బళ్లారికి వెళుతున్న ఓ యువతికి రైలులో నెలసరి సమస్య ఏర్పడగా, ఆమె మిత్రుడు రాత్రి 11 గంటల సమయంలో 'ఇండియన్ రైల్వేస్ సేవ' యాప్ ద్వారా రైల్వే శాఖ మం త్రికి ట్వీట్ చేశాడు. ఆపై ఆరు నిమిషాల్లోనే అధికారులు ఆమె ప్రయాణిస్తున్న బోగీ వద్దకు వచ్చారు. వివరాలు ధ్రువీకరించుకుని, తదుపరి వచ్చే అరసికేరు రైల్వే స్టేషన్ అధికారులకు విషయం చెప్పారు. ఆ వెంటనే వారు ఆమెకు కావాల్సిన శానిటరీ నాప్కిన్స్, టాబ్లెట్లను సిద్ధం చేసి, రైలు రాగానే అందించారు. విషయం తెలుసుకున్న ప్రయాణికులు అధికారులను అభినందించారు.

నిత్యానంద అరెస్ట్ వారెంట్ రద్దు



బెంగళూరు : అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న నిత్యానంద స్వామిజీపై కోర్టు జారీ చేసిన అరెస్టు వారెంట్‌ను రామనగర కోర్టు రద్దు చేసింది. నిత్యానంద అనేక సార్లు కేసు విచారణకు హాజరు కాకపోవడంతో కోర్టు గత ఏడాది సెప్టెంబర్ 6న అరెస్టు వారెంట్ జారీ చేసింది. దీంతో నిత్యానంద కోర్టుకు అర్జీ సమర్పించగా విచారణ జరిపిన జిల్లా సింగిల్ బెంచ్ కోర్టు జడ్జీ దినేశ్ కుమార్ సదరు అరెస్టు వారెంట్‌ను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చారు. ఇదే కేసులో మరో నిందితుడు శివ వల్లభనేని అనే వ్యక్తిపై జారీ చేయబడిన అరెస్టు వారెంట్‌ను కోర్టు రద్దు చేసింది.

ఇదే సందర్భంగా సినీ నటి రంజిత నిత్యానందపై ఉన్న అత్యాచారం కేసులో ప్రాసిక్యూ షన్‌కు సహాయంగా ఉండడానికి అవకాశం కల్పించాలని పెట్టుకున్న అర్జీని కొట్టేసిన తీర్పును ప్రశ్నిస్తూ మరోసారి పెట్టుకున్న అప్పీల్‌ను కోర్టు తోసిపుచ్చింది. రంజిత బాధితురాలు కాదు కాబట్టి ఆమె పెట్టుకున్న అర్జీని తిరస్కరించడం సబబుగానే ఉందని కోర్టు మరోసారి అభిప్రాయపడింది.

కొనసాగుతున్న పేర్ల మార్పు ప్రక్రియ



లక్నో : ఉత్తర ప్రదేశ్‌లోని యోగి ఆదిత్యానాథ్ ప్రభుత్వం పేర్ల మార్పు ప్రక్రియను కొనసాగిస్తోంది. చందౌలీ జిల్లాలోని మొఘల్‌సరాయ్ తెహిసిల్ పేరును పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ తెహిసిల్‌గా మారుస్తూ తీసుకున్న నిర్ణయానికి శుక్రవారం రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ఆరెస్సెస్ సిద్ధాంతకర్త, భారతీయ జనసంఘ్ సహ వ్యవస్థాపకుడుగా వ్యవహరించారు. గత ఏడాది ఆగస్ట్‌లో మొఘల్‌సరాయ్ జంక్షన్‌ను పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ జంక్షన్‌గా మార్చిన సంగతి తెలిసిందే. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద జనసమ్మర్ద రైల్వేస్టేషన్‌గా పేరొందిన మొఘల్ సరాయ్ రైల్వే స్టేషన్‌ను ఇటీవల బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్, సీఎం యోగి ఆదిత్యానాథ్ ప్రారంభించారు. కాగా, ప్రముఖ నగరాలు, స్టేషన్లు, ఇతర సంస్థల పేర్లను యూపీ ప్రభుత్వం మార్చడం పట్ల రాష్ట్ర మంత్రి ఓమ్ ప్రకాష్ రాజ్‌భర్ అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. స్టేషన్‌ల పేర్లను మార్చినంత మాత్రాన రైళ్లు సకాలంలో రావని, రైల్వేల పని తీరును ప్రభుత్వం మెరుగుపరచాలని ఆయన చురకలు వేశారు. కాగా, ఇటీవల యూపీ ప్రభుత్వం చారిత్రక పట్టణం అలహాబాద్ పేరును ప్రయాగ్‌రాజ్‌గా మార్చిన సంగతి తెలిసిందే. అలహాబాద్‌కు ఆ పేరును 1575లో మొఘల్ చక్రవర్తి అక్బర్ ప్రతిపాదించారు.

సుప్రీం జడ్జిలుగా దినేష్, ఖన్నా ప్రమాణ స్వీకారం

న్యూఢిల్లీ : జస్టిస్ దినేష్ మహేశ్వరి, జస్టిస్ సంజీవ్ ఖన్నా శుక్రవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేశారు. సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ ఆధ్వర్యంలో కోర్టు నంబర్ 1లో వారు ప్రమాణ స్వీకారం చేశారు. ఖన్నా, దినేష్‌లతో కలసి సుప్రీం కోర్టు జడ్జిల సంఖ్య 28కి చేరింది. సుప్రీంలో మొత్తం 31 మంది జడ్జిలు ఉండవచ్చు. జస్టిస్ సంజీవ్ ఖన్నా ఢిల్లీ హైకోర్టు జడ్జిగా పని చేయగా, జస్టిస్ దినేష్ మహేశ్వరి కర్నాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాను కేంద్రం సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా నియమించడంపై అభ్యంతరాలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సుల మేరకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ ఆయన విషయంలో సీనియారిటీనీ పాటించలేదంటూ సుప్రీం కోర్టు న్యాయమూర్తితో పాటు మాజీ న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రదీప్ నంద్రజోగ్, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజేంద్ర మేనన్ సీనియర్లు అయినప్పటికీ, వారిని కాదని జస్టిస్ ఖన్నాను నియమించారంటూ అసంతృప్తి వ్యక్తమైంది.



ఢిల్లీలో ఉండను బాబోయ్ : సుప్రీం కోర్టు న్యాయమూర్తి

సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ మిశ్రా దేశ రాజధాని నగరంలో పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాను పదవీ విరమణ చేసిన అనంతరం న్యూఢిల్లీలో నివసించబోనని చెప్పారు. అందుకు కారణాలను వివరిస్తూ ఢిల్లీలో కాలుష్యం తీవ్రంగా ఉందని, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉందని తెలిపారు. దట్టమైన పొగ మంచు, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా జరిగిన కవాతు, కలుషిత గాలి వల్ల నగరంలో ప్రయాణం పీడ కలగా మారిందన్నారు. ట్రాఫిక్ వల్ల ఇద్దరు నూతన న్యాయమూర్తుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి దాదాపు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు.

నగరంలో కాలుష్యం తీవ్రమవుతోందని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ మిశ్రా ఈ వ్యాఖ్యలు చేశారు. ఇంతకు ముందు తాను ఢిల్లీలో నివసించాలని ఉత్సాహం చూపించేవాడినని తెలిపారు. ఇప్పుడు మాత్రం ఇక ఎంత మాత్రం ఉండకూడదనిపిస్తోందన్నారు. పదవీ విరమణ చేసిన తరువాత ఢిల్లీలో ఉండనని చెప్పారు. ఈ నగరం ఓ గ్యాస్ చాంబర్‌గా మారిందని వ్యాఖ్యానించారు.

సూర్య
హైదరాబాద్
శనివారం 19
జనవరి 2019

సూర్య స్పోర్ట్స్

ఏ స్థానంలో అయినా ఆడతా : ధోనీ

మెల్‌బోర్న్ : జట్టుకు అవసరమైనప్పుడు ఏ స్థానంలోనైనా ఆడేందుకు సిద్ధంగా ఉన్నానని టీమిండియా మాజీ సారథి మహేంద్రసింగ్ ధోనీ స్పష్టం చేశాడు. ఆసీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అందుకున్న త ర్వాత మీడియాతో మాట్లాడాడు. 231 పరుగుల లక్ష్య ఛేదనలో మహీ 114 బంతుల్లో 87 పరుగులు చేశాడు. వరుసగా మూడో అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. 2014 త ర్వాత అతడు ఒక సిరీస్‌లో వరుసగా మూడు అంతకన్నా ఎక్కువ అర్ధశతకాలు సాధిం చడం ఇదే తొలిసారి. జట్టుకు అవసరమైనప్పుడు ఏ స్థానంలో ఆడేందుకైనా సిద్ధం. నేను నాలుగో స్థానంలో ఆడినా, ఆరో స్థానంలో ఆడినా జట్టుకు సమతూకం తీసుకు రావడం కీలకం. 14 ఏళ్ల అనుభవం తర్వాత ఆరో స్థానంలో ఆడనని చెప్పలేను. పిచ్ చాలా మందకొడిగా ఉంది. షాట్లు ఆడటం కష్టమైంది. అందుకే క్రీజులో పాతుకుపోవాలని అనుకున్నాం. కేదార్ జాదవ్ అద్భుతంగా ఆడాడు. వినూత్నమైన షాట్లు ప్రయత్నించాడు. ఆసీస్ బౌలర్లు కఠినంగా బంతులు విసిరారు. కేదార్ బ్యాటు, బంతితో జట్టుకు సాయపడతాడు. కుల్‌దీప్ గతంలో ఆస్ట్రేలియాతో ఆడాడు. దీంతో ఊహించని విధంగా చాహల్‌ను తీసుకొని ఆశ్చర్యపరిచాం.



ఆసీస్ గడ్డపై ధోని అరుదైన ఘనత



మెల్‌బోర్న్ : టీమిండియా సీనియర్ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోని ఆస్ట్రేలియా గడ్డపై అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన సిరీస్ నిర్ణయా త్మక మ్యాచ్‌లో ధోని (87 నాటౌట్ : 114 బంతులు, 6ఫోర్లు) హాఫ్ సెంచరీ సాధించి భారత విజయంలో కీలక పాత్రపోషించిన విషయం తెలిసిందే. అదే సమయంలో అంతర్జాతీయ వన్డేల్లో ఆసీస్ గడ్డపై వెయ్యి పరుగులు పూర్తిచేసుకున్న నాలుగో భారత బ్యాట్స్‌మన్‌గా ధోని గుర్తింపు పొందాడు. 34 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ధోని ఈ ఫీట్‌ను అందుకున్నాడు. తద్వారా ఈ ఘనతను అందుకున్న సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి, రోహిత్ శర్మల సరసన చేరాడు. శిఖర్ ధావన్ వికెట్ అనంతరం క్రీజులోకి వచ్చి న ధోనికి తొలి బంతికే వెనుదిరిగాల్సి ఉన్నా.. అదృష్టం కలిసొచ్చింది. ధోని ఇచ్చిన సునాయస క్యాచ్‌ను మ్యాక్స్‌వెల్ జారవిడిచాడు. ఈ అవకాశాన్ని అందివుచ్చుకున్న ధోని.. ప్రశాంతంగా ఓ లెక్కప్రకారం ఆడుతూ భారత్‌కు విజయాన్నందించాడు. అయి తే ధోనికి మరోక లైఫ్ కూడా లభించింది. సిడిల్ వేసిన 39 ఓవర్ నాలుగో బంతి ధోని బ్యాట్‌కు ఎడ్జి కీపర్ అలెక్స్ క్యారీ చేతిలో పడింది కానీ ఆసీస్ ఫీల్డర్లు పెద్దగా అప్పీల్ చేయకపోవడంతో ధోని బతికిపోయాడు. మ్యాక్స్‌వెల్ ఒక్కడూ అప్పీల్ చేసినా.. అంపైర్ పట్టించుకోలేదు. అయితే టీవీ రిప్లేలో మాత్రం బంతి బ్యాట్‌కు తగిలినట్లు కనిపించింది. ఏది ఏమైనప్పటికి ఈ సిరీస్‌తో ధోని గాడినపడ్డాడు. కీలక సందర్భాల్లో రాణించి భారత్ సిరీస్ నెగ్గడంలో కీలక పాత్ర పోషించడంతో ధోనికి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ వరించింది. ఇక 2011 అనంతరం ధోని ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ సిరీస్ ముందు నిలకడలేమి ఆటతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న ఈ మాజీ కెప్టెన్.. ఈ సిరీస్‌లో రాణించడం, ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్‌గా నిలవడంతో అతని అభిమానులు పట్టరాని సంతోషంలో మునిగితేలుతున్నారు.

గెలిస్తే ఉత్త ట్రోఫీనా? ఆటగాళ్లకు డబ్బులివ్వరా?

క్రికెట్ ఆస్ట్రేలియాపై మండిపడ్డ సునిల్ గవాస్కర్



మెల్‌బోర్న్ : ఆసీస్ గడ్డపై చరిత్ర సృష్టించిన టీమిండియాకు నగదు పురస్కారాలు ఎందుకు అందజేయలేదని దిగ్గజ క్రికెటర్ సునిల్ గావస్కర్ క్రికెట్ ఆస్ట్రేలియాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరీస్ ద్వారా ఆదాయం సృూఎష్టించిన ఆటగాళ్లు అందులో వాటా పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆతిథ్య జట్టుతో నిర్ణయాత్మక పోరులో కోహ్లీసేన 7 వికెట్ల తేడాతో గెలవడంతో భారత్ తొలిసారి 2–1 తేడాతో అక్కడ ద్వైపాక్షిక సిరీస్ కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. మ్యాచ్ ముగిసిన తర్వాత మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చాహల్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ఎంఎస్ ధోనీకి క్రికెట్ ఆస్ట్రేలియా చెరో 500 డాలర్లు మాత్రమే అందజేసింది. ఆ మొత్తాన్ని ఆటగాళ్లు విరాళంగా ఇచ్చేశారు. ఆసీస్ మాజీ ఆటగాడు గిల్‌క్రిస్ట్ టీమిండియా సారథి విరాట్ కోహ్లీకి ట్రోఫీ అందజేశాడు. అంతే తప్ప ఎలాంటి నగదు బహుమతులూ అందజే యకపోవడంపై గావస్కర్ మండి పడ్డారు. అసలు 500 డాలర్లు ఏంటి? జట్టుకు కేవలం ట్రోఫీ మాత్రమే అందించడం బాధాకరం. మ్యాచ్ ప్రసార హక్కుల ద్వారా నిర్వాహకులు ఎంతో డబ్బు పొందారు. ఆటగాళ్లకు వారు నగదు ప్రోత్సాహకాలు ఎందుకు అందించకూడదు? అసలింత డబ్బు సంపాదించడానికి కారణం క్రికెటర్లే కదా. ఒకసారి వింబుల్డన్‌లో ఎంత డబ్బు ఇస్తారో చూడండి. ఆదాయ సృష్టికి కార ణం ఆటగాళ్లే. అందుకే వారిని నగదు పురస్కారాలతో సత్కరించాలి అని గావస్కర్ అన్నారు. 2018 వింబుల్డన్ పోటీల్లో తొలి రౌండ్లో ఓడిపోయిన వారికి రూ.36 లక్షలు, సింగిల్స్ విజేతకు దాదావు రూ.21 కోట్లు బహుమతిగా దక్కాయి.

ఈ విజయం ఆనందాన్నిచ్చింది : ఎమ్మెస్కే

న్యూఢిల్లీ : చరిత్రాత్మక ఆస్ట్రేలియా పర్యటనను భారత్ క్రికెట్ జట్టు ఘనంగా ముగించింది. మెల్‌బోర్న్ వన్డేలో ఏడు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. మూడు వన్డేల సిరీస్‌ను 2–1 తేడాతో గెలిచింది. ఇటీవల కంగారూ గడ్డపై తొలి టెస్ట్ సిరీస్ విజయాన్ని అందుకొని చరిత్ర సృష్టించిన టీమిండియా అక్కడ తొలి ద్వైపాక్షిక వన్డే సిరీస్ విజయంతో మరోసారి సరికొత్త చరిత్రను లిఖించింది. ఈ నేపథ్యంలో బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ ఈనాడు –ఈటీవీతో తన ఆనందాన్ని పంచుకున్నారు. చాలా సంతోషంగా ఉంది. స్వీప్ చేసినట్టు అనిపించింది. మన ఆటగాళ్లు అన్ని ఫార్మాట్లలో చక్కగా రాణించారు. అవకాశం కల్పించిన యువ ఆట గాళ్లు.. సీనియర్లు సమష్టి కృాఎషితో అన్ని ఫార్మాట్లలో చక్కటి విజయాలను భారత్‌కు అందించారు అని అన్నారు. ఈ సందర్భంగా ఈటీవీ అడిగిన పలు ప్రశ్న లకు ఆయన సమాధానాలు ఇచ్చారు.



దీన్నే ప్రపంచ కప్ జట్టుగా భావించాలా?

భిన్నమైన కూర్పులు ప్రయత్నిస్తున్నాం. ఎవరిని ప్రయత్నించినా వారు బాగా రాణిస్తున్నారు. త్వరలో జరగనున్న న్యూజి లాండ్ సిరీస్ తర్వాత పూర్తిగా ప్రపంచ కప్ జట్టుపైనే దృష్టి పెడతాం

చాహల్ ఆరు వికెట్లు తీయడంపై..

తొలి నుంచీ సంప్రదాయంగా కొనసాగిస్తున్న కూర్పులో ఆడించడానికి కాస్త కష్ట మైంది. కుల్దీప్ యాదవ్, హార్దిక్‌పాండ్య లేకపోవడంతో అదనంగా జడేజాను ఆడిం చాల్సి వచ్చింది. దానివల్ల చాహల్‌ను ఆడించలేకపోయాం. చాహల్ తనను తాను ఎప్పుడో నిరూపించుకున్నాడు. రెండు మ్యాచ్‌ల్లో ఆడకపోయినా సరే మనోధైర్యం కోల్పోకుండా అతడు ఆరు వికెట్లు తీయడం చాలా సంతోషంగా ఉంది. జట్టు ప్రణాళికలు, కూర్పులో అతడు నూరు శాతం ఉంటారనే నమ్మకం నాకుంది.

ధోని ఆటతీరుపై..

ధోనీ పరుగులు చేయడం తనకీ, దేశానికి మంచిది. ఆయన ప్రపంచ కప్‌లో ఉంటా డా అనేది ఇప్పుడే చెప్పలేం. కచ్చితంగా బాగా ఆడుతున్నాడు. అతడి అను భవం మాత్రం ఈ దేశానికి బాగా ఉపయోగపడుతుంది. ధోనీ అనుభవం ప్రపంచ కప్‌లో ఉపయోగపడుతుంది. ఈ టోర్నీలో ధోనీ బాగా రాణించడం, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ గా ఎంపికవడం జట్టులో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నట్టయిందన్నారు.

ఆసీస్ గడ్డపై...

కోహ్లిసేన అదరహో



ఆస్ట్రేలియాపై పరిపూర్ణ విజయం. తొలుత 1-1తో టీ20 సిరీస్ సమం. తర్వాత 2-1తో టెస్టు సిరీస్ కైవసం. ఇప్పుడు 2-1తో వన్డే సిరీస్ భారత్ సొంతం. ఓ పటిష్ఠ జట్టుపై విదేశాల్లో టీమిండియా అన్ని సిరీస్‌లను కోహ్లి నాయకత్వంలోనే అందుకోవడం అద్భుతం. నిర్ణయాత్మక చివరి వన్డే సాదా సీదాగా ఏమీ సాగలేదు. పిచ్ మందకొడిగా ఉండటంతో పరుగులు చేయడం కష్టమైంది. తొలుత మణికట్టు మాంత్రికుడు యుజువేంద్ర చాహల్ 6/42 చెలరేగడంతో ఆసీస్48.4 ఓవర్లకు 230 పరుగులు చేసింది. ఛేదనలో మహేంద్రసింగ్ ధోనీ (87; 114 బంతుల్లో 6స4), కేదార్ జాదవ్ (61; 57 బంతుల్లో 7స4) అజేయంగా నిలిచారు. నాలుగో వికెట్‌కు 116 బంతుల్లో 121 పరుగుల భాగస్వామ్యం అందించారు. విరాట్ కోహ్లి (46; 62 బంతుల్లో 3స4) సమయోచిత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు.

- **మొన్న టెస్టు సిరీస్, నేడు వన్డే...**
- **భారత్ ఖాతాలో డబుల్ ధమాకా!**
- **మెల్‌బోర్న్‌లో మెరిసిన కోహ్లి అండ్ కో**
- **2-1తో వన్డే సిరీస్ నెగ్గి భారత్ కొత్త చరిత్ర**
- **అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్న ధోని, జాదవ్**
- **మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చాహల్... సిరీస్ దక్కించుకున్న ధోని**

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియా గడ్డపై 2–1తో టెస్ట్ సిరీస్ నెగ్గి చరిత్ర సృష్టించిన టీమిండియా.. మూడు వన్డేల సిరీస్‌ను సైతం 2–1తో నెగ్గి ఈ చారిత్రక పర్యటనను ఘనంగా ముగిం చింది. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన చివరి వన్డేలో కోహ్లిసేన మెరిసింది. లెగ్ స్పిన్నర్ చహల్ బంతితో మాయ చేస్తే.. బ్యాట్‌తో మహేంద్రసింగ్ ధోని(87 నాటౌట్: 114 బంతులు, 6 ఫోర్లు), కేదార్ జాదవ్(61 నా టౌట్ :57బంతులు, 7ఫోర్లు)లు కడవరకు పోరాడి భారత్‌కు విజయాన్నందించారు.



చహల్ మ్యాజిక్

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీ స్.. చహల్ (6/42) దాటికి 48.4 ఓవర్లలో 230 పరుగులకు ఆలౌటైంది. హ్యాండ్ స్కోంబ్ (58) అర్ధసెంచరీ మినహా.. అలెక్స్ క్యారీ(5), ఫించ్(14) ఖవాజా (34), షాన్ మార్ష్ (39), మ్యాక్స్‌వెల్ (26), రిచర్డ్ సన్(16), ఫించ్(14), సిడిల్ (10)లు విఫలమయ్యారు. భారత్ బౌలర్లలో చహల్ 6 వికెట్లు తీయగా.. భువనేశ్వర్, షమీలు రెండేసి వికెట్లు దక్కించుకున్నారు.

231 పరుగుల సాధారణ లక్ష్యంతో బరి లోకి దిగిన భారత్‌కు ఆదిలోనే గట్టి ఎదురు దెబ్బ తగిలింది. రెండు వన్డేల్లో రాణించిన ఓపెనర్ రోహిత్ శర్మ (9) ఈ మ్యాచ్‌లో విఫలమయ్యాడు. సిడిల్ బౌలింగ్‌లో మార్ష్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన కెప్టెన్ కోహ్లితో శిఖర్ ధావన్ జట్టు స్కోర్‌ను 50 పరుగులు దాటించాడు. ఈ తరుణంలో శిఖర్ (23), స్టోయినిస్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. తర్వాత అనూహ్యంగా నాలుగో స్థానంలో బ్యాటింగ్ వచ్చిన ఎంఎస్ ధోని వచ్చిరావడంతోనే మ్యాక్స్‌వెల్‌కు క్యాచ్ ఇచ్చాడు. కానీ మ్యాక్సీ జారవిడచడంతో ధోని ఊపిరి పీల్చుకున్నాడు. ధోనితో కలిసి కోహ్లి ఆచితూచి ఆడుతూ.. మూడో వికెట్‌కు 54 పరుగులు జోడించాడు. అనంతరం కోహ్లి(46) కీపర్ క్యారీకి క్యాచ్ ఇచ్చి అర్ధశతకాన్ని చేజార్చుకున్నాడు.

ధోని హ్యాట్రిక్!

కేదార్ జాదవ్‌తో ధోని జాగ్రత్తగా ఆడా డు. ఈ క్రమంలో ధోని 74 బంతుల్లో 3 ఫోర్లతో కెరీర్‌లో 70వ అర్ధ సెంచరీతో ఈ సిరీస్‌లో హ్యాట్రిక్ సాధించాడు. తొలి రెండు వన్డేల్లో ఈ జార్ఖండ్ డైనమైట్ అర్ధ సెంచరీలు సాధించిన విషయం తెలిసిం దే. ఎప్పటిలానే ఎలాంటి సంబరాలు లే కుండా మరుసటి బంతికి ధోని సిద్దమ య్యాడు. ఇక ధోనికి మద్దతుగా జాదవ్ కూడా ఆచితూచి ఆడుతూ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 52 బంతుల్లో 5 ఫోర్లతో కెరీర్‌లో మూడో హాఫ్ సెంచరీ సాధించాడు. చివర్లో కొంత ఉత్కంఠ నెల కొన్నా ధోని, జాదవ్‌లు బౌండరీలు బాదడం తో భారత్ నాలుగు బంతులు మిగిలి ఉండగానే 7 వికెట్ల తేడాతో విజయాన్ని అం దుకుంది. ఆసీస్ బౌలర్లలో రిచర్డ్సన్, సిడిల్, స్టోయినిస్‌లకు తలో వికెట్ దక్కింది. ఇక ఈ మ్యాచ్ ప్రారంభంలో వరణుడు కొంత టెన్షన్ పెట్టడంతో ఆటకు కాసేపు అంతరా య కలిగింది. ఆరు వికెట్లతో చెలరేగిన చహల్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు వరించగా.. సిరీస్‌లో హ్యాట్రిక్ హాఫ్ సెంచరీలతో రాణించిన ధోనికి మ్యాన్ ఆఫ్‌ది సిరీస్ అవార్డు దక్కింది.

ధోనీకి ఛాన్స్ రావడమే... మమ్మల్ని విజయానికి దూరం చేసింది : లాంగర్

టీమిండియా సీనియర్ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనికి పలు అవకాశాలు ఇవ్వడం వల్లే తాము ఓడిపోయామని ఆస్ట్రేలియా జట్టు కోచ్ జస్టిన్ లాంగర్ అభిప్రాయపడ్డాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ.. ఆసీస్ ఆటగాళ్లు సాయశక్తుల పోరాడారు. కానీ 2–1తో సిరీస్ కోల్పోయాం. టెస్ట్ సిరీస్‌లానే ఈ సిరీస్‌ను గెలిచే అవకాశాలను చేతులారా చేజార్చుకుని ఓడిపోయాం. గొప్ప ఆటగాళ్లకు ఎప్పుడూ అవకాశం ఇవ్వద్దు. కానీ మా ఆటగాళ్లు అదే చేశారు. రెండు సార్లు ధోనిని ఔట్ చేసే అవకాశాన్ని చేజార్చు కున్నారు. ఇదే మా విజయఅవకాశాలను దెబ్బతీసింది. ఈ సిరీస్‌లో మాకు కొన్ని సానుకూల అంశాలు కనిపించాయి. స్టోయి నిస్ అద్భుతంగా రా ణించాడు. ఈ సిరీస్ ద్వారా రిచర్డ్సన్ వెలు గులోకి వచ్చాడు. అత ను అద్భుతంగా బౌలిం గ్ చేశాడు. మిడిలా ర్డర్‌లో హ్యాండ్‌స్కోంబ్ అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. షాన్ మార్ష్ సిరీస్ ఆసాంతం ఆకట్టుకున్నాడు. మాకు లభించిన అవకాశాలను అందుకోలేక ఓటమి పాలయ్యాం. మరోసారి ధోని అద్భుత ప్రదర్శన కనబర్చాడు. అతని ప్రదర్శన బ్యాటర్స్ అందరికి ఓ మార్గదర్శకత్వంలాంటింది. అని చెప్పుకొచ్చాడు. ఇక టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లిలో తనకు సచిన్ టెండూల్కర్ కనిపిస్తున్నాడని, అతను మైదానంలో 360 కోణంలో ఆడే షాట్స్ అద్భుతమని జస్టిన్ లాంగర్ కితాబిచ్చాడు. సచిన్ ఆటను ఎప్పుడూ ఆస్వాదించేవాడినని, ఈ సిరీస్‌లో విరాట్ ఆట చూస్తే అలానే అనిపించిందని ప్రశంసల జల్లు కురిపించాడు. కోహ్లి, ధోని, రోహిత్ శర్మలు ఆల్‌టైం గ్రేట్ క్రికెటర్స్ అని చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో గెలిచి.. 2–1తో సిరీస్‌ను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన ధోని(87 నాటౌట్: 114 బంతులు,6 ఫోర్లు)కి ఆసీస్ ఆటగాళ్లు రెండు సార్లు అవకాశం ఇచ్చారు. తొలి బంతికే ధోని ఇచ్చిన సునాయస క్యాచ్‌ను మ్యాక్స్‌వెల్ జారవిడచగా.. మరోసారి అప్పీల్ చేయకుండా తగిన మూల్యం చెల్లించుకున్నారు. సిడిల్ వేసిన 39వ ఓవర్‌లో బంతి ధోని బ్యాట్‌కు ఎడ్జి కీపర్ అలెక్స్ క్యారీ చేతిలో పడింది. కానీ ఆసీస్ ఫీల్డర్లు పెద్దగా అప్పీల్ చేయకపోవడంతో ధోని బతికిపోయాడు.



అద్భుతంగా ఆడారు చాంపియన్స్ : మహేశ్‌బాబు



హైదరాబాద్ : భారత్–ఆస్ట్రేలియాల మధ్య మెల్‌బోర్న్ వేదికగా జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేలో టీమిం డియా విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ సిరీస్‌లో ధోనీ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అందుకున్నారు. 231 పరుగుల లక్ష్య ఛేదనలో 114 బంతు ల్లో 87 పరుగులు చేశారు. వరుసగా మూడో అర్ధశతకంతో ఆకట్టుకున్నా రు. 2014 తర్వాత ఆయన ఒక సిరీ స్‌లో వరుసగా మూడు అంతకన్నా ఎక్కువ అర్ధశతకాలు సాధించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా టీమిండియాకు మహేశ్‌బాబు ట్విటర్ వేదికగా అభినందనలు చెప్పారు. ఆస్ట్రేలియాపై మొట్టమొదటి నిర్ణయాత్మక మూడో వన్డేలో విజయం సాధించిన టీమిండియాకు శుభాకాంక్షలు. అద్భుతంగా ఆడారు ఛాంపియన్స్. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ధోనికి కుడోస్. గొప్ప గేమ్ అంటూ విరాట్ కోహ్లిని మహేశ్ ట్యాగ్ చేశారు.

నన్ను జహీరే... మార్చేశారు : సిద్ధార్థ్ కౌల్

ముంబయి : టీమిండియా మాజీ పేసర్ జహీర్ ఖాన్ తన బౌలింగ్‌ను పూర్తిగా మార్చేశాడని పంజాబ్ పేసర్ సిద్ధార్థ్ కౌల్ అన్నాడు. ఆయన మార్గదర్శనంలోనే తన బౌలింగ్ రాటుదేలింద ని పేర్కొన్నాడు. 28 ఏళ్ల ఈ పంజాబ్ స్పీడ్‌స్టర్ న్యూజిలాండ్ సిరీస్‌కు ఎంపికయ్యాడు. పం జాబ్ తరఫున రంజీల్లో రాణించాడు. భారత్– ఏ తరఫున అదరగొట్టాడు. కౌల్ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తు న్న సంగతి తెలిసిందే. నా తొలి ప్రాధాన్యం దేశవాళీ క్రికెట్‌కే. పంజాబ్ తరఫున చేసిన ప్రదర్శనలే జాతీయ జట్టులో అవకాశం ఇప్పించాయి. న్యూజిలాండ్‌లో భారత్–ఏ తరఫున బౌలింగ్ చేశా. అక్కడి పిచ్‌లపై పూర్తి అవగాహన ఉంది. ఎప్పుడూ జట్టు గెలుపు కోసమే కష్టపడతా. నా మార్గనిర్దేశకుడు జహీర్ ఖాన్ నేతృత్వంలో నా బౌలింగ్ ప్రాథమిక అంశాలను మరింత పటిష్ఠం చేసుకున్నా. ఆయన చక్కని సలహాలు ఇస్తారు. బంతులు విసిరేటప్పుడు సింపుల్‌గా ఉండాలని సూచిస్తారు. ఆయన నాతో చాలా సమయం గడిపారు. నా బౌలింగ్ గురించి నోట్స్ రాసుకు న్నారు. బంతులు విసిరేటప్పుడు ఏ కండరాలు ఉపయోగించాలి, ఏ ప్రాంతాల్లో బంతులు వేయాలో చెప్పారు. భారత్–ఏ తరఫున న్యూజి లాండ్ వెళ్లేటప్పుడూ ఆయనతో మాట్లాడాను. ఆ సలహాలు అద్భుతంగా ఉపయోగపడ్డాయి. భారత్–ఏ కోచ్ రాహుల్ సర్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆయన జ్ఞానానికి వెలకట్టలేం. ఆయన సలహాలు నాకెంతగానో ఉపయోగ పడ్డాయి అని కౌల్ పేర్కొన్నాడు.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044·